తెలుగు

# సరళ భారతి

10వ తరగతి



1. ఈ గళ్ళలో తెలుగు భాషకు ఉత్తమ సాహిత్యాన్ని అందించిన ప్రఖ్యాత కవుల పేర్లు దాగి ఉన్నాయి. వాటిని కనుగొని గుర్తించండి. వివరాలను వికీపీడియాలో చదివి చక్కని గోడపత్రికను తయారు చేయండి. తరగతిలో ప్రదర్శించండి.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| త | సి | శ్రీ | నా | థు | డు | తా | దా |
| రి | నా | ము | ల్ల | జీ | టి | ళ్ళ | శ |
| గొం | రె | ద | శో | ర్జ | న | పా | ర |
| డ | అం | కా | ధూ | జ | న్న | క | థి |
| వెం | అ | ల్ల | సా | ని | య | తి | శ్రీ |
| గ | పా | ల్కు | రి | కి | ఎ | మ్ము | తి |
| మాం | రా | య | ప్రో | లు | జ్జ | కృ | శ్రీ |
| బ | మ్మె | ర | పో | త | న | ఉ | శ్రీ |

1. ____________ 7. ____________
2. ____________ 8. ____________
3. ____________ 9. ____________
4. ____________ 10. ____________
5. ____________ 11. ____________
6. ____________ 12. ____________

2. గడినుడి పూరించండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | ▨ | 2 | ▨ | 1 ఏ |
| | ▨ | 3 | | | ణా |
| | 4 | ▨ | | ▨ | పా |
| ▨ | | 5 | ▨ | 6 | ణి |
| 7 | | ▨ | 8 | | ▨ |
| ▨ | | | | | 9 |

ఆధారాలు :


అడ్డం:-
1. 'కోక'కు పర్యాయపదం (2)
3. కాశీకి మరోపేరు తడబడింది (4)
4. పిల్లలు తాగేవి తడబడింది (4)
5. ఒకటిలో నాలుగోవంతు అటునుంచి (2)
6. తొలి బేరం (2)
7. శకం అంటే (2)
8. ఏడు రోజులను ఇలా అంటారు (2)
9. తెలుగులో కృతజ్ఞతలు అటునుంచి (5)

నిలువు:-
1. చీమకు బహువచనం (3)
2. ఒక ఋతువు (3)
3. సరస్వతికి మరోపేరు (4)
4. చీమను రక్షించినది (4)

3. తెలుగు నాట ప్రసిద్ధి చెందిన, ప్రకృతి సిద్ధమైన రంగులతో చిత్రించే 'కలంకారీ'. మహారాష్ట్రలో పేర్కొనదగిన ఆదివాసుల 'వార్లీ' చిత్రకళలను సమ్మిళితం చేసి ఈ పాఠ్యపుస్తకం ముఖ చిత్రాన్ని చిత్రించారు చిత్రకారులు శ్రీ గండూరి శ్రీనివాస్ గారు. వాటిని సునిశితంగా పరిశీలించండి. విద్యార్థులు అట్టి చిత్రాలు వివిధ వస్తువులపై చిత్రించి ఆనందించే విధంగా ప్రోత్సహించండి.



ప్రభుత్వ తీర్మానం క్రమ సంఖ్య: అభ్యాస్-2116/(ప్ర.క్ర. 43/16) ఎస్‌డీ-4 తేది 25.4.2016 ప్రకారం స్థాపించబడిన సమన్వయ సమితి యొక్క తేది 29.12.2017 రోజు సమావేశంలో ఈ పాఠ్యపుస్తకమును 2018-19 విద్యాసంవత్సరం నుంచి నిర్దేశించుటకుగాను అనుమతి ఇవ్వబడినది.




954APC

మీ స్మార్ట్‌ఫోన్‌తో DIKSHA APP నుపయోగించి పాఠ్యపుస్తకం మొదటి పుటలోని QR CODE (క్విక్ రెస్పాన్స్ కోడ్)ను స్కాన్ చేసిన డిజిటల్ పాఠ్యపుస్తకం మరియు ప్రతి పాఠంలోని QR CODE ను స్కాన్ చేసిన ఆ పాఠానికి సంబంధించిన అధ్యయన-అధ్యాపన లకు ఉపయుక్తమగు దృశ్య-శ్రవణ సాహిత్యం లభిస్తుంది.

ప్రథమ ప్రచురణ : 2018

©మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411004
ఈ పుస్తకమునకు సంబంధించిన సర్వహక్కులు మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థవి. మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ సంచాలకుల లిఖితపూర్వక అనుమతి లేనిదే ఈ పుస్తకమునందలి ఏ భాగమును ఉటంకించుటగాని లేదా పునర్ముద్రించుటగాని చేయరాదు.

***Telugu Language committee***

Smt. B. Sarada, Chair Person
Smt. T. Suseela, Member
Smt. M. Vidya Benerji, Member
Smt. K. Anuradha, Member
Sri. B. Vijayabhaskar Reddy, Member
Dr. Smt. Thulasi Bharat Bhushan, Member-Secretary

**తెలుగు భాషా సమితి :**

శ్రీమతి భమిడిపాటి శారద- అధ్యక్షులు
శ్రీమతి టి. సుశీల- సభ్యులు
శ్రీమతి ఎమ్. విద్యా బెనర్జీ- సభ్యులు
శ్రీమతి కె. అనూరాధ- సభ్యులు
శ్రీ భూమనపల్లి విజయభాస్కర్‌రెడ్డి- సభ్యులు
డా॥ శ్రీమతి తులసీ భారత్ భూషణ్,
సభ్య-కార్యదర్శి

***Coordination***

Dr. Smt. Thulasi Bharat Bhushan
Special Officer, Telugu

**ప్రధాన సమన్వయకులు**

డా॥ శ్రీమతి తులసీ భారత్ భూషణ్,
విశేషాధికారిణి- తెలుగు,
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె.

***Cover***
**Sri Ganduri. Srinivas**
***Illustration***
**Sri Ghanshyam. Deshmukh**

**ముఖచిత్రం:**
శ్రీ గండూరి శ్రీనివాస్
**చిత్రములు:**
శ్రీ ఘనశ్యామ్ దేశముఖ్

***Telugu Language***

Smt. V. Rajeshwari
Sri. K. Y. Kondanana
Smt A.S. Yadav
Smt. Laxmi Prasad Chalasani
Sri Rajkumar Mutyalvar
Sri Mallesham Krishnahari Bethi

**తెలుగు భాషా అధ్యయన మండలి**

శ్రీమతి వి. రాజేశ్వరి
శ్రీ కె.వై. కొండన్న
శ్రీమతి ఎ. ఎస్. యాదవ్
శ్రీమతి లక్ష్మీ ప్రసాద్ చలసాని
శ్రీ రాజ్‌కుమార్ ముత్యాల్‌వార్
శ్రీ మల్లేశం కృష్ణహరి బేతి

***Publisher***

**Sri Vivek Uttam Gosavi**
Controller

**ప్రకాశకులు**

శ్రీ వివేక్ ఉత్తం గోసావి
నియంత్రకులు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ,
ప్రభాదేవి, ముంబయి-25

***Type Setting***
Quintex, Mumabi

**అక్షరకూర్పు**
**క్వింటెక్స్, ముంబయి**

***Type Setting***
**Sri Sachchitanand Afle**
Chief production officer
**Sri Rajendra Chindarkar**
Production officer
**Sri Rajendra Pandloskar**
Asst. Production offiicer

**నిర్మితి :**
శ్రీ సచ్చితానంద అఫ్లే - ముఖ్య నిర్మితి అధికారి
శ్రీ రాజేంద్ర చిందర్‌కర్ - నిర్మితి అధికారి
శ్రీ రాజేంద్ర పాండ్లోస్కర్ -
సహాయ నిర్మిత అధికారి

Paper: 70 GSM Creamwave
**కాగితము :**
Print Order No.
**ముద్రణాదేశము :** N/PB/2018-19/0.01
Printer : - M/s.Uchitha Graphics Printers
**ముద్రణ :** Pvt.Ltd.,Navi Mumbai

# భారత సంవిధానము

## ప్రస్తావన

**భారతదేశ ప్రజలమగు మేము**, భారతదేశమును **సార్వభౌమ్య సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణరాజ్యముగ** నెలకొల్పుటకు మరియు అందలి పౌరులెల్లరకు

సామాజిక, ఆర్థిక, రాజకీయ **న్యాయమును**,

భావము, భావప్రకటన, విశ్వాసము,

ధర్మము, ఆరాధన -- వీటి **స్వాతంత్ర్యమును**,

అంతస్తులోను, అవకాశములోను **సమానత్వమును**

చేకూర్చుటకు; మరియు వారందరిలో

వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను,

అఖండతను తప్పక ఒనగూర్చు **సౌభ్రాత్రమును**,

పెంపొందించుటకు; సత్యనిష్ఠా పూర్వకముగ తీర్మానించుకొని,

ఈ 1949వ సంవత్సరము నవంబరు ఇరువది యారవ

దినమున **మా సంవిధాన సభయందు ఇందుమూలముగ,**

**ఈ సంవిధానమును అంగీకరించి, అధిశాసనము చేసి**

**మాకు మేము ఇచ్చుకొన్నవారమైతిమి.**

## జాతీయ గీతము

జనగణమన – అధినాయక జయ హే
భారత – భాగ్యవిధాతా
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కల, బంగ,
వింధ్య, హిమాచల, యమునా, గంగా,
ఉచ్ఛల జలధితరంగ,
తవ శుభ నామే జాగే, తవ శుభ ఆశిస మాగే,
గాహే తవ జయగాథా,
జనగణ మంగలదాయక జయ హే,
భారత – భాగ్యవిధాతా
జయ హే, జయ హే, జయ హే,
జయ జయ జయ, జయ హే

## ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరు నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషిచేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడచుకొంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

# ప్రస్తావన

ప్రియమైన విద్యార్థి మిత్రులారా!

మీ అందరికి పదవతరగతిలోకి స్వాగతం. వర్ణ చిత్రాలతో అలరారే ఈ సరళభారతి మీ అందరికి ఇష్టమైన తెలుగు భాషాపుస్తకము. మిమ్మల్ని మీ మాతృభాషకు దగ్గర చేసేపుస్తకం. ఈ పాఠ్యపుస్తకమును మీకు అందించుచున్నందులకు మిక్కిలి ఆనందించుచున్నాము.

స్నేహితులారా! మనం, మన ఆలోచనలు, ఊహలు, భావనలను ఇతరులకు తగిన రీతిలో మరియు ప్రభావవంతంగా తెలియజెప్పాలంటే మనకు భాషపై పట్టు చిక్కాలి. ఈ పాఠ్యపుస్తక అధ్యయనం ద్వారా మీకు భాషపై ప్రభుత పెంపొందాలి. భాషలోని వివిధ పోకడలను తెలుసుకోవాలి. వాటిని సందర్భానుసారంగా, సునాయాసంగా ఉపయోగించగలగాలనుట ఆశించబడినది.

ఈ పాఠ్య పుస్తకంలో పాఠ్యాంశాలతో అనుసంధానం కలిగిన ఉత్సాహపూరిత అంశాలను చదివి, ఆ పిదప పాఠంలోకి ప్రవేశించే విధంగా ప్రారంభంలో నేపథ్యాలు కూర్చబడ్డాయి. కళలు, సంస్కృతి, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత మొదలగు వాటితో సహసంబంధాన్ని కూర్చే విధంగా పాఠ్యాంశాలు ఎన్నుకోబడ్డాయి. తద్వారా మీరు భాషలోని వివిధ మాధుర్యాలను తెలుసుకొని ఆస్వాదించగలరు. భాషాకౌశల్యాలన్నింటిని చక్కగా పెంపొందించుకొనుటకు అనువుగా వైవిధ్యముతో కూడిన అభ్యాసాలు పొందుపరచడం జరిగింది. వాటినన్నింటిని శ్రద్ధగా అభ్యసించగలరు.

పాఠ్యాంశాలేగాక వాటికి ఆవల గ్రంథాలయాలు, అంతర్జాలం, ప్రసార మాధ్యమాలలోని సముచిత సాహిత్యాన్ని సంప్రదింపు సాహిత్యంగా ఉపయోగించుకొనే రెఫరెన్స్ స్కిల్స్ అంతేగాక సమాచార ప్రసార సాంకేతిక పరిజ్ఞానాన్ని మీలో పెంపొందించే ప్రయత్నం కూడా చేయబడింది. అవగాహన, ఆలోచన, పరిశోధించి తెలుసుకొనుట, తెలుసుకొన్న వాటి విశ్లేషణ అన్వయం మీరు నేర్చుకోవాలి. పాఠశాల విద్య జీవితాంతము ఉపయోగపడుటకు ప్రాధాన్యత ఇవ్వబడింది.

స్వయముగా చేసి నేర్చుకొన్నది మనస్సులో స్థిరంగా నిలిచిపోతుంది. కాబట్టి ఈ పుస్తకంలో ప్రతి పాఠం వెనుక కృత్యాలు ఇవ్వబడినవి. అలాగే సృజనాత్మకత, స్వీయవ్యక్తీకరణ పెంపొందించడానికి పాఠాల ఆధారంగా అభ్యాసాలలో ప్రత్యేక స్థానం కేటాయించబడింది. మౌఖిక, లేఖన నైపుణ్యాలను అభ్యసించుటకు తగిన అభ్యాసాలు పొందుపరచబడ్డాయి. వాటిని శ్రద్ధగానేర్చుకొనగలరు. అంతేగాక యాప్ ద్వారా, క్యు.ఆర్. కోడ్ మూలంగా ప్రతి పాఠానికి సంబంధించిన అదనపు ఉపయుక్త దృశ్య -శ్రవణ సాహిత్యం లభిస్తుంది. అది మీ అధ్యయనానికి తప్పక ఉపయోగపడగలదు.

ఈ పాఠ్యపుస్తకాన్ని ఆనందంగా అభ్యసించండి. ఈ పుస్తకాన్ని గురించిన మీ భావనలు, అభిప్రాయాలను మాకు తప్పక తెలియజేయండి. మీ అందరికి శుభాభినందనలు.

(డా॥ సునిల్ మగర్)
సంచాలకులు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి
మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-4

పుణె
మార్చి 18వ తేదీ, 2018 ఉగాది
భారతీయ సౌరదినం: 27 ఫాల్గుణం 1939.

# భాషాధ్యయన సామర్థ్యాలు

### పదవ తరగతి – తెలుగు (సంయుక్త భాష)

| క్షేత్రం | సామర్థ్యాలు |
|---|---|
| శ్రవణం | • ఒకే విషయంపై గల అనేక కవితలను ఒక జట్టు చదువుచుండగా రెండవ జట్టు వారు ఆసక్తితో, శ్రద్ధగా వింటారు.<br>• వివిధ రకాల వ్యవహారిక భాష, గ్రాంథిక భాషల్లోని కథలను అవగాహనతో వింటారు.<br>• వివిధ గద్య, పద్య పాఠ్యాంశాల్లోని భాషా విశిష్టతను గుర్తించుటకై జరిపిన చర్చలను అవగాహనతో వింటారు.<br>• వివిధ రకాల సాహిత్యాన్ని విని భావాన్ని ఆకళింపు చేసుకుంటారు.<br>• వివిధ సాహిత్య ప్రక్రియలను విని అభిప్రాయ నిర్ధారణ చేసుకుంటారు. |
| భాషణ/ సంభాషణం | • సందర్భానుసారంగా స్వీయ అభిప్రాయాలను సూటిగా తగిన పదాలను/వాక్యాలను ఉపయోగిస్తూ వెల్లడిస్తారు.<br>• విన్న వార్తలను, విషయాలను గురించి చర్చిస్తారు.<br>• వివిధ భాషాసంస్కృతుల గురించి ధారాళంగా సంభాషిస్తారు.<br>• వివిధ కార్యక్రమాల ప్రణాళికల గురించిన చర్చలలో పాల్గొంటారు.<br>• ఇచ్చిన అంశం మీద తొట్రుపడకుండా ఆత్మవిశ్వాసంతో ఉపన్యసిస్తారు.<br>• వివిధ వార్తలు, సందేశాలు, సమాచారాలను అర్థం చేసుకొని తులనాత్మక చర్చలు చేస్తారు. |
| పఠనం | • పాఠ్య, పాఠ్యేతర సాహిత్యంలో తనకు కావలసిన సమాచారాన్ని సేకరించే దృష్ట్యా ప్రతిభావంతంగా మౌనపఠనం చేయడం.<br>• అంతర్జాలంలోని వివిధ సంకేత స్థలాలలో, బ్లాగులలో లభించు సమాచారాన్ని సత్యాసత్యాల దృష్ట్యా విచికిత్సతో పఠిస్తారు.<br>• దైనందిన జీవనంలోని పనుల దృష్ట్యా వివిధ దరఖాస్తులు, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన వివిధ పత్రాలు, మొదలగునవి చదివి అర్థం చేసుకుంటారు.<br>• తగిన ఉచ్చారణతో, విరామ చిహ్నాలు నియమాలను పాటిస్తూ ఆంశానికి తగినట్లుగా స్వరంలోని హెచ్చు తగ్గులతో, స్పష్టంగా, ఆత్మవిశ్వాసంతో ప్రకాశ పఠనం చేస్తారు.<br>• అంతర్జాలంలో ఈ పుస్తకాలను పఠనం చేస్తారు. |
| లేఖనం | • అంశాల ఆధారంగా అధికార–అనధికార లేఖలు రాస్తారు.<br>• అంశాల ఆధారంగా నివేదికలు రాస్తారు.<br>• విషయానుగుణంగా, అంశాల ఆధారంగా చక్కని వ్యాసాలు రాస్తారు.<br>• సృజనాత్మకంగా ప్రకటనలు, కవితలు, నినాదాలు రాస్తారు.<br>• ఇచ్చిన అంశం ఆధారంగా, ఆకర్షణీయమైన గోడపత్రికలు తయారు చేస్తారు.<br>• దైనందిని రాసుకునే అలవాటును చేసుకుంటారు.<br>• తమకు కావలసిన సమాచారం దృష్ట్యా ఉపాధ్యాయుడు బోధించుచున్నప్పుడు తరగతిలోను, అదే విధంగా గ్రంథాలయాలు, అంతర్జాలం, వివిధ పత్రికలు చదువుచున్నప్పుడు అంశాలను నమోదు చేసుకుంటారు.<br>• నిత్య జీవితంలో అవసరమయ్యే దరఖాస్తులు, లేఖలు, బ్యాంకు లావాదేవి పత్రాలను పూరిస్తారు/రాస్తారు |
| అధ్యయన నైపుణ్యాలు | • నిత్యజీవితంలో భాషను చక్కగా ఉపయోగించుకుంటారు.<br>• పాఠ్య, పాఠ్యేతర అధ్యయనానికి సహకారంగా నిఘంటువులు, సందర్భ గ్రంథాలు, సాహిత్యాన్ని ఉపయోగించుకొనే నేర్పును అవగతం చేసుకుంటారు.<br>• వార్తలు, ప్రకటనలు మొదలగు వాటిని గురించి తులనాత్మక దృష్టితో ఆలోచించి నిర్ణయించుకోగలుగుతారు.<br>• వ్యావహారిక, గ్రాంథిక, మాండలిక భాషా రకాలను తెలుసుకుంటారు. భాషాసౌందర్యాన్ని రసాస్వాదన చేస్తారు.<br>• ఆత్మవిశ్వాసంతో ఉపన్యసిస్తారు. పాఠశాల వార్షికోత్సవాలలో వక్తృత్వ పోటీలలో పాల్గొంటారు.<br>• సమాచార ప్రసార సాంకేతిక పరిజ్ఞానము (ICT)లో అంతర్భాగంగా విజువల్ ప్రజెంటేషన్, వికీపీడియా, యూనికోడ్ ఫాంట్స్, ఫోనేటిక్ కోబోర్డ్ మొదలగు వాటిని గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటారు. సునాయాసంగా ఉపయోగిస్తారు. |

| | |
|---|---|
| **భాషావగాహన** | • 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థుల కొరకు భాషావగాహనకు సంబంధించిన ముఖ్యమైన అంశాలు కింద నమోదు చేయడం జరిగింది. వాటిలో ప్రతి తరగతిలో ఆయా తరగతులలోని పాఠ్యాంశాల ఆధారంగా ఎన్నుకోబడిన అంశాలు సందర్భానుసారంగా క్రమమైన పద్ధతిలో చేర్చడం జరుగుతుంది. అంశాల ఎన్నికలో విద్యార్థుల యొక్క వయోపరిమితి పరియు పునర్విమర్శలను దృష్టిలో ఉంచుకోబడతాయి. 10వ తరగతి ముగిసే వరకు విద్యార్థులలో కింది అన్ని అంశాలలో సర్వసాధారణ జ్ఞానాన్ని పెంపొందించాలనునది ఆశింపబడుచున్నది.<br>• భాషాభాగాలు : కాలములు/రకాలు<br>• వాక్యరకములు (సామాన్య, సంయుక్త)<br>• విభక్తులు – ప్రత్యయములు, వచనము, వాచకము, కాలములు<br>• సామాన్య, సంయుక్త వాక్యాలు, సంధి విడదీయుట, సంధి చేయుట<br>• వాక్యాంగాలు (కర్త, కర్మ, క్రియలు)<br>• సృజనాత్మక లేఖనం – వర్ణనలు/స్వానుభవాలు, గోడపత్రికలు ప్రకటనలు – నినాదాలు – కవితలు మొదలగునవి<br>• అధికార–అనధికార లేఖలు<br>• వ్యాసాలు<br>• అనువాదాలు |

## ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు.......

1. విని నేర్చుకోవడం– చూసి నేర్చుకోవడం– చేసి నేర్చుకోవడం ఉత్తరోత్తర ప్రభావవంతాలు. ఈ పాఠ్యపుస్తకం జ్ఞాననిర్మితి సిద్ధాంతాన్ని అనుసరించి విద్యార్థులే స్వయంగా కృత్యాలు చేస్తూ భాషాధ్యయనం చేసే విధంగా కృత్య ప్రధానంగా రూపొందించబడినది. అందుకుగానూ ప్రతి పాఠానికి 'అ, ఆ, ఇ' అను మూడు అంచెల భాషాకృత్యాలు ఇవ్వబడ్డాయి. అందులో 'అ' అనునది కృత్యానికి పూర్వసంసిద్ధత. 'ఆ' అనునది భాషావగాహనకు సంబంధించింది. 'ఇ' అనునది స్వీయ స్పందన.
2. విద్యార్థులు ఉత్సాహంతో, ఉత్కంఠతో పాఠాన్ని చదువుట/వినుట కొఱకు 'పాఠంలోకి ప్రవేశించేముందు' అనుశీర్షికలో కొంత నేపథ్యం ఇవ్వబడింది. దానిని మీరు, విద్యార్థులు చక్కగా ఉపయోగించుకొనగలరు.
3. కొత్త, పాతల మేలు కలయికగా కూర్చబడిన పాఠ్యాంశాలను ప్రాచీన– ప్రస్తుత పరిచిత విషయాలతో అనుసంధానం చేస్తూ బోధించినచో పాఠశాల విద్య విద్యార్థులకు మనస్సులో నిలిచిపోతుంది. నిత్య జీవితంలో ఉపయోగపడుతుంది.
4. ఈ తరగతికి కేటాయించిన భాషాధ్యయన సామర్థ్యాలను సాధించుటకు అలాగే విద్యార్థులకు పెంపొందించవలసిన నైతిక, మానవీయ విలువలు, జీవన కౌశల్యాలు మొదలగు వాటిసన్నింటిని సందర్భాను సారంగా, పాఠ్యంశాల ఆధారంగా నేర్పుటకు తగిన బోధన వ్యూహాలను ఎంపిక చేసుకోవాలి. ప్రతి విద్యార్థి అధ్యయన అధ్యాపన ప్రక్రియలో భాగస్వాములయ్యేలా శ్రద్ధ వహించాలి. అదే విధంగా 'జట్టుపనిని' ప్రోత్సహించాలి.
5. గ్రంథాలయం, అంతర్జాలం, ప్రసార మాధ్యమాలను జ్ఞానార్జనకు ఉపయోగించుకోనే రెఫరెన్స్ స్కిల్స్ 'గ్రంథాలయ సమయం, 'అంతర్జాలంలో వెదుకుదాం – అదనపు సమాచారం తెలుసుకుందాం'' అను శీర్షికల ద్వారా పెంపొందించుట మిక్కిలి ఆవశ్యకము.
6. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించే రీతిలో స్వీయాభిప్రాయాలను, సృజనాత్మకతలను ప్రకటించే అవకాశం కల్పించాలి. వారి భావనలను కించపరచడం, ఖండించడం ఎట్టి పరిస్థితులలో చేయరాదు.
7. సాధారణంగా దైనందిన జీవనంలో ఇంగ్లీషు, మరాఠీ, తెలుగు భాషలలో సూచనాఫలకాలు, జన జాగృతి ఫలకాలు మొదలగునవి తరచు తారసపడుతుంటాయి. వాటిని అవగాహన చేసుకొనుట మిక్కిలి 'అవగాహన చేసుకుందాం – అనువాదం చేద్దాం' అను శీర్షికలో కొన్ని నమూనాలు ఇవ్వబడ్డాయి. మరికొన్నింటి సహాయంతో ఈ నైపుణ్యాన్ని పెంపొందించగలరు.
8. భాష–గమ్మత్తు, సౌందర్యం మొదలగునవి కేవలం పఠనాసక్తిని పెంపొందించుటకు భాషా మాధుర్యాన్ని ఆస్వాదించుటకు ఉద్దేశింపబడినవేకాని పరీక్షించుటకు కాదు.'

(లేఖన కౌశల్యములు పుస్తకము చివర వివరముగా ఇవ్వబడినవి. వాటిని అవగాహన చేసికొని, విద్యార్థులు కృత్యములు సాధించుటకు అవసరమైన మార్గదర్శకమును చేయవలెను)

# విషయ సూచిక

## పద్యభాగం


| క్రమ సంఖ్య | పద్యం/గేయం/పాఠం పేరు | కవి/రచయిత పేరు | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | స్వాతంత్ర్య పతాక | శ్రీ సుంకర సత్యనారాయణ | 1 |
| 2. | పరివర్తన | శ్రీ గండూరి లక్ష్మీనారాయణ | 4 |
| 3. | విదురనీతి | తిక్కన | 9 |
| 4. | సంతృప్తి | శ్రీ మహీధర నళినీమోహన్ | 12 |
| 5. | ఉగాది | శ్రీ గుండాల వేంకట కృష్ణారావు | 17 |
| 6. | వాషింగ్‌టన్ | కీ.శే. నాళం కృష్ణారావు | 22 |


## గద్యభాగం


| క్రమ సంఖ్య | పద్యం/గేయం/పాఠం పేరు | కవి/రచయిత పేరు | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | రియల్ హీరో | శ్రీ పెండెం జగదీశ్వర్ | 26 |
| 2. | స్నేహబంధం | శ్రీ కందేపు సుధాకర్ | 31 |
| * | రాట్నం రంగప్ప! దారం దానప్ప! (ప్రకాశ పఠనం) | శ్రీ పెండెం జగదీశ్వర్ | 36 |
| 3. | నా అనుభవాలు | కు. ఎస్. మేనక | 37 |
| 4. | కలంకారీ | | 41 |
| * | వార్లీ చిత్రకళ (మౌన పఠనం) | | 46 |
| 5. | వెదకబోయిన తీగ | శ్రీ పెండెం జగదీశ్వర్ | 47 |
| 6. | ఈశ్వర చంద్ర విద్యాసాగర్ | కీ. శే. డా॥ కరుణశ్రీ | 51 |
| 7. | మనసుంటే మార్గముంటుంది (వార్తా పత్రిక కత్తిరింపు) | | 55 |
| 8. | సార్థకం | కీ.శే. డా॥ రావూరి భరద్వాజ | 59 |
| | వ్యాకరణం – 63 | లేఖన కౌశల్యాలు –64 | |



# 1. రియల్ హీరో

**పాఠంలోకి ప్రవేశించేముందు:**

- ఉత్కంఠ – దీనినే ఆంగ్లంలో సస్పెన్స్ అంటారు.
- కొన్ని విషయాలను లేదా కథలను ఊరిస్తూ, ఊరిస్తూ అసలు విషయాన్ని త్వరగా చెప్పకుండా ఉత్కంఠను పెంచుతూ జాప్యం చేసి చివరకు రోమాంచకం కలుగునట్లు అంతిమఘట్టాన్ని చెప్పడం పాఠకుల ఆనందాన్ని ఇనుమడింపచేస్తుంది.

ఇప్పుడు ఆ పంథాలో పెండెం జగదీశ్వర్‌గారు చెప్పిన ఈ కథను చదవండి. చివర్లో మీరు తప్పక చప్పట్లు కొడతారు సుమా!

---

"ఒరే పిల్లలూ! రేపు మన బడికి ఒక హీరో వస్తున్నాడు. మనమంతా ఆయనకు ఘనంగా స్వాగతం పలకాలి. అందుకని మీరంతా పూలమాలలతో సిద్ధం కావాలి" అన్న తెలుగు టీచరు శర్మ మాటలు విని పిల్లలంతా ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచారు. నిజమా అన్నట్టు చూశారు. శర్మ మళ్ళీ "నేను చెప్పేది నిజమేనర్రా! నా ఆహ్వానం మేరకు ఆయన మన బడికి రావడానికి అంగీకరించాడు. రేపు ఉదయమే వచ్చి సాయంత్రం దాకా మనతోనే ఉంటాడు. మీరు అడిగే ప్రశ్నలన్నింటికీ జవాబులు చెప్తాడు" అన్నారు పిల్లలందరి వైపు చూస్తూ.


పిల్లలు ఇంకా నమ్మలేనట్టుగా చూస్తుండిపోయారు. హీరో ఏమిటి? తమ బడికి రావడమేమిటి అని విస్మయం చెందారు. "ఎవరా హీరో? ఏయే సినిమాల్లో నటించాడు? అతను మీకెలా తెలుసు?" అంటూ శర్మ మీద ప్రశ్నల వర్షం కురిపించారు. దానికాయన చిరునవ్వు నవ్వి "ఇవన్నీ తెలుసుకోవడానికి రేపటి వరకు ఆగాల్సిందే!" అంటూ తరగతి గదిలోంచి బయటకు నడిచారు.

పిల్లలంతా గోలగోలగా హీరో గురించి మాట్లాడుకున్నారు. కాసేపటికి అందరి చూపులు విమల్ వైపు తిరిగాయి. విమల్ ముఖంలో చెప్పలేనంత ఆనందం కనిపించసాగింది. విమల్‌కు హీరో కావాలని బలమైన కోరిక. చక్కగా డాన్సులు చేస్తుంటాడు. కరాటే కూడా నేర్చుకున్నాడు. తన స్నేహితులతో తరచూ సినిమా డైలాగులు చెబుతూ అలరింపజేసేవాడు. బడిలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో నాటకాలు వేసేవాడు. అద్భుతంగా నటించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. పెద్దయ్యాక ఏమవుతావని ఎవరడిగినా హీరోనయ్యి పెద్ద పెద్ద సినిమాల్లో నటిస్తానని చెప్పేవాడు. అతని అభిరుచుల గురించి, ఆశయం గురించి టీచర్లకు, తోటి పిల్లలకు బాగా తెలుసు.

"ఇంకేంటి విమల్! హీరో కావడమెలాగో, సినిమాల్లో నటించడమెలాగో తెలుసుకునేందుకు ఇదే నీకు మంచి అవకాశం!" అంటూ విమల్ భుజం మీద చేయి వేస్తూ అతని పక్కన కూర్చున్నాడు ప్రణవ్. "ఔనౌను! విమల్‌కు ఇలాంటి అవకాశం మళ్ళీ వస్తుందో రాదో!" అంటూ వారి పక్కకు వచ్చి చేరాడు కోవింద్. మిత్రులిద్దరి వైపు అభిమానంగా చూస్తూ చిరునవ్వు నవ్వాడు విమల్.

ఆరోజు సాయంత్రం విమల్ తనకు తెలిసిన వాళ్ళ ఇళ్ళన్నీ తిరిగి రకరకాల పూలు సేకరించుకువచ్చాడు. తను హీరోకు వేసే దండ అందరి దండల కంటే విభిన్నంగా ఉండాలని, తాను ప్రత్యేకంగా హీరో దృష్టిలో పడాలని అతని తాపత్రయం. అందుకని అమ్మతో చెప్పి చక్కగా మాల కట్టించాడు. పెద్దగా, అందంగా ఉన్న ఆ మాలను చూసి మురిసిపోయాడు. అవాళ రాత్రి విమల్‌కు నిద్రే పట్టలేదు. హీరోతో ఎలా మాట్లాడాలి? ఏయే విషయాల గురించి అడగాలి? ఎలా ఫోటోలు తీయించుకోవాలి? అనే విషయాల గురించి ఆలోచిస్తూ ఎప్పుడో అర్ధరాత్రి దాటాక నిద్రలోకి జారుకున్నాడు. తాను హీరో అయిపోయి సినిమాల్లో నటిస్తున్నట్టు ఎన్నెన్నో కలలుగన్నాడు. ఒక విమలే కాదు, అందరు పిల్లలు అదే విషయం గురించి రకరకాల ఆలోచనలతో చాలా సేపటిదాకా నిద్రపోలేదు.


తెల్లవారగానే తయారయ్యి అందరికన్నా ముందుగా బడికి చేరుకున్నాడు విమల్. పిల్లలందరు ఒక్కొక్కరుగా తమ పూలమాలలతో వచ్చి చేరారు. కొందరైతే హీరోకు ఇవ్వడానికి ఏవో బహుమతులను కూడా తెచ్చారు. టీచర్లతో సహా అందరూ విమల్ తెచ్చిన దండ చాలా బాగుందని మెచ్చుకున్నారు. పొంగిపోయాడు విమల్.



హీరో కోసం
సభావేదికను ఏర్పాటు చేశాక
శర్మ "హీరోగారు కొద్దిసేపట్లో రానున్నారు.
మనందరం బస్ స్టేషన్‌కు వెళ్ళి ఆయనకు స్వాగతం
పలుకుదాం పదండి!" అన్నారు. అది విని పిల్లలు
ఆశ్చర్యపోయారు. "హీరో బస్సులో రావడమేమిటి? ఆయనకు
కారు లేదా? ఒకవేళ ఉన్నా తమకు ఆశ్చర్యం కలిగించడానికి
ఇలా వస్తున్నాడా?" అని తమలో తాము మాట్లాడుకుంటూ
శర్మతో కలిసి బస్ స్టేషన్‌కు వెళ్ళారు పిల్లలంతా.

కాసేపటికి బస్సు వచ్చింది. పిల్లలందరిలో చెప్పలేనంత ఉత్కంఠ. ఊపిరి బిగబట్టి బస్సు వైపు చూడసాగారు. తమ ఊరి వాళ్ళే తమకు తెలిసిన వాళ్ళే చాలామంది బస్సు దిగి వెళ్ళిపోయారు. ఆఖరిగా సైనిక దుస్తుల్లో ఉన్న ఒక వ్యక్తిభుజాన సంచితో బస్సు దిగాడు. అతన్ని చూడగానే శర్మ ఆనందంగా "అదిగో హీరో వచ్చేశాడు!" అని గట్టిగా అన్నారు పిల్లలంతా ఆ వ్యక్తివైపు చూసి విస్తుపోయారు. ఇది వరకు అతడిని ఏ సినిమాలోనూ చూడలేదు. ఏ టీవీలోనూ కనిపించలేదు. వారికతను పూర్తిగా కొత్త వ్యక్తి. పిల్లలు అయోమయంలో మునిగి ఉండగా ఆ వ్యక్తి నేరుగా వచ్చి శర్మ పాదాలకు నమస్కరించాడు. శర్మ అతడిని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. పిల్లలంకేం అర్థం కాలేదు. శర్మ సూచన మేరకు ఒకరిద్దరు వచ్చి అతని మెడలో పూలమాలలు వేశారు.అందరు కలిసి బడికి వెళ్ళారు. పిల్లల మెదళ్ళలో సవాలక్ష ప్రశ్నలు!

సభా కార్యక్రమం మొదలైంది. శర్మ మాట్లాడుతూ "నేను చెప్పిన హీరో ఇతనే! పేరు కెప్టెన్ భగత్. ఒకప్పటి నా శిష్యుడు. చిన్నప్పటి నుంచి సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని కలలుగన్నాడు. ఆ కలను నెరవేర్చుకున్నాడు. ఎన్నో యుద్ధాల్లో పాల్గొని శత్రుసైన్యాలతో పోరాడాడు. తుపాకీ గుళ్ళను సైతం భరించాడు. హీరో అనగానే మీ ఊహల్లో సినిమా హీరో మెదిలాడు. ఆ హీరో తన



వృత్తిలో భాగంగా నటిస్తూ మనకు ఆనందాన్ని కలిగించవచ్చు కానీ ఈ హీరో తన వృత్తి ధర్మం కోసం జీవిస్తూ తన ప్రాణాలను పణంగా పెట్టి మన జీవితాలను కాపాడుతున్నాడు ఇప్పుడు చెప్పండి ఇతను రియల్ హీరోనా కాదా?" అన్నారు పిల్లల వైపు సూటిగా చూస్తూ.

అప్పటిదాక నిశ్శబ్దంగా వింటున్న పిల్లలందరు శర్మ మాటలకు వెంటనే స్పందించారు. ఒక్కసారిగా "రియల్ హీరో కెప్టెన్ భగత్‌కు జై!" అంటూ నినాదాలు చేశారు. భగత్ పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ సరిహద్దులో ఉండే పరిస్థితులు, శత్రు సైన్యాల దాడులు, మన సైనికుల వీరోచిత చర్యల గురించి వివరంగా చెప్పాడు. పోరాటాల్లో తన శరీరానికి తగిలిన గాయాల గుర్తులను చూపించాడు. పిల్లలు ఉద్వేగభరితంగా చూస్తుండిపోయారు. సైన్యం గురించి కొంతమంది పిల్లలు వ్యక్తం చేసిన సందేహాలకు ఆయన వేదికపై నుంచే సమాధానమిచ్చాడు.

తరువాత పిల్లలందరు వరుసగా భగత్‌ను పూలమాలలతో సత్కరించడం మొదలుపెట్టారు. భగత్ ప్రతి విద్యార్థితో కరచాలనం చేస్తూ "పెద్దయ్యాక నువ్వు దేశానికి ఏ విధంగా సాయపడతావు?" అని అడగసాగాడు. "నేను డాక్టరునై ప్రజల ఆరోగ్యాలను కాపాడతాను!" అని చెప్పింది సాత్విక. "నేను లాయరునై అన్యాయాలను అరికడతా!" అన్నాడు శ్రీజన్. "నేను టీచరునై ఎంతోమంది పిల్లలను తీర్చిదిద్దుతాను!" అంది వాత్సల్య.

ముందు వరుసలో కూర్చుని గాఢమైన ఆలోచనలో మునిగి ఉన్న విమల్‌ను చూసిన శర్మ "విమల్ నువ్వింకా రాలేదేం? త్వరగా వచ్చెయ్!" అని పిలిచారు. తేరుకున్న విమల్ వెంటనే లేచి వేదికపైకి వెళ్ళాడు. ఎంతో అభిమానంగా భగత్ మెడలో పూలమాల వేశాడు.

భగత్ కృతజ్ఞతలు చెప్పి, చిరునవ్వుతో కరచాలనం చేస్తూ "మరి నువ్వేమవుతావు?" అనడిగాడు.

అందుకు విమల్ "హీరోనవుతా! మీలాగా!" అన్నాడు ఆనందం నిండిన కళ్ళతో.

---

## I. వినండి-సంభాషించండి:

1. మీకు తెలిసిన వీరజవానుల పేర్లను తెలపండి.
2. దేశ రక్షణకు జవానులు (సైనికులు) ఏ విధంగా కృషి చేస్తున్నారో సంభాషించండి.

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### పదజాలాన్ని పెంపొందించుకుందాం.

విస్మయం = ఆశ్చర్యం; అద్భుతము = అబ్బురము; అభిరుచి = ఇష్టం; ఆశయం = మనసులోని కోరిక;
ఉత్కంఠ = అధికమైన ఆసక్తి; ఉద్వేగం = వ్యాకులత, కలత.

## III. కృత్యము

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనానుసారం కృత్యమును చేయండి.

అ. అల్లిక

భగత్ పిల్లలనుద్దేశించి మాట్లాడిన మాటలు



పరిచ్ఛేదం: పుట సంఖ్య 28లోని "అప్పటిదాకా నిశ్శబ్దంగా వింటున్న.... అంది వాత్సల్య" – వరకు

ఆ. గీత గీసిన పదాలకు పరిచ్ఛేదములో వాడిన పదాలను గుర్తించి పూర్తి వాక్యం రాయండి.

1) నేను డాక్టరునై జనుల ఆరోగ్యాలను కాపాడతాను
2) నేను టీచరునై ఎంతోమంది బాలలను తీర్చిదిద్దుతాను
3) పిల్లలందరు శర్మ పలుకులకు వెంటనే స్పందించారు
4) భగత్‌ను పూల దండలతో సత్కరించడం మొదలుపెట్టారు.

ఇ. కింది పదాల వచనములు మార్చి రాయండి.

1) విద్యార్థి ______ 2) పూలమాల ______

ఈ. స్వీయస్పందన

"దేశ రక్షణ-జవానుల బాధ్యత" - మీ సొంతమాటల్లో రాయండి.

**IV. వినండి-చర్చించండి-రాయండి.**

అ. జవాబులు రాయండి.

1. విద్యార్థులకు శర్మగారు తెలిపిన విషయము.
2. విమల్‌కు పెద్దైన తర్వాత ఏమి కావాలనే కోరిక వుండేది.
3. విమల్ ఆలోచిస్తూ నిద్రలోకి చేరుకున్న విధం.
4. హీరోలకు, జవానులకు తేడా.
5. కెప్టెన్ భగత్ సభలో తెలిపిన విషయాలు.

ఆ. ఎవరు ఎవరితో పలికిరి.

1. నేను చెప్పేది నిజమేనర్రా.
2. అతను మీకెలా తెలుసు
3. నేను చెప్పిన హీరో ఇతనే
4. మరి నువ్వేమవుతావు.

**V. స్వీయ వ్యక్తీకరణ**

1. పెద్దయ్యాక నీవేం కావాలనుకుంటున్నావో రాయుము.
2. విమల్‌కు నిద్రపట్టక పోవడానికి కారణం నీ సొంత మాటల్లో రాయుము.

**VI. భాషావగాహన**

అ. కింద గీత గీసిన పదాలు ఏ భాషాభాగాలో వివరించండి.

1. అమ్మతో చెప్పి చక్కగా మాల కట్టించాడు.
2. ఇదే నీకు మంచి అవకాశం.
3. భగత్ ప్రతి విద్యార్థితో కరచాలనం చేశాడు.

ఆ. వాక్యాంగాలు రాయండి.

1. విమల్ పూలను సేకరించాడు.
2. పిల్లలు భగత్‌ను సత్కరించారు.
3. శర్మగారు పిల్లలను ప్రశ్నించారు.
4. హీరో కోసం సభావేదికను ఏర్పాటు చేసారు.

ఇ. కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1) ఆనందము X ______ 2) శత్రువులు X ______

3) అన్యాయము X ______ 4) రాత్రి X ______

ఈ. సామాన్య/సంయుక్త వాక్యాలు రాయండి.

1. పిల్లలంతా గోలగోలగా మాట్లాడుకుంటున్నారు.
2. విమల్ పెద్దగా అందంగా ఉన్న మాలను చూసి మురిసిపోయాడు.
3. మనమంతా ఆయనకు స్వాగతం పలుకుదాం.
4. అతడిని ఏ సినిమాలోను, ఏ టీవీలోను చూడలేదు.

ఉ. పదాలు కలిపి రాయండి.

1. మనము + అంతా = ______
2. అందరికి + అన్నా = ______
3. వీర + ఉచిత = ______
4. నువ్వు + ఇంక = ______

ఊ. క్రింది పదాలు సొంత వాక్యాలలో ఉపయోగించి రాయండి.

1. విస్మయం 2. మురిసిపోవు 3. కలలుకను 4. ప్రాణాలను ఫణంగాపెట్టు

## VII. సృజనాత్మకత:

1. దేశసరిహద్దు ప్రాంతంలోని మన సైనికులు చేస్తున్న సేవను గురించి వివిధ మాధ్యమాల (టి.వి, రేడియో, అంతర్జాలము) ద్వారా తెలుసుకొని రాయండి.
2. సెలవుల్లో ఊరికి వచ్చిన ఒక సైనికుని ఇంటర్వ్యూ చేయండి. సంభాషణ రూపంలో రాయండి.
3. వార్తాపత్రికలో ప్రచురించిన "సాహస బాలలు" చదివి వారిలో ఒకరిని గూర్చి ప్రసంగించండి.

## VIII. లేఖన నైపుణ్యాలు:

1. వ్యాసం

కింది అంశాల ఆధారంగా సైనికుని ఆత్మకథ రాయండి.

నేను – సైనికుడిని – సైన్యంలో చేరాను – దేశభక్తి – దేశసేవ – ఎన్నో యుద్ధాలు – కొన్నిటిలో విజయం, కొన్నింటిలో పరాజయం – ఆత్మ విశ్వాసం, ధైర్యం కోల్పోలేదు – దేశ సేవకే – నా జీవితం – అంకితం – జై జవాన్ – మేరా భారత్ మహాన్.

2. అధికార, అనధికార లేఖలు :

సూచనానుసారం కింది కృత్యాన్ని చేయండి.

విషయం : స్వచ్ఛభారత్ కార్యక్రమం
మునిసిపల్ కమీషనర్, బృహన్ ముంబయి మహానగర పాలిక ముఖ్య కార్యాలయం – ముంబయి.
తేది : 02-10-2018
సమయం : ఉదయం 10 గం..
స్థలం : ఛత్రపతి శివాజీ పార్క్, దాదర్ – 400 028.

- కార్యక్రమంలో పాల్గొనుటకు విద్యార్థినాయకునిగా అనుమతి కోరుతూ లేఖ.
- కార్యక్రమంలో పాల్గొన్న స్నేహితుని అభినందిస్తూ లేఖ.



నేనివి నేర్చుకున్నా.

- దేశానికి ఏ విధంగా సేవ చేయాలి.
- దేశ రక్షణలో సైనికుల పాత్ర.

ఉ.సూ: పరమవీర చక్ర బిరుదును పొందిన సైనికుల గురించి అంతర్జాలంలో వివరాలు సేకరించి, ఆల్బం తయారు చేయించి "కోప్రావాచన్"లో పెట్టించండి.

9I2UFS



# 2. స్నేహబంధం

**పాఠంలోకి ప్రవేశించేముందు:**

వర్ణాలు, వర్గాలు వదిలితే స్నేహం
వేషాలు, రోషాలు మానితే స్నేహం
ప్రాణాల నర్పించ గలిగితే స్నేహం
కష్టాల నష్టాల నోర్చితే స్నేహం


నిరుపేద అయితేమి? ఎవడైతె ఏమి?
అందాలు చందాలు లేకుంటె ఏమి?
నిన్ను కాచిన వాడె నిజమైన నేస్తం


దోస్తీని మించింది లేదు లోకాన
రత్నాల కంటె అది మిన్న తూకాన
మిత్రుడేకావాలి సుఖమున, శోకాన
– దాశరథి

- దురాశ దుఃఖానికి చేటు – చర్చించండి.

ఇప్పుడు ఈ పాఠంలో ప్రతిబింబించే మిత్రలాభాన్ని, దురాశవల్ల కలిగే నష్టాన్ని తెలుసుకుందాం!







దండకారణ్యంలో కర్పూరగౌరము అను సరస్సు ఉన్నది. ఆ సరస్సులో మంథరుడు అను తాబేలు ఉంటున్నది. దానికి సమీపంలో ఒక పెద్దచెట్టు పైన లఘుపతనకుడు అను కాకి ఉంటున్నది. చెట్టు క్రింద కలుగులో హిరణ్యకుడు అను ఎలుక నివసిస్తున్నది. ఆ అరణ్యంలో చిత్రాంగదుడు అను జింక కూడా నివసిస్తున్నది.

ఈ కాకి, ఎలుక, జింకలు తాబేలుకు మిత్రులు. అవి ప్రతీరోజు సరస్సు వద్ద కలుసుకొని కబుర్లు చెప్పుకుంటూ ఉంటాయి.

ఒకరోజు ఆహారం కోసం వెళ్ళిన జింక సూర్యాస్తమయం అవుతున్నా తిరిగి రాలేదు. దాని మిత్రులైన తాబేలు, ఎలుక, కాకి ఆందోళన చెందాయి.

ఎంతసేపటికి జింక ఇంటికి రాకపోయే సరికి కాకి మిగిలిన ఇద్దరికి చెప్పి జింకను వెతకటానికి బయలుదేరింది.

అది ఆకాశంలో ఎగురుతూ అడవి మొత్తం వెతికింది. దానికి ఒక చోట జింక కన్పించింది.

కాకి కిందకి దిగి జింక వద్దకు వచ్చింది. జింక వలలో చిక్కుకుని బాధపడుతున్నది.

కాకి జింకతో ''ఏమిటిది మిత్రమా!? ఈ వలలో ఎలా చిక్కుకున్నావ్?'' అన్నది.

అప్పుడు జింక 'విధి విలాసము మిత్రమా... నేను ఆహారం కోసం వెతుకుతూ, చూడక ఈ వలలో చిక్కాను.

ఎంత ప్రయత్నించినా వల నుండి బయటపడ లేకపోయాను. నీవు కనిపించిన తర్వాత నాకు ధైర్యం వచ్చింది. నన్ను ఈ ఆపద

నుండి నువ్వే రక్షించాలి''. అన్నది.

కాకి జింకతో ''మిత్రమా భయపడవద్దు. నేను వెళ్ళి హిరణ్యకుడిని తెస్తాను.


అతడు తన వాడి పళ్ళతో వల త్రాళ్ళను తెంచి నిన్ను విడిపిస్తాడు.'' అని ఎగిరింది.



కాకి ఆకాశంలో ఎగురుతూ ఎలుక, తాబేలు వద్దకు వచ్చింది. అవి జింక కోసం వెళ్ళిన కాకి రాక కోసం ఎదురుచూస్తున్నాయి. అవి కాకిని చూడగానే ఆత్రుతగా ''జింకను చూశావా?'' అని అడిగాయి.

కాకి అడవిలో తాను చూసిన విషయమును చెప్పింది. అది ఎలుకతో ''హిరణ్యకా! నీవు వెంటనే నా వీపు మీద ఎక్కు. నిన్ను త్వరగా జింక వద్దకు చేరుస్తాను'' అన్నది. ఎలుక సరే అన్నది. ఇరువురు మరుక్షణంలో జింక వద్ద ఉన్నారు. ఎలుక తన వాడి పండ్లతో వల త్రాళ్ళను తెంపింది.

జింక వలనుండి బయటపడింది. జింక, కాకి, ఎలుక సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఇంటికి బయలుదేరాయి. వారికి దారిలో తాబేలు కనిపించింది.



కాకి, ఎలుక ''నీవెందుకు వచ్చావు'' అని తాబేలును అడిగాయి. అది ''జింకకేమైనదోనని ఆదుర్దా కలిగింది. ఇక ఉండబట్టలేక వచ్చాను'' అన్నది. జింక ''మీ వంటి మంచి వారు నా స్నేహితులు కావటం నా అదృష్టం'' అన్నది.

మిగిలినవి ''అవసరం వచ్చినపుడు ఆదుకొనేవాడే అసలైన స్నేహితుడు. ఇందులో మేము ప్రత్యేకంగా చేసింది ఏమి లేదు'' అన్నాయి.

ఆ నలుగురు మిత్రులు కబుర్లు చెప్పుకుంటూ వెళుతుండగా, అదే దారిలో వేటగాడు వస్తున్నాడు. ముందుగా కాకి వేటగాడిని గమనించింది. అది మిగిలిన వాటిని హెచ్చరించి, పైకెగిరి చెట్టుపై కొమ్మల చాటున దాక్కున్నది.



ఎలుక వేగంగా వెళ్ళి ఒక చెట్టు తొర్రలోకి దూరింది. జింక పరుగు పరుగున పారిపోయింది. పాపం తాబేలు వేగంగా నడువలేక వేటగాడికి చిక్కింది.

వేటగాడు తాబేలుని ఒక సంచిలో వేసి మూటకట్టాడు. దానిని బాణానికి తగిలించుకొని ''జింక పోతే పోయింది. ఈ రోజుకు కనీసం తాబేలు అయినా దొరికింది. ఏది లేని దానికన్నా తాబేలు దొరకటం మంచిది కదా'' అనుకున్నాడు.

వేటగాడు తాబేలును పట్టుకొని పోవుట కాకి చూసింది.

కొంతసేపటి తరువాత ఎలుక, జింక అక్కడకు వచ్చాయి. వాటితో కాకి "వేటగాడు తాబేలును పట్టుకొని వెళ్ళాడు" అని చెప్పింది. అవి బాధపడ్డాయి.

కొంతసేపటికి ఎలుకకు ఒక ఉపాయం తట్టింది. తన ఆలోచనను జింక, కాకికి తెలియచేసింది. అవి ఎలుక చెప్పిన ఉపాయం బాగున్నదని మెచ్చుకున్నాయి. ఎలుక ఆలోచనను ఆచరణలో పెడదామన్నాయి.

ఎలుక సలహా ప్రకారం జింక అడ్డదోవగుండా ప్రయాణించి, వేటగాడు వెళ్ళే మార్గంలో అడ్డంగా పడుకొని ఉన్నది. అది చచ్చిన దానివలె నటించింది. దానిపై కాకి కూర్చొని జింక కన్నులు ముక్కుతో పొడుస్తున్నట్లు నటించసాగింది.

దారి వెంబడి వస్తున్న వేటగానికి జింక కనిపించింది.

జింక చచ్చిపోయిందని భావించాడు. 'ఒక జింక పోతే మరొక జింక దొరికింది... ఈరోజు నా పంట పండింది' అనుకుని వేటగాడు తాబేలు ఉన్న సంచిని క్రింద పెట్టి, జింక కోసం వెళ్ళాడు.

అంతలో ఎలుక వచ్చి తాబేలు ఉన్న సంచికి కట్టిన తాటిని కొరికేసింది.

సంచిలో నుండి తాబేలు బయటకు వచ్చి, గబగబా ప్రక్కన ఉన్న చెరువు వైపు నడచి నీటిలోకి జారిపోయింది.

వేటగాడు జింకను సమీపించగానే, కాకి అరుస్తూ పైకెగిరింది. వెంటనే జింక కూడా లేచి నిలుచుండి వెనుకకు పరుగెత్తింది. వేటగానికి జింక అందలేదు.

"అరె! జింక చచ్చినట్లు పరుండి, నన్ను మోసం చేసింది" అని వేటగాడు అనుకున్నాడు.

అతడు వెనుతిరిగి తన సంచి వద్దకు బయలుదేరాడు. అతనికి చెరువు వద్దకు వెళుతున్న తాబేలు కనిపించింది. అతడు దాని వద్దకు వెళ్ళి చూసేసరికి, అది చెరువులోని నీటిలో మునిగింది. తాబేలు నీటిలో వేగంగా ప్రయాణించి చాలా దూరం వెళ్ళింది. వేటగానికి తాబేలు కూడా చిక్కలేదు.

ఒకదాని కోసం వెళ్ళి, ఉన్న దాన్ని కూడా పోగొట్టుకున్నాను అని బాధపడుతూ వేటగాడు ఇంటికి వెళ్ళాడు.

కాకి, ఎలుక, జింక, తాబేలు తమ నివాసాలను చేరుకున్నాయి.

అవి కలిసిమెలిసి ఆనందంగా జీవించాయి.

---

## I. వినండి-సంభాషించండి:

1. "దోస్తిని మించింది లేదు లోకాన"..... వివరించండి.
2. నీవు ఒక మంచి స్నేహితుడిగా ఏం చేయగలవు?

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### పదజాలాన్ని పెంపొందించుకుందాం.

సరస్సు = కొలను; కలుగు = కన్నం; మిత్రులు = స్నేహితులు; చిక్కింది = దొరికింది; పరుండి = నిద్రించి



## III. కృత్యం

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనాను సారం కృత్యాలు చేయండి.

అ. ఎవరు ఎవరితో పలికిరి.

1. "నీవెందుకు వచ్చావు." ( ) → ( )
2. నీవు వెంటనే నా వీపు మీద ఎక్కు ( ) → ( )

పరిచ్ఛేదం: పుట సంఖ్య 32... లోని "కాకి ఆకాశంలో ఎగురుతూ .... ప్రత్యేకంగా చేసింది ఏమి లేదు అన్నాయి" వరకు

ఆ. తప్పొప్పులను గుర్తించి రాయండి.

1. వారికి దారిలో తాబేలు కనిపించింది.
2. జింక వల త్రాళ్ళను తెంపింది.
3. అవసరం వచ్చినపుడు ఆదుకొననివాడే అసలైన స్నేహితుడు.
4. కాకి ఇంటిలో తను చూసిన విషయం చెప్పింది.

ఇ. కింది పదాలు ఏ వచనమునకు చెందినవో గుర్తించి రాయండి.

1. జింక  2. స్నేహితులు

ఈ. స్వీయస్పందన

ఆపదలో ఉన్నవారికి నీవేవిధంగా సహాయం చేస్తావు.

## IV. వినండి–చర్చించండి–రాయండి.

అ. జవాబులు రాయండి.

1. దండకారణ్యంలో ఉన్న సరస్సు ...
2. ముగ్గురు మిత్రులు జింక గురించి ఆందోళన చెందడానికి కారణం.
3. కాకికి జింక ఏ విధంగా కన్పించింది.
4. ఎలుక జింకను రక్షించిన విధం.
5. జింక వేటగాడిని ఏ విధంగా మోసగించింది.
6. పాఠంలో వచ్చిన స్నేహితుల పేర్లు

| | |
|---|---|
| ఎలుక | → |
| జింక | → |
| కాకి | → |
| తాబేలు | → |

ఆ. సరైన క్రమంలో రాయండి.

1. ఎలుక తన వాడి పండ్లతో వల త్రాళ్ళను తెంపింది.
2. కాకి జింకను వెతకడానికి బయలుదేరింది.
3. జింక వలలో చిక్కుకుంది.
4. స్నేహితులు సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఇంటికి బయలుదేరాయి.

## V. స్వీయ వ్యక్తీకరణ

1. నువ్వు వర్షంలో చిక్కుకున్నావు. అపుడు ఏం చేస్తావు?
2. నీ స్నేహితుడు చదువులో వెనకబడ్డాడు. అతనికి నీవే విధంగా సాయపడ్డావు?

## VI. భాషావగాహన

అ. వచనము మార్చి రాయండి.

1. కాకి  2. జింకలు  3. ఇల్లు  4. మిత్రులు

ఆ. కింది పదాలు ఏ వాచకాలో రాయండి.

1. వేటగాడు ______  2. జింక ______  3. చెట్టు ______

ఇ. కింది ఖాళీలను సరైన ప్రత్యయాలతో పూరించి విభక్తులు రాయండి.

1. కాకి తాను చూసిన విషయము ________ చెప్పింది. ______

2. ఎలుక ఆలోచనను ఆచరణ ______________ పెడదామన్నాయి

3. తన వాడియైన పళ్ళ ______________ వల త్రాళ్ళను తెంచుతాడు

ఈ. **కింది పదాలను పట్టికలో సరిగ్గా అమర్చి రాయండి.**

నాకు, వెతికింది, తాబేలు, అంతలో, మేము, వేగంగా, దాక్కొన్నది, అప్పుడు, చెట్టు, ఆనందంగా

| నామవాచకం | సర్వనామం | విశేషణం | క్రియ | అవ్యయం |
|---|---|---|---|---|
| | | | | |
| | | | | |

ఉ. **కింది పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించి రాయండి.**

1. ఆచరణ = ______________ 2. చిక్కుకుని = ______________

3. ప్రయత్నము = ______________ 2. ఆదుర్దా = ______________

ఊ. **సంధి చేసి రాయండి.**

1. దండక + అరణ్యము 2. సూర్య + అస్తమయం

3. పెడదాము + అన్నారు 4. బాగున్నది + అని

ఋ. **వాక్యాంగాలను రాయండి.**

1. కాకి జింకను వెదకటానికి బయలుదేరింది. 3. హిరణ్యకుడు వలత్రాళ్ళను తెంపాడు.

2. కాకి హిరణ్యకుడిని తెచ్చింది. 4. వేటగాడు జింకను సమీపించాడు.

ౠ. **సామాన్య/సంయుక్త వాక్యాలు రాయండి.**

1. కాకి, ఎలుక, జింకలు, తాబేలుకు మిత్రులు. 2. నేను ఈ వలలో చిక్కాను.

3. జింక వలనుండి బయటపడింది. 4. ఎలుక తన ఆలోచనను జింకను, కాకికి తెలియజేసింది.

## VII. సృజనాత్మకత

1. వార పత్రికల్లో ఆదివారంనాడు వచ్చు బాల వినోదినిలోని కథలను చదివి చిత్రాలతో కథను రాయండి.
2. "కలిసి ఉంటే కలదు సుఖం" అన్న నీతిని తెలిపే కథను మిత్రునితో చర్చించి చక్కని భాషలో రాయండి.

## VIII. లేఖన నైపుణ్యాలు: కథారచన

**1. కథావస్తువు ఆధారంగా కథను పొడిగించి రాయండి.**

నక్క – ద్రాక్ష పళ్ళు –

**2. శీర్షిక ఆధారంగా కథను పొడిగించి రాయండి.**

'కలిసి ఉంటే కలదు సుఖము'

## IX. జట్టుపని :

వివిధ సాఫ్ట్‌వేరులలో క్లిప్‌ఆర్ట్‌లు, చిత్రాలు, రకరకాల రంగుల ఫాంట్లు మొదలగునవి ఉపయోగిస్తూ సృజనాత్మకంగా పుట్టిన రోజు కార్డులను తయారు చేయండి. మీ స్నేహితులకు వారి పుట్టి రోజున పంపించి వారి ఆనందంలో పాలు పంచుకోండి.

### నేనివి నేర్చుకున్నా


1. అపాయాన్ని ఉపాయంతో తప్పించుకోవచ్చు.
2. అందరితో కలిసి మెలిసి జీవించాలి.




గ్రంథాలయంలో వివిధ కథలను చదవండి. తెలియని పదాలకు అర్థాన్ని పెద్దల్ని ఉపాధ్యాయుల్ని అడిగి తెలుసుకొండి.

9IBQHF

# రాట్నం రంగప్పా! దారం దానప్పా!



ప్రకాశపఠనం

(ఈ కథను వంతులవారిగా గొంతు మారుస్తూ ప్రకాశ పఠనం చేయండి. పకపకా నవ్వుకోండి)



ఒకూల్లె ఒక ఒంటరి ముసలమ్మ వుండేటిది. వూరి బైట గుడిశేస్కోని రాట్నం దిప్పుకుంట బతికేది. ముసలమ్మ అట్ల కష్టం జేశి మస్తు పైసలు కూడవెట్టింది. ఆ సంగతి ఒక దొంగకు యెర్కైంది. ఒగనాడు రాత్రిపూట ముసలమ్మ యింటికి దొంగతనానికివొయ్యిండు.

దొంగొచ్చిన సప్పుడుకు నిద్రవోతున్న ముసలమ్మకు మెల్కొచ్చింది. తలుపు సందులకెల్లి దొంగని జూశింది. ఒక వుపాయం ఆలోశించింది. రాట్నం దిప్పుకుంట **"రాట్నం రంగప్పా!** పండుకున్నవా కొడ్కా? అన్నది. మల్ల యెంబడే మొగాయినలెక్క గొంతు మార్శి "లేదమ్మా యింక పండుకోలే!" అన్నది. అది యిన్న దొంగ "ముసల్ది ఒంటరిది గాదు. అమెకో కొడుకు గూడ వున్నడు. నాకు యింకోని సాయం గావాలె!" అన్కుంటవోయ్యిండు. జెరశేపయినంక యింకో దొంగని తోడు దీస్కోని వొచ్చిండు.

ముసలమ్మ అది గనిపెట్టి **"దారం దానప్పా!** పండుకున్నవా బిడ్డా?" అని, మల్ల గొంతు మార్శి "లేదమ్మ! యింక పండుకోలే!" అన్నది. అది యినంగనే దొంగ "ముసల్దానికి యింకో కొడుకు గూడ వున్నడు. నాకు యింకోని సాయం గూడ అవుసరం!" అన్కుంట యెన్కకు మల్లిండు. యింక జెరశేపయినంక యింకో దొంగని దీస్కోని వొచ్చిండు.

ముసలమ్మ అది గూడ గనిపెట్టి **"కదురు కన్నప్పా!** పండుకున్నవా నాయినా?" అని మల్ల గొంతు మార్శి "లేదమ్మా యింక పండకోలే!" అన్నది. అప్పుడు దొంగ "ముసల్దానికి ముగ్గురు కొడుకులున్నరన్నమాట! యింకొగన్ని గూడ తోడుదెచ్చుకుంటే!" అన్కుంట వొయ్యి యింకొక దొంగని దీస్కొచ్చుకుండు.

అప్పుడు ముసలమ్మ **"శెక్రం శెన్నప్పా!** పండుకున్నావా బిడ్డా?" అని మల్ల గొంతు మార్శి లేదమ్మా! మెల్కతోనేవున్న!" అన్నది.. దాంతోని దొంగకు యేంజెయ్యాల్నో అర్దంగాక అట్నే నిలవడ్డడు.

యిలోపల ముసలమ్మ రాట్నానికి సంబందించిన పేర్లతోటి శానసార్లు పిల్శి, మల్ల గొంతు మార్శి జెవాబు జెప్పింది. అప్పుడు దొంగ "ముసల్దానికి మస్తు మంది కొడుకులున్నరన్న సంగతి యెవ్వల్కి దెల్వదు. మేము గన్క యిప్పుడు లోపల్కివోతె అందరు గల్శి మమ్ముల్ని సావగొడ్తరు. యెన్కకు మల్లుడే మంచిది" అన్కుంట తోడు దెచ్చుకున్న దొంగలతోని వొచ్చిన తోవ్వవట్టిండు.

దాంతోని ముసలమ్మ ఆపతి దప్పిందని గుండెల నిండ వూపిరి పీల్సుకుంది.

**ఉ.సూ:** విద్యార్థుల చేత ఈ కథని యధాతథంగా నాటకీకరించండి.



# 3. నా అనుభవాలు

**పాఠంలోకి ప్రవేశించేముందు:**



- అనుభవం అంటే ఏమిటి – చర్చించండి.
- మీరు దైనందిని (డైరీ)లో మీ అనుభవాలు రాసుకున్నారా? కొన్నాళ్ళ తరువాత వాటిని చదివితే మీకేమనిపిస్తుంది.
- ఇప్పుడు 10వ తరగతి విద్యార్థిని అయినటువంటి మేనక తన అనుభవాల్ని మనతో పంచుకోబోతున్నది. వాటిని ఆలకిద్దామా!



నేను 2009–2010 సం.లో 8వ తరగతిలో చేరాను. 8వ తరగతి వారికి NGC (నేషనల్ గ్రీన్ కోర్) క్లాసు జరిగేది. మా అశోక్ సార్ మా తరగతి వారందరిని ఐదు జట్లుగా చేశారు. ప్రతి జట్టులో 8–10 విద్యార్థులు ఉండేవారు.

1. శక్తి కమిటి 2. నీటి కమిటి 3. చెట్ల కమిటి 4. భూమి కమిటి 5. స్వచ్ఛత కమిటి

**శక్తి కమిటి:** ఈ కమిటి వారు ప్రతిరోజు ఎంత కరెంటు వినియోగించబడుతుందో లెక్కిస్తారు. కరెంటును వృథాగా ఖర్చు చేసేవారు కాదు.

**నీటి కమిటి:** ఈ కమిటిలో నేను పని చేసాను. మేము ప్రతిరోజు నీళ్ళ ట్యాంకులోని పాత నీరు చెట్లకు పోసి ట్యాంకు శుభ్రం చేసి నీరు నింపేవారిమి. నీళ్ళు రాని రోజుల్లో బడి బయట ఉన్న కుండీలో నుండి నీళ్ళు తెచ్చి చెట్లు ఎండిపోకుండా నీళ్ళు పోసేవారిమి.

**చెట్ల కమిటి:** ఈ కమిటి వారు చెట్ల దగ్గర చెత్త చెదారం శుభ్రం చేసేవారు. చెట్లను కాపాడేవారు.

**భూమి కమిటి:** ఈ కమిటి వారు చెట్లను పెంచేవారు. చెట్ల లెక్కలు వేసేవారు. ఆ చెట్ల ఉపయోగాలు రాసేవారు.

**స్వచ్ఛత కమిటి:** నేలమీద చెత్త ఉంటే తీసి చెత్తకుండీలో వేసేవారు. బడిలో ఏవైనా కార్యక్రమాలు జరిగేటపుడు చెత్తకుండీలను ఏర్పాటు చేసేవారు.

మా బడిలో చాలా బాగా యన్.జి.సి. జరిగేది. ఆ సమయంలో మా పి.టి. సార్ మాకు ఉపాధ్యాయులతో, తోటి వారితో ఎలా మెలగాలో చెప్పేవారు. మా ప్రధానోపాధ్యాయుడు 105 మొక్కలను తెచ్చారు. వాటిని మేము ఒక రోజు మొత్తం నాటాము. కాని వాటిని పశువులు మేస్తున్నాయని చెప్పడంవలన ఆయన జాలీలు తెప్పించారు. వాటిని మేము నాటిన మొక్కల చుట్టు కంచెగా వేసాము. ఇప్పటికీ పాఠశాల మొత్తం ఎక్కడ చూసినా మేము నాటిన చెట్లు ఉన్నాయి.

మా 8వ తరగతి అయిపోయింది. 9వ తరగతిలోకి చేరాము. అయినా నేను యస్.జి.సి.ని వదల్లేదు. దానితోపాటు స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఖో– ఖో, కబడ్డి మొదలగు ఆటల పోటీలు, క్విజ్ పోటీలు, ఉపన్యాస పోటీలు నిర్వహించేవారిమి. మా పి.టి. సార్ ప్రోత్సాహంతో మార్చ్‌ఫాస్ట్ చేసేవారిమి. ఈ కార్యక్రమాలకు గ్రామ సర్పంచ్‌ను, పెద్దలను, యూత్ క్లబ్ వారిని ఆహ్వానించేవారిమి. 9వ తరగతి అయిపోయేటపుడు వేసవి సెలవుల్లో మా ఉపాధ్యాయులు 10వ తరగతిలో సైన్స్ పటాలను గీసుకురమ్మన్నారు.

వేసవి సెలవులు అయిపోయాయి. 10వ తరగతిలో అడుగు పెట్టాను. నేను పదవ తరగతిని కొంచెం కష్టంగాను, కొంచెం ఇష్టంగాను భావించాను. 10వ తరగతిలో అడుగుపెట్టగానే ఏదో ఆనందం, ఏదో బాధ, బాధ కాదు చాలా బాధ, భయాలు కలిగాయి. మా ఉపాధ్యాయులు మా ఇళ్ళకు వచ్చి బాగా చదవండి. ఏవైనా అవసరమైతే మమ్మల్ని సంప్రదించండి. మీకు మేము ఏ క్షణంలోనైనా సహాయపడతాం అని చెప్పారు. మా ప్రధానోపాధ్యాయుడు మా ఇష్టం మేరకు సాయంత్రం క్లాసులు ప్రారంభించారు. అందరు క్లాసులు తీసుకున్నారు. ఎన్నో రకాలుగా సహాయం చేసారు. మా కోసం మా ఉపాధ్యాయులు, మా తల్లిదండ్రులు ఎంతో కష్టపడ్డారు. కాబట్టి మేము సరయిన ప్రతిఫలం ఇవ్వకపోతే బాగుండదు కదా! అందుకని మేమూ కష్టపడ్డాం. మా స్కూల్ రికార్డ్‌లో రాని ర్యాంకులు మేము తెచ్చాం. నాకు 3వ ర్యాంకు వచ్చింది. మేము బడిలో ఉన్నన్ని రోజులు మాకు విద్య, సంస్కారం నేర్పిన గురువుల ఋణం ఈ విధంగా తీర్చుకున్నాం. మేము వీళ్ళను జన్మంతా గుర్తుంచుకుంటాం.

స్కూల్ లైఫ్ అనేది జీవితములో ఒక గొప్ప కాలం. దానిని వినియోగించుకున్నవారు అదృష్టవంతులైనవారు. మేమంతా చాలా అదృష్టవంతులం. ఇవన్నీ నా స్కూల్ డేస్ అనుభవాలు. రాయాలంటే పేజీలు సరిపోవు. ఇంత బాగా మా ఉన్నతికి కారణమైన మా ఉపాధ్యాయులందరికి నేను ధన్యవాదాలు చెబుతున్నాను.

**యస్. మేనక**
**10వ తరగతి**

## I. వినండి–సంభాషించండి:

1. మీ దినచర్య చెప్పండి.
2. డైరీలో మీరు రాసుకున్న ఒక సంఘటన.
3. డైరీ రాయడం వలన లాభాలు.

## II. చదవండి–ఆలోచించండి–రాయండి.

**పదజాలం పెంపొందించుకుందాం.**

వినియోగించుట = ఉపయోగించుట; మెలగు = ప్రవర్తించు; వృథా = వ్యర్థం; సంప్రదించుట = అడిగి తెలుసుకొనుట.

## III. కృత్యం

**పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనానుసారంగా కృత్యాలు చేయండి.**


**అ. జత పరచండి.**

| 'క' వర్గం | 'చ' వర్గం |
|---|---|
| 1 మా గురువుల ఋణం | అ. అడుగు పెట్టాను. |
| 2. మా ప్రధానోపాధ్యాయుడు మా ఇష్టం మేరకు | ఆ. ఇవ్వకపోతే బాగుండదు కదా? |
| 3. 10 వ తరగతిలో | ఇ. ఈ విధంగా తీర్చుకున్నాము |
| 4. మేము సరయిన ప్రతిఫలం | ఈ. సాయంత్ర క్లాసులు ప్రారంభించారు. |



పరిచ్ఛేదం: పుట సంఖ్య : 38 లోని "మా 8వ తరగతి ................ జన్మంతా గుర్తుంచు కొంటాం" వరకు.

ఆ. ఆల్లికను పూరించండి.




ఇ. వ్యతిరేక పదాలు రాయండి.

1. నిర్భయం x ______________ 2. గుర్తుంచుకొను x ______________


ఈ. స్వీయస్పందన

వేసవి సెలవుల్లో నీవేవిధంగా గడిపావో రాయుము.

**IV. వినండి-చర్చించండి-రాయండి.**

అ. జవాబులు రాయండి.

1. నేషనల్ గ్రీన్ కోర్‌లోని కమిటీలు- అవి చేసే పనులు



2. పాఠశాలలో మొక్కలు పెంచిన తీరు.
3. ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు ఇచ్చిన ప్రోత్సాహం.
4. విద్యార్థుల కృషి ఫలించిన విధం.

ఆ. కుండలీకరణంలోని సరైన పదాలతో ఖాళీలు పూరించండి.

(ప్రధానోపాధ్యాయుడు, భూమికమిటి, వృధా, కంచె, గొప్పకాలం)

1. ఈ ______________ వారు చెట్లను పెంచేవారు.
2. కరెంటును .................. గా ఖర్చు చేసేవారు కాదు.
3. స్కూల్ లైఫ్ అనేది జీవితంలో ఒక ______________
4. మా ______________ 105 మొక్కలను తెచ్చారు.

ఇ. కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1. పాత నీరు 2. శుభ్రం 3. కాపాడుట 4. ఇష్టము 5. భయం 6. ఆనందం

ఈ. ఈ పదాలను కలిపి రాయండి.

1. వారు + అందరినీ
2. ప్రధాన + ఉపాధ్యాయుడు
3. మేస్తు + ఉన్నాయి
4. రాయాలి + అంటే

**V. స్వీయవ్యక్తీకరణ:**

1. స్వచ్ఛత కమిటి గురించి దినచర్య పుస్తకంలో రాయండి.
2. 'చెత్తపై కొత్త సమరం చేద్దాం' ఏ విధంగా పాటిస్తావు.

**VI. భాషావగాహన:**

**అ. కింది వాక్యంలో గీతగీసిన పదాలు ఏ వాక్యాంగాలో రాయండి.**

1. <u>భూకమిటి</u> వారు <u>చెట్లను</u> <u>పెంచేవారు.</u>

   భూకమిటి = ______ చెట్లను = ______ పెంచేవారు = ______

**ఆ. వాక్య రకాలను గుర్తించి రాయండి.**

1. ఈ కమిటీలో నేను పని చేస్తాను. ______
2. నేను పదవ తరగతిని కొంచెం ఇష్టంగా, కొంచెం కష్టంగా భావించాను. ______

**VII. సృజనాత్మకత:**

1. మీ పరిసరాల్లో జరుగు వనమహోత్సవానికి అవసరమగు బ్యానర్లు, ప్రకటనలు తయారు చేసి ఆ కార్యక్రమంలో పాల్గొనండి.
2. ఖాళీ డబ్బాలో విత్తనాలు చల్లి అవి ఏ విధంగా మొలకెత్తుతున్నాయో గమనించి డైరీలో నమోదు చేయండి.
3. సేంద్రీయ ఎరువులు ఎలా తయారు చేయాలో అంతర్జాలం ద్వారా తెలుసుకోండి.
4. డాబాల మీద జరిగే తోట పెంపకం గురించి వివరాలు సేకరించి ఆల్బమ్ తయారు చేయండి.

**VIII. లేఖన నైపుణ్యాలు : గద్య అవగాహన**

కింది పరిచ్ఛేదాన్ని చదివి ఐదు ప్రశ్నలను తయారు చేయండి.

భారత దేశంలోని ప్రజలంతా ఒక దారంలో గుచ్చబడిన పూల దండవంటివారు. ఇక్కడ వివిధ సంస్కృతులు. ఆచార వ్యవహారాలు మనకు కనిపిస్తాయి. ఆయా రాష్ట్రాల ప్రజలు వారి వారి సాంప్రదాయాల ప్రకారం పండుగలను జరుపుకొంటారు. ఈ పండుగలు మన సంస్కృతి సాంప్రదాయలకు అద్దం పడుతుంటాయి.

అటువంటి పండుగలలో ఒకటి 'రాఖీ పండుగ'. ఈ పండుగ సోదరి, సోదరుల మధ్య ఉన్న ప్రేమ అనుబంధంలోని మాధుర్యము, అనుభూతిని ప్రత్యేకంగా చాటి చెపుతుంది. అన్నకు గాని తమ్మునికి గాని ప్రేమ సూచకంగా సోదరి రాఖీ కట్టడం ఈ పండుగ యొక్క ప్రత్యేకత. ఈ పండుగను పలు ప్రాంతాలలో పలు విధాలుగా జరుపుకొంటారు. ఈ రాఖీ పూర్ణిమనే జంధ్యాల పూర్ణిమ, నారియల్ పూర్ణిమ అని కూడా పిలుస్తారు.

1. ..........................................................................................

2. ..........................................................................................

3. ..........................................................................................

4. ..........................................................................................

5. ..........................................................................................



**నేనివి నేర్చుకున్నా :**

1. డైరీ రాయడం
2. పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యత

9IKLJ3

**ఉ.సూ:** స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు విద్యార్థులచే తయారు చేయించండి.



# 4. కలంకారీ

– సమాచారం, ఛాయాచిత్రాలు సౌజన్యం శ్రీమతి మమతారెడ్డి మరియు దస్తకార్ ఆంధ్ర




**పాఠంలోకి ప్రవేశించేముందు:**

- పై కరపత్రాన్ని చదివారు కదా! ● ఇప్పుడు మీరు కూడా ఒక ఆకర్షణీయమైన కరపత్రాన్ని తయారు చేయండి.
- ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాతి పొందిన కలంకారీ అద్దకాలను గురించిన సంభాషణను విందాం.

---

(10వ తరగతి గదిలోనికి ఉపాధ్యాయిని ప్రవేశించగానే విద్యార్థులందరూ ఉత్సాహంగా అభివాదం చేస్తారు). తరువాత ...

**విద్యార్థులు** : టీచర్! మీరు చిత్రకళా ప్రదర్శన కోసం వివిధ రకాల చిత్రాలున్న వస్త్రాలను, వస్తువులను తెమ్మన్నారు కదా! మేమంతా తీసుకొచ్చాము.

**ఉపాధ్యాయిని** : చాలా సంతోషం. మీకు చిత్రకళను ప్రదర్శనాంశముగా ఇచ్చారు. కనుక మీరంతా తీసుకొచ్చిన వాటిని మీకు కేటాయించిన విభాగం (స్టాల్స్)లో ప్రదర్శించాలి. వాటి గురించి వివరించాలి.

**విద్యార్థులు** : మరి వాటి గురించి ఎవరు చెప్తారు?

**ఉపా** : నేను మీ అందరికి సహాయం చేస్తానులే. (విద్యార్థులంతా ప్రదర్శన వస్తువుల్ని ఉపాధ్యాయినికి చూపెడతారు. అందులోని ఒక పరదాని విప్పుతూ...) రియా! నీవు తెచ్చిన ఈ పరదా చాలా బాగుంది. ఇది కలంకారీ శైలిలో చిత్రించినది.

**రియా** : కలంకారీ అంటే ఏమిటి టీచర్?






ఉషా : చెబుతాను. మీరు ఆ అంశాలన్నింటిని ప్రదర్శన కొరకు నమోదు చేసుకోండి.

కలంకారీ అనగా వెదురుతో చేసిన కలంతో ప్రకృతి సిద్ధమైన రంగులను ఉపయోగించి వస్త్రాలపై బొమ్మలు చిత్రించే ఒక కళ. చిత్రకళలలో కలంకారీ శైలి చాలా ప్రాచీనమైన కళ. కలం కారీ పదంలోని 'కారీ' అనగా హిందీ, ఉర్దూ భాషలలో 'పని' అని అర్థం.

మహేష్ : ఈ కళ ఎక్కడెక్కడ ఉన్నది టీచర్?

ఉషా : దేశ విదేశాలలోనూ వస్త్రాలపై చిత్రించే ఈరకమైన కళ ఉంది.

కరీం : టీచర్! కలంకారీ కళ ఎక్కడ పుట్టింది?

ఉషా : చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో పుట్టింది.

స్వాతి : ఈ కలంకారీ చిత్రాలను ఎలా తయారు చేస్తారు టీచర్?

ఉషా : కలంకారీ చిత్రణకు ఓర్పు చాలా అవసరం. ఈ కళలో అంకితభావం ప్రకటితమవుతుంది.

- కలంకారీ కళాకారులు మొట్ట మొదటగా బట్టను చిత్రించే కాన్వాసు తయారుచేసుకొంటారు.
- దళసరిగా ఉండే చేనేతబట్టను పారే నీటిలో బట్టకు ఉన్న గంజి, పిండి పోయేవరకు నాలుగైదు సార్లు శుభ్రం చేస్తారు.
- ఈ ప్రక్రియలో సబ్బుకాని, మరెటువంటి రసాయనికాలు గాని వాడరు.
- తరువాత ఈ బట్టను గేదెపాలు, కరక్కాయల రసం కలిపిన మిశ్రమంలో ముంచి ఎండలో ఆరబెడతారు.
- ఈ విధంగా ఆరిన బట్ట కలంకారీ చిత్రణను సిద్ధమైనట్లే.
- చింతబొగ్గు కణికెలతో ఈ బట్ట మీద తమ హస్తకళానైపుణ్యంతో భావానికి తగినట్లుగా చిత్రాలను చిత్రిస్తారు.
- ఈ చిత్రాలను అన్నభేది ద్రావణంతో తుడుస్తారు. అప్పుడవి చెరగని నల్లరంగు చిత్రాలుగా తయారవుతాయి.

- ఈ విధంగా బట్టను ఉతికి, చిత్రాలు గీసి, రంగులు వేసి, ఎండబెట్టి కలంకారీ చిత్రణనుపూర్తి చేస్తారు.



**శ్యామల :** ఈ చిత్రాలకు రంగులు ఎలా వేస్తారు. టీచర్?

**ఉపా :** కలంకారీ చిత్రకారుల హస్త కళా కౌశల్యాన్ని చూడడం కనుల విందుగా ఉంటుంది. కళాకారులు కావలసిన రంగులో ముంచిన చిన్న గుడ్డను లేదా, దూదిని కలంకారీ కలంలో పెట్టి వ్రేలితో నొక్కుతారు. ఈ విధంగా కావలసినంత రంగు ద్రవాన్ని కలం గుండా ప్రవహింపజేస్తూ రేఖా చిత్రాల మీద వర్ణం వేస్తారు. నిపుణుల చేతిలో చిత్రాలు చైతన్యవంతంగా తయారవుతాయి. నాజూకైన వర్ణాల వాడకం వలన ఈ చిత్రాలు కంటికి ఇంపుగా చల్లగా ఉంటాయి.



**రాజు :** ఇందులో ఏరకమైన చిత్రాలుంటాయి?

**ఉపా :** కలంకారీ చిత్రణలో ముఖ్యంగా రామాయణం, మహాభారతం, శివపురాణాలలోని పాత్రలు కనిపిస్తాయి. దుప్పట్లు, దిండుగలీబుల మీద జంతు రూపాలు, వివిధ పుష్పాలతో కూడిన చిత్రాలను చిత్రిస్తారు. కుట్టుపనిని పోలివుండే జీవమున్న చెట్ల లాంటి ఆకృతులను కూడా చిత్రిస్తారు.వీటికి వాడే రంగులు ప్రకృతి సిద్ధమైనవి. కాబట్టి శరీరానికి హాని చేయవు. ఈ రంగులను కూరగాయలు, చెట్ల బెరడులు మొదలగు వాటితో తయారుచేస్తారు. కేవలం పరదాలు మొదలైనవే కాక గుమ్మటాలు, ఫైళ్ళు, పెన్‌స్టాండ్లు వంటి అనేక వస్తువులు తయారు చేయడం వల్ల గిరాకీ పెరిగి కళాకారుల జీవనోపాధికి సహాయకారిగా ఉంది. కలంకారి ప్రపంచ చరిత్రలో ఒక విశిష్ట స్థానాన్ని పొందింది. మనమంతా ఇటువంటి కళాకారులను ప్రోత్సహిస్తూ చేయూతనిద్దాం.







**I. వినండి-సంభాషించండి.**

1. లలితకళలలో మీకు ఏదంటే ఇష్టం? ఎందుకు ఇష్టమో వివరించండి.
2. నీకు ఏ కళలో ప్రావీణ్యతగలదో చెప్పు.

**II. చదవండి-ఆలోచించండి-రాయండి.**

**పదజాలం పెంపొందించుకుందాం.**

సంప్రదాయం = పూర్వకాలం నుంచి పాటిస్తున్న పద్ధతి; ప్రాచుర్యం = ప్రసిద్ధి; ప్రసిద్ధిగాంచిన = పేరు పొందిన; పర్యాటకులు = సందర్శకులు; ప్రక్రియ = కార్యవిధానం



**III. కృత్యం**

**పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనానుసారంగా కృత్యాలు చేయండి.**

**అ. జవాబులు రాయండి.**

1. చేనేత బట్టను ఏవిధంగా శుభ్రం చేస్తారు.
2. కలంకారీ చిత్రాలు ఎందుకని కంటికి ఇంపుగా ఉంటాయి.

(పరిచ్ఛేదం: పుట సంఖ్య.... 42లోని "కలంకారీ కళాకారులు మొట్టమొదటగా ..... ఇంపుగా చల్లగా ఉంటాయి" వరకు)

**ఆ. కింది వాక్యాలను సరైన క్రమంలో అమర్చండి.**

1. చిత్రాలను అన్నభేది ద్రావణంతో తుడుస్తారు
2. చింత బొగ్గు కనికెలతో చిత్రాలను చిత్రిస్తారు.
3. మొట్ట మొదటిగా కాన్వాసును తయారు చేసుకుంటారు
4. బట్టను 4, 5 సార్లు శుభ్రం చేస్తారు

**ఇ. అర్థాలు జతపరచండి.**

| 'క' వర్గం | 'చ' వర్గం |
|---|---|
| 1. సిద్ధము | ఎ. నేర్పు |
| 2. నైపుణ్యం | బి. తయారు |
| | సి. ఓర్పు |

**ఈ. స్వీయ స్పందన:**

కలంకారీ చిత్రాల చిత్రీకరణ నీ సొంత మాటల్లో రాయుము.

**IV. వినండి-చర్చించండి-రాయండి.**

**అ.**
1. కలంకారీ కళ అనగా ఏమిటి?
2. కలంకారీ కళను విదేశాలలో ఈ పేర్లతో పిలుస్తారు.
3. కలంకారీ చిత్రకారుల హస్తకౌశల్యం.
4. కలంకారీ చిత్రణలో చిత్రించబడు చిత్రాలు.

**ఆ. ఎవరు-ఎవరితో పలికిరి.**

1. "మీకు చిత్రకళను ప్రధానాంశంగా ఇచ్చారు."
2. "కలంకారీ అంటే ఏమిటి టీచర్"
3. "కళలో అంకిత భావం ప్రకటితమౌతుంది."
4. "ఈ చిత్రాలకు రంగులు ఎలా వేస్తారు."

**ఇ. సరైన సమాధానం గుర్తించి రాయండి.**

1. కలంకారీ చిత్రాలను ఈ ద్రావణంతో తుడుస్తారు ____________________

   అ. అన్నము  ఆ. అన్నభేది  ఇ. అన్నవిభేది

2. కలంకారీ కళ ఇక్కడ పుట్టింది ____________________

   అ. శ్రీకాకుళం  ఆ. శ్రీకూర్మం  ఇ. శ్రీకాళహస్తి

**V. స్వీయవ్యక్తీకరణ:**

కలంకారీ చిత్రాల గురించి మీ అభిప్రాయం సొంతమాటల్లో రాయండి.

## VI. భాషావగాహన

**అ. వాచకము గుర్తించి రాయండి.**

1. స్వాతి  2. ఉపాధ్యాయుడు  3. బొమ్మలు  4. కరీం  5. పరదా

**ఆ. ఏకాలమో గుర్తించండి**

1. దూదిని కలంకారీ కలంలో పెట్టి వ్రేలితో నొక్కుతారు.
2. కలంకారీ ప్రపంచ చరిత్రలో ఒక విశిష్టస్థానాన్ని పొందింది.
3. విద్యార్థులందరూ ఉత్సాహంగా అభివాదం చేస్తున్నారు.

**ఇ. గీత గీసిన పదాలు ఏ భాషాభాగాలో గుర్తించండి.**

1. నేను మీ అందరికీ సహాయంచేస్తాను.  2. రియా! నీవు తెచ్చిన ఈ పరదా చాలా బాగుంది.

**ఈ. సంధి చేసి రాయండి.**

1. శ్రవణ + ఆనందం  2. సిద్ధము + అయిన  3. ప్రదర్శన + అంశము  4. జీవము + ఉన్న


## VII. సృజనాత్మకత

**అ. ప్రకృతి సిద్ధమైన సామాగ్రితో గణపతి విగ్రహాన్ని తయారుచేసి, సహజ సిద్ధమైన రంగులు వేయండి.**

ఉదా: బీట్ రూట్ రసం → ముదురు గులాబీ రంగు

- **ఒక పరదాను ప్రకృతి సిద్ధమైన రంగులతో చిత్రించండి.**
- **మీరు తయారు చేసిన అద్దకాలను అధ్యయన కోణం (వాచన్ కోప్రా) లో ప్రదర్శించండి.**

**ఆ. ఆకృతిని 'లలిత కళలు - కళాకారులు' అను విధంగా పూరించండి.**




## VIII. ప్రాజెక్టుపని (జట్టుపని)

1. మహారాష్ట్రలోని ఆదివాసుల వార్లీ చిత్రకళ గురించి వివరాలు, చిత్రాలు సేకరించి ప్రదర్శించండి.

## IX. లేఖన నైపుణ్యాలు : ప్రకటన లేఖనం

పుట సంఖ్య : 41 లోని ప్రకటనను చదివి సూచనానుసారం కృత్యం చేయండి.

1. [ ] → ప్రకటనదేని గురించి | ఎన్ని రోజులు → [ ]

1. [ ] → స్థలం | ప్రకటనలోని వస్తువులు → [ ]


**నేనివి నేర్చుకున్నా.**

1. కలంకారీ చిత్రకళ దాని చరిత్ర-ప్రాముఖ్యత.
2. సాంప్రదాయ కళలకు చేయూతనిచ్చి కాపాడాలి.



9IUHKQ

**ఉ.సూ:** కళల గురించి విద్యార్థులకు పరిచయం చేయండి



# వార్లీ చిత్రకళ

(ఈ పాఠాన్ని మౌన పఠనం చేయండి. చక్కగా అర్థం చేసుకోండి. మీరు ఎచ్చటెచ్చట ఈ చిత్రాలు చూశారు. ఏమనిపించింది? మీరు కూడా ఇటువంటి చిత్రాలు గీశారా? లేదా చిత్రించాలను కుంటున్నారా? మొదలగు అంశాల గురించి ఆలోచించండి. తరగతిలో చర్చించండి.)

భారతీయ సాంస్కృతిక జీవన సమృద్ధి వెనుక గల ఆదివాసి కళల యొక్క భూమిక పేర్కొనదగినది. నగర సంస్కృతి ప్రభావానికి దూరంగా స్వేచ్ఛ మరియు పారంపరిక సంప్రదాయాలతో ప్రకృతి సహజవనరులనుండి ఆవిష్కరించబడినది ఆదివాసి కళ. ఆదివాసి ప్రజలైన వర్లీలు లేదా వార్లీలు భారతీయ దేశవాళీ ప్రజలు. వీరు ఎక్కువగా మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలైన దాద్రా నగర్ హవేలీ, దమన్ మరియు దయ్యులలో ఉన్నారు. వీరు మాట్లాడే భాషకు లిపి లేదు. 'వర్లీ' అనే పదం 'వర్లా' అనే పదం నుండి వచ్చింది. వర్లా అంటే 'పొలము' లేదా 'భూమి యొక్క ఒక ముక్క' అని అర్థం

వార్లీల జీవన విధానం మనిషికి – ప్రకృతికి నడుమనున్న సంబంధాన్ని చూపించడానికి ఒక చక్కని ఉదాహరణ. వీరు ప్రకృతిని తల్లిగా భావిస్తారు. అదే వారి సంప్రదాయాలకు, ఆచారాలకు మూల స్తంభం. వార్లీ ప్రజలు ప్రకృతిని కాపాడే జ్ఞానం కలిగి ఉన్నారు. వార్లీ చిత్రకళ సంస్కృతి, సంప్రదాయాలు మరియు పరిసరాలలోని ప్రకృతి సంపదను ఆధారంగా చేసుకొని ఏర్పడింది. వార్లీ చిత్రకళలో ప్రకృతి, ధార్మికవిధి, లగ్నవిధి, దైనందిన ప్రజాజీవనం ప్రతిబింబిస్తుంటుంది. వార్లీలు పక్షులు, జంతువులు, నదీనదాలు, కొండలు, వృక్షాలు, ఇంటి సామాగ్రి, నృత్యములు, పండుగలు, వ్యవసాయ పనులు మొదలైన వార్లీశైలి చిత్రాలను గుడిసెల గోడలపై చిత్రిస్తారు.

వార్లీ జానపద చిత్రకళ చాలా ప్రాచీనమైనది. వీరి చిత్రాలు రేఖాత్మకముగా వృత్తము, త్రిభుజము మరియు చతురస్రము వంటి మూల ఆకారాలు కలిగి ఉంటాయి. ఈ ఆకారాల ఎంపికకు, వారి ప్రకృతి పరిశీలనయే మూలకారణం. వృత్తములు సూర్యుని, చంద్రుని సూచిస్తాయి. త్రిభుజాలు కొండలు, సూటిగా ఉండే చెట్లనుండి తీసుకోబడ్డాయి. చతురస్రము ఒక సంప్రదాయ పవిత్ర స్థలమును సూచిస్తుంది. పెళ్ళి సందర్భములో గుడిసెలకు రంగువేస్తు అర్థ చతురస్రాన్ని గీస్తారు. ధార్మిక దృష్ట్యా ఈ చిత్రానికి చాలా గౌరవం ఇచ్చెడివారు. చంద్రవంక, ఇంద్రధనుస్సులను చూసి కమాను మరియు అర్ధవృత్తాలను గీశారు. పక్షులు ఎగరడం, చేపలు ఈదడాన్ని పరిశీలించి సమాంతర, నిలువు, అడ్డ రేఖల ఆకారాలను నేర్చుకొన్నారు. దగ్గర దగ్గర గల ఐదు నక్షత్రాలను కలుపుతూ గీసిన ఊహారేఖతో ఒక మిథ్యారూపం ఏర్పడి వారికి పంచభుజాకృతి లభించింది. ఈ విధంగా వార్లీ ప్రజలకు అనేక ఆశ్చర్యకరమైన ఆకారాలు, నిర్మాణాల ప్రేరణ ప్రకృతి సృష్టి నుండి లభించింది.

వార్లీలు తమ సంప్రదాయ చిత్రాలకు రంగులను అతి తక్కువగా వాడుతారు. వీరి చిత్రకళలో తెల్లరంగును అధికంగా ఉపయోగిస్తారు. గోడకు తగిలించే చిత్రాలకు ఎర్ర కావిరాయితో ముందుగా చిత్రాన్ని గీస్తారు. తర్వాత తెల్లరంగు కొరకు బియ్యపుపిండి, నీరు, జిగురు కలిపి ఉంచిన మిశ్రమాన్ని తయారుచేస్తారు. బాగా నమలబడి, ఎటువంచితే అటు వంగే వెదురుపుల్లను కుంచెగా ఉపయోగిస్తారు. వీరు మనుషులు మరియు జంతువుల శరీరాల చిత్రాలను, రెండు త్రిభుజాల కొనలను కలుపడం ద్వారా చూపిస్తారు.

నేడు ఈ వార్లీ చిత్రాలు వస్త్రాలపైన, మనం వాడుకునే సంచులు, పెన్ స్టాండులు, ఫైళ్ళు, కుండీలు మొదలైన అనేక వస్తు సామగ్రిపైన చిత్రింపబడి లభ్యమవుతున్నాయి. ఎంతో అద్భుతమైన ఈ వార్లీ జానపద చిత్రకళా సంపద నశించిపోకుండా మనమంతా ప్రోత్సహించి కాపాడుకోవాలి.



# 5. వెదకబోయిన తీగ

**పాఠంలోకి ప్రవేశించేముందు:**


సామెతలు లేదా లోకోక్తులు ప్రజల భాషలో సందర్భానుసారంగా వాటికవే దొర్లుతుంటాయి. వీటిలో భాషా సౌందర్యం, అనుభవసారం, నీతి, సూచన, హాస్యం కలగలిపి ఉంటాయి. ''సామెతలు''ఆ భాష మాట్లాడే ప్రజల సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. ఇవి లేని భాష/మాట నిస్సారం. అందుకే ''సామెత లేని మాట ఆమెత లేని ఇల్లు'' అంటారు. సామెతలకు ఏ ఒక్కరినీ రచయితగా చెప్పలేము. ప్రజలు తమ అనుభవాల్లో నుంచే సామెతలను పుట్టిస్తారు.

ప్రస్తుత పాఠ్యభాగం ద్వారా 'వెదకబోయిన తీగ'' అనే సామెత ఎలా వచ్చిందో తెలుసుకుందాం.

ఒక గ్రామంలో ఒక ధనవంతుడు ఉండేవాడు. ధనంలో కుబేరుడంతటివాడు. ఓసారి అతని వీపులో చిన్న గాయం అయ్యి పుండుగా మారింది. మొదట ఆయన తనకు తెలిసిన చిట్కావైద్యాలేవో చేశాడు. కానీ ఏ మాత్రం తగ్గకుండా ఆ పుండు మరింత పెద్దదైంది.

ఆ ధనవంతునికి ఒక కొడుకున్నాడు. తండ్రి పుండును మాన్పింపజేసేందుకై ఎంతో మంది వైద్యులను రప్పించి వైద్యం చేయించాడు. ఫలితం దక్కలేదు. వీపులో పుండు ఎప్పటిలాగే ఉండి ఆయన్ని తీవ్ర అవస్థకు గురి చెయ్యసాగింది. పెద్ద పెద్ద వైద్యులు సైతం ఆ పుండును మాన్పడానికి ప్రయత్నించి విఫలమయ్యారు.

ఇదిలా ఉండగా ఒకరోజు ఆ ఊరికి ఒక మునీశ్వరుడు వచ్చాడు.  ఆయన ఎంతో మహిమ గల వాడని విన్న ధనవంతుని కొడుకు ఆయన్ని కలుసుకుని తన తండ్రి విషయం చెప్పి ''మీరు తపస్సంపన్నులు. ఎలాగైనా మా తండ్రిగారి పుండుని మాన్పి ఆయన బాధను నివారించండి'' అని వేడుకున్నాడు.



మునీశ్వరుడు సరేనని అతనితో ఇంటికి వెళ్లాడు. చాలాసేపు ధనవంతుని పుండును పరిశీలించి ''ఈ పుండు మామూలు ఔషధాలకు లొంగేది కాదు. సాధారణంగా ఆ

తీగ దట్టమైన అడవులలోను, పర్వత ప్రాంతాల్లోనూ లభిస్తుంది. ఆ తీగ ఆకులను తెచ్చి వాటి పసరును పుండు మీద పోస్తే కొద్ది రోజుల్లోనే మానిపోతుంది'' అని చెప్పి ఆ తీగ ఆకులు ఎలా ఉంటాయో, దానినెలా గుర్తించాలో వివరంగా చెప్పాడు.

ధనవంతుని కుమారుడు ఆ తీగ ఆకులను తీసుకొని రావడానికి ప్రయాణమయ్యాడు. తనకు కావలసిన ఆహార పదార్థాలను సమకూర్చుకుని మునీశ్వరుడి ఆశీర్వాదం పొంది బయలుదేరాడు.

ఇంటినుండి కొంతదూరం వెళ్లాడు. అక్కడ దారికి రెండువైపులా దట్టంగా మొక్కలు పెరిగాయి. వాటి మధ్యనుండి ముందుకు నడుస్తుండగా అతని కాలికి ఏదో తీగ చుట్టుకుని అదుపు తప్పి దభీలుమని క్రింద పడిపోయాడు.

తనకాలికి తగిలిన ఆ తీగను పరిశీలనగా చూశాడు. మునీశ్వరుడు చెప్పిన ఆనవాలుకు ఆ తీగ సరిగ్గా సరిపోయింది. వెంటనే వెనక్కి వెళ్లి మునీశ్వరుడికి విషయం చెప్పి ఆ తీగను చూపించాడు. అప్పుడు మునీశ్వరుడు ''మనకు కావలసిన తీగ ఇదే! నువ్వు వెదకబోయిన తీగ నీ కాలికే తగిలింది'' అని చెప్పి ఆ తీగ ఆకుల పసరుతో ధనవంతుడి పుండుకు చికిత్స చేశాడు.

వారంరోజుల్లోనే ధనవంతుడు కోలుకున్నాడు. పుండు మానిపోయింది. అప్పట్నుంచి ''వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు'' అన్న సామెత వాడుకలోకి వచ్చింది.

---

## I. వినండి-సంభాషించండి:

1. ధనవంతుడు దేనితో బాధపడుతుండేవాడు ?
2. ధనవంతుని కుమారుడు వైద్యులను ఎందుకు రప్పించాడు?
3. మునీశ్వరుడు ఎలాంటివారు ?
4. ధనవంతుని కుమారుడు ఎక్కడకు ప్రయాణమయ్యాడు ?

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### పదజాలాన్ని పెంపొందించుకుందాం.

అవస్థ = బాధ; పసరు = ఆకురసము, పచ్చిక

## III. కృత్యము

### పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనానుసారంగా కృత్యాలు చేయండి.



### అ. తప్పొప్పులు గుర్తించి రాయండి.

1. ఆయన తనకు తెలిసిన చిట్కా వైద్యా లేవో చేశాడు.
2. ఆ పుండు మరింత చిన్నదైంది.
3. ఆ ఊరికి ఒక కవీశ్వరుడు వచ్చాడు.
4. ఆధనవంతునికి ఒక కొడుకున్నాడు.

(పరిచ్ఛేదం : పుట సంఖ్య.... 47 లోని ''ఒక గ్రామంలో.... వేడుకున్నాడు'' వరకు)

### ఆ. గీతగీసిన పదాలకు బదులుగా కుండలీకరణంలోని సరైన పదాన్ని ఎన్నుకొని పూర్తి వాక్యాన్ని రాయండి.

**(ధనం, అవస్థ, పరిశీలించి, ధనవంతుని, తండ్రి)**

1. పుండు ఆయన్ని తీవ్ర <u>బాధకు</u> గురిచేయసాగింది.
2. మా <u>నాన్న</u> గారి పుండును మాన్పిచండి.
3. <u>సంపదలో</u> కుబేరుడంతటి వాడు
4. <u>భాగ్యవంతుని</u> కొడుకు ఆయన్ని కలుసుకున్నాడు.

### ఇ. వాచకములు గుర్తించి రాయండి.

1. గ్రామం 2. ధనవంతుడు

### ఈ. స్వీయ స్పందన.

''నువ్వు పాఠశాలకు వెళ్తుండగా, నీ స్నేహితుడు అకస్మాత్తుగా కళ్ళు తిరిగి పడి పోయాడు.'' నీవు అతనికి ఏవిధంగా చికిత్స చేస్తావు?

## IV. వినండి-చర్చించండి-రాయండి.

### అ. జవాబులు రాయండి.

1. ధనవంతుని కుమారుడు వైద్యం చేయించిన విధము చర్చించండి.
2. మునీశ్వరుడు – ధనవంతుని కుమారుడు మధ్య జరిగిన సంభాషణ రాయండి.
3. ధనవంతుని కుమారుడు పర్వతాలకు వెళ్లే మార్గంలో జరిగిన సంఘటనను చర్చించండి.
4. ధనవంతుడు కోలుకున్న విధము రాయండి.

### ఆ. ఎవరు ఎవరితో పలికిరి

1. "మా తండ్రిగారి పుండును మాన్పి ఆయన బాధను నివారించండి" ________ – ________
2. "వింధ్య పర్వతాలలోని తీగ ఆకులను తెచ్చి పసరు పుండు మీద వేస్తే పుండు మానిపోతుంది"
________ – ________

### ఇ. జతపరచి రాయండి:

| 'క' వర్గం | 'చ' వర్గం |
|---|---|
| 1. దారికి రెండు వైపులా | అ. నీకాలికే తగిలింది |
| 2. వీపులో చిన్న గాయంఅయ్యి | ఆ. లొంగేది కాదు |
| 3. నువ్వు వెదక బోయిన తీగ | ఇ. పుండుగా మారింది. |
| 4. ఈ పుండు మామూలు ఔషధాలకు | ఈ. దట్టంగా మొక్కలు పెరిగాయి. |

### ఈ. అల్లిక:

ధనవంతుని పుండు గురించి మునీశ్వరుడు చెప్పినది – ________ – ________ – ________ – ________

## V. స్వీయ వ్యక్తీకరణ:

1. నీకు వచ్చిన జలుబు, జ్వరం తగ్గించడానికి ఇంట్లో చేసే వైద్యం గురించి రాయుము.
2. ఏవేని అయిదు ఔషధ మొక్కలు – వాటి ఉపయోగాలు రాయుము.

## VI. భాషావగాహన

### అ. కింది వాక్యములలో గీత గీసిన పదాలు ఏ భాషాభాగాలకు చెందినవో రాయండి.

1. మునీశ్వరుడు సరేనని అతనితో ఇంటికి వెళ్ళాడు.
   మునీశ్వరుడు = ________ వెళ్ళాడు = ________

### ఆ. వాక్యాంగాలు రాయండి.

1. ఆయన తనకు తెలిసిన చిట్కా వైద్యాలను చేశాడు.
2. ధనవంతుని కుమారుడు తీగ ఆకులను తెచ్చాడు.

### ఇ. కింది పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించండి.

1. విఫలమగుట 2. సమకూర్చుట 3. ఆశీర్వాదము

### ఈ. సామాన్య/సంయుక్త వాక్యాలను రాయండి.

1. ఎంతో మంది వైద్యులను రప్పించి వైద్యం చేయించాడు కాని ఫలితం దక్కలేదు.
2. మునీశ్వరుడు అతనితో ఇంటికి వెళ్ళాడు.

**ఉ.** **సంధి చేసి రాయండి.**

1. వైద్యాలు + ఏవో  2. ముని + ఈశ్వరుడు =  3. దట్టము + ఐన  4. దానిని + ఎలా =


## VII. సృజనాత్మకత:

**అ.**

1. సామెతలను సేకరించి వాటికి సంబంధించిన కథలను అంతర్జాలంలో వెదకి రాయండి.
2. సామెతలను రాసి వాటికి సమానమైన ఆంగ్ల సామెతలను రాయండి.
3. మీకు తెలిసిన మరొక సామెత పుట్టుక గురించి రాయండి.

**ఆ.** **పోలికలు – తారతమ్యాలు**


**కింది చిత్రాలను గమనించండి. అందులోని పోలికలు – వ్యత్యాసాలను రాయండి.**




**నేనిది నేర్చుకున్నా**

పరిసరాలలో ఉన్న ఎన్నో ఔషధమూలికల మొక్కలు అమూల్యమని తెలుసుకున్నా!

**వి.సూ:** మరికొన్ని సామెతల గురించి అంతర్జాలం శోధించి అర్థాన్ని తెలుసుకోండి.



# 6. ఈశ్వరచంద్ర విద్యాసాగర్

**పాఠంలోకి ప్రవేశించేముందు:**



- పై చిత్రాలను గమనించండి.
- మనం చేసుకోలేని, చేయని పనులను ఇతరులతో చేయించడం ఎంతవరకు సబబు–చర్చించండి.

ఇప్పుడు పై విషయాలతో కొంత సంబంధం కలిగిన ఈ పాఠాన్ని చదువుదాం. చివరికి ఏమైందో తెలుసుకుందాం.

---

అప్పటికి పగలు పదకొండు గంటలయింది. బర్ద్వాన్ స్టేషన్‌కు రైలు వచ్చి ఆగింది. మొదటి తరగతి పెట్టెలో నుంచి ఒక నవయువకుడు క్రిందికి దిగాడు. అతని వెంట ఒక పెట్టె, ప్రేము సంచీ మాత్రం ఉన్నాయి. నల్ల కళ్లద్దాలు తుడుచుకొని, క్రాపుసరిచేసుకొని, మెడకు ఉన్న టై సర్దుకొని అటూ ఇటూ చూచాడు నవయువకుడు. కూలీ! కూలీ! అని అరిచాడు. ప్లాటుఫారంపైన కూలీ కనిపించలేదు.

యువకుడు అసహనంగా మొహం చిట్లించుకున్నాడు. పెద్దగా చప్పట్లు కొడుతూ మళ్లీ "కూలీ! కూలీ!" అని పిలిచాడు. కాని అక్కడ ఎవరైనా కూలీలు ఉంటేగా రావటానికి.

మిట్టమధ్యాహ్నం. ఎండ మిటమిటలాడుతున్నది. యువకుడికి ఏం చేయాలో తోచలేదు. ఇంతలో ఒక వృద్ధుడు అక్కడకు వచ్చాడు. "బాబూ! ఇక్కడి కూలీలు ఎక్కడికో వెళ్లారు. మీకు అభ్యంతరం లేకపోతే మీ పెట్టెనీ, సంచీనీ నేను మోసుకొని వస్తాను. ఏమంటారు?" అన్నాడు నవయువకుడితో.

నవయువకుడు అందుకు ఆనందంతో అంగీకరించాడు. వృద్ధుడు సామానులు రెండుచేతులతో పట్టుకొని యువకుడి వెంట నడిచాడు. కొంత సేపటికి ఉభయులూ నవయువకుడి ఇంటికి చేరారు. వృద్ధుడు పెట్టెనూ, సంచీనీ ఇంటి మధ్యగదిలో జాగ్రత్తగా పెట్టి "బాబూ! నేను వెళ్లి వస్తాను" అని అన్నాడు. యువకుడు వృద్ధుడికి కూలి డబ్బులు ఇవ్వబోయాడు. కాని వృద్ధుడు తీసుకోవటానికి నిరాకరించాడు. అతని అమాయకత్వాన్ని చూచి యువకుడికి ఎంతో ఆశ్చర్యం కలిగింది.





సాయంకాలం నగరంలో పెద్ద సభ జరగబోతున్నది. ఆ మహాసభలో పాల్గొనటం కోసమే యువకుడు బర్ద్వాన్ నగరానికి వచ్చాడు సరిగా కార్యక్రమం ప్రారంభం అయ్యే సమయానికి యువకుడు సభాభవనానికి చేరుకున్నాడు.

ఆనాటి సభకు అధ్యక్షుడు మహామేధావి అయిన ఈశ్వరచంద్ర విద్యాసాగర్. యువకుడు సభలోకి వెళ్లి కూర్చున్నాడు. అతనికి కొంచెం ప్రక్కగా ఆ మధ్యాహ్నం కనిపించిన వృద్ధుడు కూర్చుని ఉన్నాడు. "ఇదేమిటి? ఇతడు ఇక్కడికి కూడా వచ్చాడే. తన వంటి వారు ఇటు వంటి సభలకీ, సమావేశాలకీ రాకూడదని తెలియదేమో పాపం!" అనుకున్నాడు యువకుడు.

ఇంతలో సభాప్రారంభకుడు వేదిక పైకి వచ్చి "ఈనాటి సభకు అధ్యక్షస్థానం అలంకరించమని ఈశ్వరచంద్ర విద్యాసాగర్ గారిని ఆహ్వానిస్తున్నాను" అన్నాడు. ఈశ్వరచంద్రుణ్ణి చూచి ఎరుగని నవయువకుడు ఆయన ఎలా ఉంటాడో అని కుతూహలంగా సభను అంతటినీ కలయ చూస్తున్నాడు. అతని కళ్లు సంభ్రమాశ్చర్యాలతో హఠాత్తుగా ఒక్కచోట ఆగిపోయాయి. తన సామానులు తెచ్చిన వృద్ధుడు లేచి గబగబా వేదికి మీదకు వెళ్లి అధ్యక్షుడుగా కుర్చీలో కూర్చున్నాడు. ప్రారంభకుడు వృద్ధుడికి పాదనమస్కారం చేసి మల్లెపూలదండ మెడలో వేశాడు.

సభ సమాప్తం కాగానే యువకుడు ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వద్దకు వెళ్లి వందనం చేసి తన అవివేకాన్ని క్షమించవమని పరిపరివిధాలుగా ప్రార్థించాడు. నిరాడంబరతకూ, నిస్వార్థానికీ, పని విలువకూ ప్రతీకగా విద్యాసాగర్‌ని గుర్తించాడు.

## I. వినండి-సంభాషించండి:

1. "తక్కువ సామానులతో ఎక్కువ సౌకర్యం."
2. మన పనులు మనమే చేసుకోవడం శ్రేష్ఠం.

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### పదజాలం పెంపొందించుకుందాం.

అసహనంగా = ఓర్పు లేకుండగా; అభి + అంతరం = కాదనక, అడ్డు చెప్పడం; మహామేధావి = చాలా తెలివిగలవాడు; కుతూహలంగా = ఆసక్తిగా; ఎరుగని = తెలియని; కలయ చూస్తున్నాడు = చుట్టు చూస్తున్నాడు; సంభ్రమం = తత్తరపాటు; నిరాడంబరత = డాబు లేని, దర్పంలేని; నిస్వార్థము = స్వార్థంలేని; ప్రతీక = గుర్తు, సంకేతం; ఉభయులూ = ఇద్దరూ.



## III. కృత్యం.

### అ. కుండలీ కరణంలో ఇచ్చిన పదాలను ఉపయోగించి ఖాళీలను పూరించండి.

(సమావేశాలకీ, మల్లె పూలదండ, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కుర్చీలో)

1. ________________ మెడలో వేశాడు
2. సభకు అధ్యక్షుడు మహామేధావి అయిన ________________
3. అధ్యక్షుడుగా ________________ కూర్చున్నాడు.
4. సభలకీ, ________________ రాకూడదని తెలియదేమో పాపం.

(పరిచ్ఛేదం: పుట సంఖ్య ... 52లోని "ఆనాటి సభకు అధ్యక్షుడు నుంచి .............. మెడలో వేసాడు" వరకు)

### ఆ. ఎవరు ఎవరితో పలికిరి.

1. "ఈనాటి సభకు అధ్యక్షత వహించమని ఈశ్వరచంద్ర విద్యాసాగర్ గారిని ఆహ్వానిస్తున్నాను."
2. "తనవంటివారు ఇటువంటి సభలకీ, సమావేశాలకీ రాకూడదని తెలియదేమో పాపం".

### ఇ. గీతగీసిన ప్రత్యయాలు ఏ విభక్తులో రాయండి.

1. యువకుడు సభలోకి వెళ్లి కూర్చున్నాడు.
2. ఈశ్వర చంద్ర విద్యాసాగర్ గారిని ఆహ్వానిస్తున్నా.

### ఈ. స్వీయసంస్పందన

యువకునికి ఈశ్వర చంద్ర విద్యాసాగర్‌పై గల అభిప్రాయాన్ని మీ సొంతవాక్యాల్లో రాయండి.

## IV. వినండి-చర్చించండి-రాయండి.

### అ. జవాబులు రాయండి.

1. వృద్ధుడు నవయువకునితో అన్న మాటలు.
2. యువకుడు బర్ద్వాన్ రావడానికి కారణం
3. అనాటి సభకు అధ్యక్షుడు.
4. విద్యాసాగర్ గారు దేనికి ప్రతీక

### ఆ. ఖాళీలు పూరించండి.

1. మొదటి తరగతి పెట్టెలో నుంచి ఒక ________________ క్రిందికి దిగాడు.
2. యువకుడు వృద్ధుడికి ________________ ఇవ్వబోయాడు.
3. ఆ మహాసభలో పాల్గొనటం కోసమే యువకుడు ________________ నగరానికి వచ్చాడు.
4. అతని కళ్ళు ________________తో హఠాత్తుగా ఒక్కచోట ఆగిపోయాయి.

### ఇ. తప్పొప్పులను గుర్తించి రాయండి.

1. ప్లాటుఫారంపైన కూలీ కనిపించ లేదు.
2. మధ్యాహ్నం కనిపించిన యువకుడు కూర్చుని ఉన్నాడు.
3. అప్పటికి రాత్రి పదకొండు గంటలయింది.
4. వృద్ధుడు తీసుకోవటానికి నిరాకరించాడు.

### ఈ. అల్లికను పూర్తి చేయండి.

ఈశ్వరచంద్ర విద్యాసాగర్ గారి స్వభావాలు

| | | |
|---|---|---|
| | | |

## V. స్వీయవ్యక్తీకరణ

నిరాడంబరతకు, నిస్వార్థతకు ప్రతీకయై నిన్ను స్పందింపజేసిన మహనీయుని గురించి రాయుము.

## VI. భాషానగాహన:

### అ. కింది వాక్యాలు ఏ కాలానికి చెందినవో రాయండి.

1. సాయంకాలం నగరంలో పెద్ద సభ జరగబోతున్నది ________________
2. బర్ద్వాన్ స్టేషన్‌కు రైలు వచ్చి ఆగింది ________________
3. యువకుడు కుతూహలంగా సభ అంతటినీ కలయ చూస్తున్నాడు ________________

### ఆ. గీత గీసిన పదాలు ఏ భాషాభాగాలకు చెందినవో రాయండి

1. యువకుడు అసహనంగా మొహం చిట్లించుకున్నాడు. [ ] [ ]
2. నంచిని నేను మోసుకొస్తాను. [ ] [ ]
3. అక్కడ ఎవరైన కూలీలు ఉంటేగా రావడానికి [ ]

### ఇ. కింది పదాలకు వ్యతిరేక పదాలు ఎంచుకుని రాయండి

(యువకుడు, అవివేకం, నిరాకరించుట, నిరభ్యంతరం, ప్రారంభం, స్వార్థం)

1. అభ్యంతరం X [ ]
2. [ ] X వృద్ధుడు
3. [ ] X అంగీకరించుట
4. సమాప్తం X [ ]
5. నిస్వార్థం X [ ]
6. వివేకం X [ ]

### ఈ. కింది పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించి రాయండి.

1. హఠాత్తుగా = ________________
2. కలయచూచుట = ________________
3. ఆహ్వానము = ________________
4. నిరాకరించుట = ________________

ఉ. కింది వాక్యాలను చదివి సామాన్య/సంయుక్త వాక్యాలను గుర్తించి రాయండి.

1. వృద్ధుడు డబ్బు తీసుకోలేదు.
2. నవయువకుడు నల్ల కళ్లద్దాలు తుడుచుకుని, క్రాపు సరిచేసుకుని అటు ఇటు చూశాడు
3. మీ పెట్టెనీ, సంచినీ నేను మోసుకొని వస్తాను.
4. ఎండ మిటమిటలాడుతున్నది.

ఊ. సంధి చేసి రాయండి.

1. ఎవరు + ఐనా    2. అభి + అంతరం    3. ఏమి + అంటారు    4. ఇది + ఏమిటి

## VII. సృజనాత్మకత :

'లాల్ బహదూర్ శాస్త్రి', 'గాంధీ', 'మదర్ థెరిస్సా' మొదలయిన వారి నిరాడంబర జీవితాన్ని సూచించే ఘట్టాలను అంతర్జాలంలో వెదకి రాయండి. సూచనాఫలకంలో ప్రదర్శించండి.

## VIII. లేఖన నైపుణ్యాలు: అనుభవ లేఖనం

స్వయంగా చూచిన లేదా అనుభవించిన విషయాల ముఖ్యాంశాలను స్వేచ్ఛగా సొంత మాటలలో రాయాలి.
కింది అంశాలను చదివి మీ అనుభవాన్ని రాయండి.

వైజ్ఞానిక ప్రదర్శన →
- తేది : 03/12/2018
- స్థలం : శారదా విద్యాలయం
- ప్రదర్శనలో నీవు చూసిన ప్రదర్శితాలు
- నీ అనుభవాలు
- నిర్వహించిన పాత్ర

లేఖన నైపుణ్యాలు : గద్య అవగాహన

కింది గద్యమును/పరిచ్ఛేదమును చదివి ఐదు ప్రశ్నలు తయారు చేయండి.

ప్రస్తుత కాలంలో మూడురకాల ఒలంపిక్ క్రీడలు జరుగుతున్నాయి. అవి వేసవి క్రీడలు, చలికాలపుక్రీడలు, దివ్యాంగుల క్రీడలు. ఇవి పదహారేసి రోజులు జరుగుతాయి. వీటిలో ఏ దేశమైన పాల్గొనవచ్చు. ధనుర్విద్య, ముష్టి యుద్ధము, మల్లయుద్ధము, సైక్లింగ్, ఈత బరువులెత్తటం, తుపాకీ గురి (రైఫిల్ షూటింగ్) పడవ పందెములు, గుర్రపుస్వారీ, చేతి బంతి ఆట, హాకీ మొదలైనవి. ఈ ఒలింపిక్ పోటీల్లో చేర్చబడ్డాయి. క్రికెట్ ఆటకు ఈ పోట్లీ స్థానం లేదు. ఈ ఆట్లలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు ఇస్తారు. ఆటల్లో గెలిచి పతకాలు సాధించటం ముఖ్యం కాదు. వీటిల్లో పాల్గొనగలగటమే విశేషం.

ప్రశ్నలు:

1. ______________________
2. ______________________
3. ______________________
4. ______________________
5. ______________________



నేనివి నేర్చుకొన్నా:

మన పని మనం చేసుకోవడం ఏ మాత్రం తప్పుకాదు.

9JD9P1



# 7. మనసుంటే మార్గముంటుంది



## 1. ఆత్మబలమే ఆలంబనగా......

మనసుంటే మార్గముంటుంది (వేర్ దేరీజ్ ఎ విల్ దేరీజ్ ఎవే). 'కృషితో నాస్తి దుర్భిక్షం' మొదలైనవి మనం వింటూనే ఉంటాం. దృఢమైన సంకల్పం, పట్టుదల అన్నింటిని మించి ఆత్మవిశ్వాసం ఉంటే సాధించలేనిదేదీ లేదని 26 ఏళ్ళ వయస్సులోనే ఋజువు చేసింది ప్రాంజల్ పాటిల్. ప్రాంజల్ మహారాష్ట్ర, థానే జిల్లా ఉల్హాస్ నగర్‌లో జన్మించింది. ఆమెకు పుట్టినపుడు చూపు కొద్దిగా ఉంది. కాని ఆరేళ్ళ వయసులో ఆమె చూపును పూర్తిగా కోల్పోయింది. అయినా విద్యపై ఆమెకున్న మక్కువను గమనించిన ఆమె తల్లిదండ్రులు ప్రాంజల్‌ని చదివించాలని నిశ్చయించుకున్నారు. ఆమె తల్లిదండ్రులు నిశ్చయించుకున్నారు. ఆమె చదువుకు అండగా నిలిచారు.

పాఠశాల విద్య నుండి ఐ.ఎ.ఎస్ వరకు ప్రాంజల్ చదువు కొనసాగిన విధానం ఆమె పట్టుదల, లక్ష్య సాధన, దానికి కావలసిన అంచెలంచెల ప్రణాళికకు అద్దం పడుతుంది.

ప్రాంజల్ పాటిల్ ప్రతిరోజు ఉల్హాస్ నగర్ నుండి సియస్ ఎమ్‌టి దాకా వెళ్ళేది. రోడ్డు దాటడానికి రైలు ఎక్కడానికి ఎవరో ఒకరు సహాయపడేవారు. ఆమె ముంబయిలోని దాదర్‌లోని శ్రీమతి కమలా మెహతా అంధుల పాఠశాల నుండి బ్రెయిలీ విధానంలో 12వ తరగతి 85 శాతం మార్కులతో పాసయింది. చాంది బాయి కళాశాల ఆర్ట్స్ విభాగంలో మొదటి ర్యాంకును చేజిక్కించుకుంది. ముంబయిలో సెయింట్ జేవియర్ కళశాల నుండి రాజనీతి శాస్త్రంలో బి.ఎ. డిగ్రీ తీసుకుంది ఆ పైన ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుండి అంతర్జాతీయ సంబంధాలు (ఇంటర్నేషనల్ రిలేషన్స్)లో ఎం.ఎ డిగ్రీ తీసుకుంది.

ఆమె విజయం సాధించడానికి సాంకేతిక పరిజ్ఞానం బాగా సహాయపడింది. జాబ్ యాక్సిస్ విత్ స్పీచ్ (Job Access with Speech, JAWS) అనే సాఫ్ట్‌వేర్ బాగా ఉపయోగపడింది. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా అంధత్వ లోపం ఉన్నవారు కంప్యూటర్ స్క్రీన్‌పైన విషయాన్ని వినవచ్చు (Text -to speech output) లేదా రిఫ్రషబుల్ బ్రెయిలీ డిస్‌ప్లే (Refreshable) ద్వారా చదవవచ్చు. వీటినుపయోగించుకొని ప్రాంజల్ 2015 సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధమయ్యింది.

ప్రాంజల్ డిగ్రీ చదువుతున్నపుడు ఐ.ఎ.ఎస్ గురించి విని మక్కువ పెంచుకుంది. తాను ఐ.ఎ.ఎస్ అధికారి కావాలనుకుని యు.పి.ఎస్.సి గురించి మరింత తెలుసుకోవడం మొదలు పెట్టింది. ఆమె 2015 లో ఐఎఎస్‌కు తయారువుతూ, ఎం ఫిల్ డిగ్రీ కోసం కూడా పరిశోధన సాగించింది. కానీ ఆమెకు పరీక్షలు రాయడం కష్టమయింది. ఆమె చెప్పినంత వేగంగా రాసే రాయసకాడు (Writer) దొరకడం కష్టమయింది. అయితే విదుషి ఆమెకు అండగా నిలిచింది. సివిల్స్ లోని మెయిన్స్ పరీక్షల పేపరు 3 గంటల్లో రాయాలి. అయితే రాయసకారుని సహాయంతో రాసే వారికి 4 గంటల సమయం ఇస్తారు. పరీక్షలకు తయారుకావడం అంత సులభం కాదు. పుస్తకాలు తెచ్చుకోవాలి. వాటిని స్కాన్ చేయాలి. ఆ తరువాత వాటిని జాస్ (JASW) ద్వారా వినాలి. అయినప్పటికి ఆమె కోచింగ్ క్లాసుల సహాయం లేకుండానే యు.పి.ఎస్.సి పరీక్షల్లో బ్రహ్మాండమైన విజయాన్ని సాధించింది. సివిల్ సర్వీసెస్‌లో మొదటి అటెంప్ట్‌లోనే 773వ ర్యాంకు సాధించింది. ఈ విజయానికి తన తల్లిదండ్రులు, భర్త, మిత్రులు సహకరించారని అంటుంది. ముఖ్యంగా తల్లికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది ప్రాంజల్.

## 2. మహిళా క్రికెట్ మాణిక్యం



మిథాలీ దొరైరాజ్ భారతదేశపు మహిళా క్రికెట్ క్రీడాకారిణి. ఆమె 1982 డిశంబర్ 3న శ్రీదొరైరాజ్, శ్రీమతి లీలా దొరైరాజ్ దంపతులకు రాజస్థాన్‌లోని జోథ్‌పూర్‌లో జన్మించింది. విద్యాభ్యాసం హైదరాబాద్‌లో జరిగింది.

మిథాలీ 10 ఏళ్ళ వయస్సులో ఆడటం మొదలు పెట్టింది. ఆమె తన అన్నయ్యతో కలిసి పాఠశాల రోజుల్లోనే క్రికెట్ కోచింగ్ తీసుకోవడం ప్రారంభించింది. పాఠశాలలో ఆమె తరచుగా నెట్ క్రికెట్‌లో అభ్యాసం చేసేది. 17 ఏళ్ళ వయస్సులో ఆమె భారత జట్టుకు ఎంపికైంది.

క్రికెటింగ్ బ్యాటర్స్‌లో ఒకరిగా, మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా పేరు పొందింది అంతేగాక ఓ.డి.ఐ (ODI)లలో 6000 పరుగులు సాధించిన ఏకైక మహిళా క్రికెటర్‌ను ఏడు సీరిస్‌లలో వరుసగా అర్థశతకాలను సాధించి ఘనతవహించిన మహిళా క్రికెట్ క్రీడాకారిణిగా ఆమెను పేర్కొనవచ్చు. అతి పిన్నవయస్సులో భారతదేశపు నాల్గవ అత్యున్నత పౌరపురస్కారమైన 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకొని, క్రీడాకారిణిలకు ఆదర్శంగా నిలచిన అద్భుత మహిళ.

మిథాలీకి లభించిన పురస్కారాలు.

| సంవత్సరం | పురస్కారం |
|---|---|
| 2003 | అర్జున అవార్డ్ |
| 2015 | పద్మశ్రీ పురస్కారం |
| 2017 | యూత్ స్పోర్ట్స్ ఐకాన్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్ |
| 2017 | వోగ్ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ |

## I. వినండి-సంభాషించండి:

1. మీకు తెలిసిన కొందరి సివిల్ ఉద్యోగుల (ఐ.ఏ.ఎస్. అధికారులు) పేర్లను చెప్పండి.
2. ఉత్తమ మహిళా క్రికెటర్ల పేర్లను చెప్పండి.

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### పదజాలాన్ని పెంపొందించుకొందాం.

మార్గము = దారి; కృషి = ప్రయత్నం; దుర్భిక్షం = కరువు; దారిద్ర్యం; ఆత్మ విశ్వాసం = తనపై తనకు గల నమ్మకం; మక్కువ = ఇష్టం; అండ = ఆసరా, ప్రాపు, ఆశ్రయం; కృతజ్ఞత = చేసిన మేలు మరవక పోవడం; త్యజించుట = విడుచుట; ఆదేశించు = ఆజ్ఞాపించు; తర్ఫీదు = శిక్షణ, అభ్యాసం; అష్టకష్టాలు = నానా బాధలు పడు; సంఘర్షణ = పోటీ; అండదండలు = సహాయం, తోడు; తలమానికం = మేలైన; శ్రేష్ఠమైన; అంచెలంచెలు = దశలవారిగా;

### కృత్యం

కింది పరిచ్ఛేదమును చదివి సూచనానుసారం కృత్యాలను చేయండి.



అ. కింది అల్లికను పూరించండి.

ప్రాంజల్‌పాటిల్ విద్యాభ్యాసము

పరిచ్ఛేదం: పుట సంఖ్య: ... 56లోని "ప్రాంజల్ పాటిల్ ప్రతి రోజు .......... పరీక్షలకు సన్నద్ధమయింది"- వరకు

ఆ. కింది వాటికి జవాబులు రాయండి.

1. ప్రాంజల్ విజయం సాధించడానికి సహాయపడిన సాఫ్ట్‌వేర్
2. బి.ఏ డిగ్రీ చదివిన కళాశాల

ఇ. కింది పదములు ఏవాచకములకు చెందినవో రాయండి.

1. ఆమె = ______ 2. రైలు = ______

ఈ. స్వీయస్పందన:

ప్రాంజల్‌పాటల్ సివిల్ సర్వీస్ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధమయిందో మీ సొంతమాటలలో రాయండి.

## III. వినండి-చర్చించండి-రాయండి.

### అ. జవాబులు రాయండి.

1. ప్రాంజల్ పాటిల్ యు.పి.ఎస్.సి పరీక్షల్లో మొదటి అటెంప్ట్‌లోనే విజయాన్ని సాధించిన విధము.
2. మిథాలీ దొరైరాజ్ క్రికెట్ అభ్యాసము - అనేక పరుగులు సాధించిన విధము.
3. మిథాలీ దొరైరాజ్ ఎప్పుడు, ఏయే పురస్కారాలు పొందారు?

ఆ. కింది ఖాళీలను కుండలీకరణంలోని సరైన పదములతో పూరించండి:

(773, 6000, అష్టకష్టాలు)

1. ప్రాంజల్ సివిల్ సర్వీసెస్‌లో మొదటి అటెంప్ట్‌లోనే ____________ ర్యాంకు సాధించింది.
2. మిథాలీ దొరైరాజ్ ఓ.డి.ఐ (ODI) లలో ____________ పరుగులు సాధించిన ఏకైక మహిళా క్రికెటర్.

ఇ. కింది అల్లికలు పూరించండి.

మిథాలీ దొరైరాజ్ పొందిన పురస్కారాలు

## IV. స్వీయవ్యక్తీకరణ

"కృషితో నాస్తి దుర్భిక్షం" అను సామెతను వివరించండి.

## V. భాషావగాహన

అ. కింది వాక్యములలోని గుర్తింపబడిన పదాలు ఏభాషాభాగములకు చెందినవో రాయండి.

ఆమె కోచింగ్ క్లాసుల సహాయం లేకుండానే బ్రహ్మాండమైన విజయాన్ని సాధించింది.

ఆమె = ____________ బ్రహ్మాండమైన = ____________ సాధించింది = ____________

ఆ. కింది పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించి రాయండి.

1. ఆత్మవిశ్వాసం 2. కృతజ్ఞత 3. అష్టకష్టాలు 4. అండదండలు

ఇ. కింది పదాలను విడదీసి రాయండి.

1. చదువుచుండగా 2. విద్యాభ్యాసం 3. అత్యధిక 4. అత్యున్నత

ఈ. కింది గుర్తించ బడిన ప్రత్యయములు ఏవిభక్తులకు చెందినవో రాయండి.

1. ప్రాంజల్ చూపును పూర్తిగా కోల్పోయింది.

ను = ద్వితీయా విభక్తి తృతీయా విభక్తి చతుర్థీ విభక్తి

2. ఆమె చదువుకు అండగా నిలిచారు

కు = షష్ఠీ విభక్తి పంచమీ విభక్తి సప్తమీ విభక్తి

ఉ. కింది వాక్యాలోని వాక్యాంగములను గుర్తించి రాయండి.

1. ప్రాంజల్ మొదటి ర్యాంకును సాధించింది.
2. మిథాలీ అర్ధశతకాలను సాధించింది.

ఊ. కాలములు గుర్తించండి

1. ప్రాంజల్ సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధమైంది = ____________
2. మిథాలీ రాజ్‌ను ఏడు సీరిస్‌లలో వరుసగా అర్ధ శతకాలను సాధించిన మహిళా క్రికెట్ క్రీడాకారిణిగా పేర్కొనవచ్చు. ____________

## VI. సృజనాత్మకత :

1. మీకు నచ్చిన క్రికెటర్లను గురించి అంతర్జాలం ద్వారా తెలిసికొనండి.
2. ఆత్మబలముతో దేనినైనను సాధించవచ్చునని చెప్పుటకు నీకు తెలిసిన ఉదాహరణను వివరించండి.

## VII. లేఖననైపుణ్యాలు – వర్ణనాత్మక వ్యాసము

**నీకు నచ్చిన ఆటను గూర్చి కింది అంశాల ఆధారంగా వర్ణనాత్మక వ్యాసము రాయండి.**

- నచ్చిన ఆట → నచ్చుటకు కారణము → ఆట ఆడు విధానము → ముగింపు

### సమాచార ప్రసార సాంకేతిక పరిజ్ఞానము (ICT)



వికీపీడియాను ఒక ఉచిత విజ్ఞాన సర్వస్వము అనవచ్చు. ఇది దీనిని ఉపయోగించు వ్యక్తులందరి భాగ స్వామ్యంతో వ్రాయబడుతుంది. ఇది ఒక ఉచిత సమాచార ఆకరం (బేస్). వికీపీడియాలో ఎవరైనా సరే సమాచారాన్ని ప్రచురించవచ్చును. ఉపలబ్ద సమాచారంలో సవరణలు చేయవచ్చును. ప్రస్తుతము వికీపీడియాలో ఆంగ్లం మరియు ఇతర భాషలలో లభ్యమగుచున్న సమాచారాన్ని మనం తెలుగులోకి అనువదించి వికీపీడియాలో అప్‌లోడ్ చేయవచ్చును. కానీ, అంతర్జాలంలో, సోషల్ మీడియాల్లో ఫోటోలు, సమాచారం అప్‌లోడ్ చేసేటప్పుడు, మనకు వచ్చిన సమాచారాన్ని 'ఫార్వర్డ్' చేసేటప్పుడు కాపీరైట్ అనుమతులు, 'సైబర్‌లా' నియమాలను తప్పక పాటించాలి.

### అదనపు సమాచారం చదువుదాం – తెలుసుకుందాం:

#### తెలుగు భాషాదినోత్సవం:

వ్యావహారిక భాషోద్యమ పితామహుడు కీ.శే. గిడుగు రామమూర్తి పంతులుగారు. ఆయన జయంతి ఆగస్టు 29వ తేదీ. ప్రజాకవి కాళోజిగారి జయంతి సెప్టెంబరు 9వ తేదీ. ఈ రెండు రోజులు మనం తెలుగు భాషా దినోత్సవాలుగా జరుపుకుంటాము.

#### మన తెలుగు

**'ఇంటర్నేషనల్ ఆల్ఫాబెట్ అసోసియేషన్'**
2012లో థాయ్ లాండ్‌లో నిర్వహించిన **'ప్రపంచ లిపుల'**
సదస్సులో తెలుగు లిపిని
**'సెకెండ్ బెస్ట్ స్క్రిప్ట్ ఇన్ ద వర్ల్డ్ '**గా ఎన్నుకొన్నారు.
కాగా కొరియన్ లిపికి ప్రథమ స్థానం.



### నేనివి నేర్చుకున్నా:

1. 'కృషితో నాస్తి దుర్భిక్షమ్'
2. 'కృషే ఫలి'

9JM5QN

**ఉ.సూ:** తెలుగు భాషా సౌందర్యాన్ని – తెలుగు సాహితీ ఘనతను గూర్చి విద్యార్థులకు తెలియజేయండి.



# 8. సార్థకం

**పాఠంలోకి ప్రవేశించేముందు:**

- ''పరోపకారార్థ మిదం శరీరం'' అంటే ఏమిటో తెలుసా! పరోపకారం కోసం తమ జీవితాన్ని త్యాగం చేసిన మదర్ థెరిసా, పొట్టి శ్రీరాములు గురించి మీకు తెలిసే వుంటుంది.
- ఈ విధంగా పరులకోసం పాటుపడిన కొందరు సేవా మూర్తుల పేర్లు చెప్పండి.
- మానవులే కాకుండా సృష్టిలో ప్రతీది ఏ విధంగా తమ జీవితం సార్థకం కావాలని కోరుకుంటుందో ఈ పాఠం ద్వారా తెలుసుకోండి.

ఒకప్పుడు రామాపురం గ్రామంలో రామనాథం అనే సంపన్నుడు ఉండేవాడు. ఈ సంపద వారి పూర్వీకులిచ్చింది కాదు. రామనాథం గారే కష్టపడి సంపాదించారు.

ఎక్కడాలేని సంపద, ఒకచోట పోగుపడిందంటే, ఆ కుప్ప వెనుక చాలా అన్యాయాలు, అక్రమాలు, అధర్మాలు ఉంటాయని అందరూ అంటూ ఉంటారు. అది అక్షరాలా నిజమయినా కాకపోయినా, రామనాథం గారి సంపాదనలో మాత్రం అన్యాయమంటూ ఏదీలేదు.

ఆయన తన ఆదాయాన్ని పెంచుకుంటూ పోయాడు. తన ఖర్చులను మాత్రం పెరగనివ్వలేదు. వ్యయానికి మించి వచ్చిన ఆదాయంలో చాలా భాగం దాచి ఉంచాడు. ఆ దాచిన మొత్తం పెరిగి పెరిగి అతన్ని భాగ్యవంతుణ్ని చేసింది.

కొంత మంది సంపన్నులలో ఎదుటివారిని హీనంగా చూడడమూ, తమను తాము గొప్ప చేసుకోవడమూ కనబడుతుంది. తమ దగ్గరకు వచ్చే వారందరూ తమనించి ఏదో ఒకటి ఆశించి మాత్రమే వస్తూంటారని మరి కొంతమంది అనుకోవడమూ కద్దు.

రామనాథం ఈ ధోరణికి పూర్తిగా విరుద్ధమైన మనిషి. ''రామాపురంలో చాలామంది ధనవంతులున్నారు. వారందరినీ కాదని నా దగ్గరకే వచ్చారంటే నా అదృష్టమే కారణం!'' అనే వారు రామనాథం గారు తనను చూడడానికొచ్చిన వారితో.

''నాకు కొంచెం పుణ్యం సంపాదించుకొనే అవకాశం మీరు ఇచ్చినందుకు, మీకు నేను కృతజ్ఞతలు చెప్పుకోవాలి. నేను ఇచ్చిన ఈ కొద్దిపాటి విరాళం, మీకెవరైనా ఇస్తారు. కాని మీలాంటి మంచివారికి సాయం చేసే అవకాశం నాకు ఎంతమంది కలిగిస్తారు గనక? అంటారాయన.

రామనాథం గారు చాలా మందికి చాలా రకాలుగా సాయం చేశారు. ఎవరికి ఏ సాయం చేసిందీ ఇంకొకరికి తెలియదు. ఆయనగారూ తెలియనివ్వరు.

ఆయన అలవాట్లు కూడా కొంచెం ప్రత్యేకంగా ఉంటాయి. బాగా చీకటితో లేస్తారు. స్నానాదికాలు పూర్తి చేసుకొంటారు. గుప్పెడు చిల్లర జేబులో వేసుకొని, వేకువ జామునే నడవడం ప్రారంభిస్తారు. తన దగ్గర ఉన్న ఆఖరి పైసా కూడా అయిందాకా అలా ఇచ్చుకొంటూనే పోతారు.

ఈలోగా మొక్కల్నీ మాకుల్నీ పలకరిస్తూ ఉంటారు. చిన్న చిన్న మొక్కలకు పాదులు చేస్తారు. వాటిని గొడ్డు గోదా తినకుండా, ముళ్ళకంపను అడ్డుపెడతారు. కళ్ళు లేనివారికీ, పసి పిల్లలకూ తోడుగా ఉండి నడిపిస్తారు. నిజమో కాదో తెలీదు కానీ ఆయన్ను చూసి, మానులు కూడా వంగి నమస్కారం చేస్తాయని చెబుతారు.

ఒక రోజు వేకువ జామున రామనాథం గారు తల వంచుకొని నడుస్తున్నారు. ఎవరో పొడి దగ్గు దగ్గినట్లు వినిపించి ఆగిపోయారు. ఆగిపోయి చుట్టూరా చూశారు. ఎవరూ కనిపించలేదు. రామనాథం గారు మరో అడుగు ముందుకు వేశారు. ఈసారి ''బాబుగారూ!'' అని బలహీనంగా వినిపించింది. రామనాథం గారు ముందుకేసిన అడుగు వెనక్కు తీసుకున్నారు. మరోసారి చుట్టూరా పరికించి చూశారు. చూసినంతమేరా ఎవరూ కనిపించలేదు. ఆయనగారు సన్నగా నిట్టూర్చి మళ్ళా ముందుకు అడుగు వేశారు.

''బాబుగారూ! మీ గురించి వారూ వీరూ చెప్పుకోవడం విన్నాను. మిమ్మల్ని చూడాలని నా కోరిక కానీ అట్టడుగున ఉన్న కారణంగా మిమ్మల్ని చూడలేకపోతున్నాను. మొన్నా, నిన్నా కూడా నేను మిమ్మల్ని పిలిచాను. మీరు ఇంకేదో ఆలోచనలో ఉన్నారేమో నా పిలుపు వినిపించుకోకుండా వెళ్ళారు. క్షమించండి. అదీ సరికాదు, మీకు వినిపించేలా పిలవకపోవడం నాదే తప్పు. ఇవ్వాళ మీరొస్తున్నారని నాపైవాళ్ళు

చెప్పారు. కాస్త గొంతు పెంచి పిలిచాను. మీకు వినబడింది. అది నా అదృష్టం'' అని వినిపించింది.

రామనాథం ఆశ్చర్యపోయాడు. చుట్టుపక్కలెక్కడా ఎవరూ కనబడరు. అయినా చక్కని గొంతుతో మాటలు వినబడుతున్నాయి. రామనాథం రెండు చేతులూ కలిపి నమస్కారం చేశారు. ''మీరెవరో నాకు తెలీదు. మిమ్మల్ని నేను చూడలేక పోతున్నాను. మీరు ఎక్కడున్నారో చెప్పండి. నేనే మీ దగ్గరకు వస్తాను'' అన్నారు రామనాథం.

''నేను మీ పక్కన ఉన్నాను. మీ కుడి చేతి పక్కగా రాళ్ళ కుప్ప ఉంది చూశారా? ఆ కుప్ప అడుగున ఉన్నాను. నేనా రాళ్ళను తొలగదీసుకొని పైకి రాలేను'' అని వినిపించింది.

''అయితే మీరలానే, అక్కడే ఉండండి! నేను రాళ్ళను తీస్తాను'' అన్నారు రామనాథం. అనడమే కాదు రెండు చేతులతోనూ, రాళ్ళను ఎడాపెడా తీయడం ప్రారంభించారు.

''బాబుగారూ! నా మీద గల దయతో మీరు తొందర పడుతున్నారు. దయచేసి కొంచెం నెమ్మదిగా, ఆ రాళ్ళను పక్కకు తొలగించండి. నాది అల్పప్రాణం. ఏ మాత్రం వత్తిడి తగిలినా, నేను పిండి పిండయి పోతాను'' అని వినిపించింది. ఈసారి ఆ గొంతులో, కొంచెం భయపు నీడలు ఉండడాన్ని రామనాథంగారు గమనించారు.

''ఇంతసేపూ అడగనందుకు నన్ను మన్నించండి. మీ పేరేమిటి?'' అన్నారు రామనాథం చెవులు రిక్కించి,'' జొన్నగింజ! అని వినిపించింది. రామనాథం ఆశ్చర్యపోయారు. తన ఆశ్చర్యాన్నంతా లోలోపలే దాచుకొని, మెల్లగా రాళ్ళను తొలగించడం ప్రారంభించారు. కాసేపటికల్లా ఓ చిన్నరాతికున్న పల్లంలో ఓ పచ్చని జొన్నగింజ కనిపించింది.


''మీకు నేనెలా కృతజ్ఞతలు చెప్పాలో కూడా తెలీడంలేదు. వారూ వీరూ మీ గురించి చెబుతుంటే అయి వుండవచ్చు అనుకొన్నానుగానీ, మరీ మీరింత మంచి వారనుకోలేదు'' అన్నది జొన్నగింజ. రామనాథం ఆ జొన్నగింజను అరచేతిలో ఉంచుకొని పరిశీలనగా చూశారు.

''పాపం! చాలా కాలంగా, ఆ రాళ్ళ మధ్యపడి ఉన్నావేమో బాగా భయపడి ఉంటావు. భగవంతుడు దయామయుడు. ఆపదలో ఉన్న నీవంటి వారికి సహాయపడే అవకాశాన్ని నాకిచ్చాడు'' అన్నారు రామనాథం!

ఆ జొన్నగింజ తల అడ్డంగా తిప్పింది. 'ఆగ' మన్నట్టు సైగ కూడా చేసింది. ''బాబుగారూ, మీరు మరోలాగా అనుకోకండి! నేను మిమ్మల్ని పిలిచింది భయంవల్ల కాదు. నన్ను ఆదుకొంటారనీ కాదు. నేను ఆరుబయట ఉన్నాననుకోండి ఏ పక్షికో, ఏ చీమకో ఆహారంగా ఉపయోగపడతాను.

భూమిలో తల దాచుకొన్నాననుకోండి; నీకు వంద రెట్లకు మించిన ప్రతిఫలాన్ని ఇవ్వగలుగుతాను. అటూ ఇటూ ఎటూ గాకుండా, నా బతుకు వృధా అయిపోతున్నదన్న విచారంతో మిమ్మల్ని పిలిచాను గానీ, ప్రాణ భయంతో కాదండీ'' అన్నదా జొన్నగింజ!

రామనాథం నిర్విణ్ణుడయ్యాడు.



## I. వినండి-సంభాషించండి:

1. రామనాథంగారు ఎక్కడ నివసించేవారు ?
2. రామనాథంగారు ఎలా సహాయం చేసేవారు ?
3. నడుస్తు వెళ్తున్న రామనాథంగారు ఎందుకు ఆగిపోయారు?
4. జొన్నగింజ ఎక్కడ కనిపించింది?

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### పదజాలాన్నిపెంపొందించుకొందాం.

ధోరణి = పద్ధతి; వేకువ జామున = తెల్లవారు జామున; ఆదుకొనుట = సహాయపడుట, రక్షించుట; పల్లం = వాలు, గుంట; నిర్విణ్ణుడగుట = నిశ్చేష్టుడగుట.



## III. కృత్యం

**పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి సూచనానుసారం కృత్యాలు రాయండి.**

**అ. అల్లిక**

రామనాథంగారి అలవాట్లు

| | | | |
|---|---|---|---|
| | | | |

పరిచ్ఛేదం: పుట సంఖ్య: 60.. లోని "రామనాథంగారు చాలా మందికి చాలా రకాలుగా.... మాను కూడా వంగి నమస్కారం చేస్తాయని చెబుతారు". వరకు

**ఆ. సరియైన క్రమంలో అమర్చి రాయండి.**

1. ఆయన అలవాట్లు కూడా కొంచెం ప్రత్యేకంగా ఉంటాయి.
2. ఆయన్ని చూసి, మానులు కూడ వంగి నమస్కారం చేస్తాయని చెబుతారు.
3. రామనాథంగారు చాలా మందికి చాలా రకాలుగా సాయం చేశారు.
4. చిన్న చిన్న మొక్కలకు పాదులు చేస్తారు

**ఇ. కింది పదాల వాచకములు గుర్తించండి.**

1. ఆయన = ______ 2. మొక్కలు = ______

**ఈ. స్వీయ స్పందన:**

రామనాథం గురించి మీ అభిప్రాయాన్ని సొంత మాటల్లో రాయండి.

## IV. వినండి-చర్చించండి-రాయండి.

**అ. జవాబులు రాయండి.**

1. రామనాథంగారు డబ్బు సంపాదించిన విధం.
2. రామనాథంగారి అలవాట్లు
3. జొన్న గింజ, రామనాథంగారి మధ్య జరిగిన సంభాషణ.

**ఆ. ఎవరు ఎవరితో పలికిరి.**

1. కాస్త గొంతు పెంచి పిలిచాను.
2. "అయితే మీరలానే అక్కడే ఉండండి."
3. "ఇంతసేపు అడగనందుకు నన్ను మన్నించండి."

**ఇ. జతపరచండి.**

| 'క' వర్గం | 'చ' వర్గము |
|---|---|
| 1. ఏమాత్రం వత్తిడి తగిలినా | అ. ఓ పచ్చని జొన్న గింజ కనిపించింది |
| 2. అట్టడుగున ఉన్న కారణంగా | ఆ. పిండి పిండయి పోతాను |
| 3. నా బ్రతుకు వృధా అయిపోతుందన్న | ఇ. మిమ్మల్ని చూడ లేక పోతున్నాను. |
| 4. ఓ చిన్న రాతి కున్న పల్లంలో | ఈ. విచారంతో మిమ్మల్ని పిలిచాను |

**V.** **స్వీయ వ్యక్తీకరణ**

1. 'పరులసేవే పరమ ధర్మం' – మీ సొంత మాటల్లో రాయండి.
2. జొన్న గింజ రామనాథమునకు జరిగిన సంభాషణను మీ సొంత మాటల్లో రాయండి.

**VI.** **భాషావగాహన :**

**అ.** **కింద ఇవ్వబడిన వాక్యాలలోని కాలాలను గుర్తించండి.**

1. నీకు వందరెట్లకు మించిన ప్రతిఫలాన్ని ఇవ్వగలుగుతాను.
2. రామనాథంగారు దాచిన మొత్తం పెరిగి పెరిగి ధనవంతుణ్ణి చేసింది.
3. రామనాథంగారు తలవంచుకుని నడుస్తున్నారు.

**ఆ.** **వాక్యాంగాలను గుర్తించి రాయండి.**

1. జొన్నగింజ రామనాథంను వేడుకుంది.
2. రామనాథం జొన్నగింజను పరిశీలనగా చూశాడు.
3. డా॥ భరద్వాజను ప్రభుత్వం సత్కరించింది.

**ఇ.** **కింది వాక్యాలలో సామాన్య/సంయుక్త వాక్యాలను గుర్తించండి.**

1. రామనాథంగారు కళ్ళులేని వారికి, పసిపిల్లలకు తోడుగా ఉండి నడిపిస్తారు.
2. రామనాథంగారు స్నానాదికాలు పూర్తి చేస్తారు.
3. ఏ పక్షికో, ఏ చీమకో ఆహారంగా ఉపయోగపడతాను.

**ఈ.** **సంధిచేసి రాయండి.**

1. ఇంక + ఒకరికి 2. ముందుకు + ఏసిన 3. మీరు + ఎవరో 4. నాకు + ఇచ్చాడు.

**ఉ.** **కింది పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించి రాయండి.**

1. కష్టపడి 2. బలహీనంగా 3. కృతజ్ఞతలు 4. ఎడాపెడా

**VII.** **సృజనాత్మకత.**

1. మీ పరిసర ప్రదేశాలలోని (రామనాథం లాంటి వారిని) ఇతరులకు సహాయపడే వారి గురించి రాయండి.
2. మదర్ థెరిస్సా, డొక్కా సీతమ్మ గార్ల గురించి అంతర్జాలం ద్వారా తెలుసుకోండి.

**VIII.** **లేఖన నైపుణ్యాలు: కథాలేఖనం**

కింది అంశాల ఆధారంగా కథను పొడిగించి కుదురైన చక్కని చేతివ్రాతతో రాయండి.

నక్క – కొంగ | విందుకు ఆహ్వానించుట | పళ్ళెంలో పాయసం | నిరాశ | కొంగ – నక్క | విందుకు పిలుచుట | కూజాలో పాయసం | నిరాశ | దెబ్బకు దెబ్బ



నేనిది నేర్చుకున్నా.

'పరుల సేవే పరమధర్మం'.

9JH1SB

## వ్యాకరణము

**భాషాభాగాలు :**

1. నామ వాచకము, 2. సర్వనామము, 3. విశేషణము, 4. క్రియ, 5. అవ్యయము.

ఈ ఐదింటిని భాషాభాగములు అంటారు.

**నామవాచకము :** పేర్లను తెలియజేయునది.

**ఉదా.:** కమల

**సర్వనామము:** నామవాచకమునకు, బదులుగా వాడబడునది.

**ఉదా.:** అతడు, ఆమె, వాడు

**విశేషణము :** నామవాచకములోని విశేష విషయమును (రంగు, స్వభావము, గుణము) తెలియజేయునది.

**ఉదా.:** తెల్లని గుఱ్ఱము.

**క్రియ :** పనిని తెలియజేయునది.

**ఉదా.:** చదువుచున్నాడు

**అవ్యయము :** లింగ, వచన, విభక్తులు లేని పదములు.

**ఉదా.:** ఆహా! ఔరా! అక్కటా!

**వాక్యరకములు :**

**సామాన్యవాక్యము :** ఒకే సమాపక క్రియ కలిగినవాక్యము.

**ఉదా.:** రఘు బడికి వెళ్ళెను.

**సంయుక్త వాక్యము :** రెండు లేక అంతకంటే ఎక్కువ వాక్యములు కలిసి ఏక వాక్యముగా ఏర్పడుట.

**ఉదా:** శాంతి బాగా చదివింది అందువలన మంచి మార్కులు పొందినది.

**విభక్తి ప్రత్యయాలు:**

1. ప్రథమా విభక్తి – డు, ము, వు, లు
2. ద్వితీయా విభక్తి – నిన్, నున్, లన్, కూర్చి, గుఱించి
3. తృతీయావిభక్తి – చేతన్, చేన్, తోడన్, తోన్
4. చతుర్థీ విభక్తి – కొఱకున్, కై
5. పంచమీ విభక్తి – వలనన్, కంటెన్, పట్టి
6. షష్ఠీ విభక్తి – కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్
7. సప్తమీ విభక్తి – అందున్, నన్
8. సంబోధన ప్రథమా విభక్తి – ఓ, ఓయి, ఓరి, ఓసి

**వాక్యాంగములు :** కర్త, కర్మ, క్రియ అనునవి వాక్యాంగములు,

**కర్త** – పనిచేయువాడు. నేను పూలను కోశాను.

**కర్మ** – ఫలితము పొందువాడు – ఎవరిని, దేనిని అని ప్రశ్నించగా వచ్చు సమాధానము కర్మ.

**ఉదా:** వాడు పాట పాడెను.

**క్రియ** – పనిని తెలుపునది.

**ఉదా:** అతడు వ్రాయుచున్నాడు.

**వచనము :** వచనములు రెండు.

1. ఏకవచనము, 2. బహువచనము.

**ఏకవచనము :** ఒకే వస్తువును తెలియజేయు పదములు

**ఉదా:** కుర్చీ, పక్షి, స్త్రీ

**బహువచనము :** ఒకటి కంటే ఎక్కువ వస్తువులను తెలియజేయు పదములు.

**ఉదా:** కుర్చీలు, పక్షులు, స్త్రీలు

**కాలములు :** కాలములు నాలుగు

1. భూతకాలము, 2. వర్తమాన కాలము, 3. భవిష్యత్కాలము, 4. తద్ధర్మకాలము

**భూతకాలము :** జరిగిపోయిన విషయములను తెలియజేయునది.

**ఉదా:** శాంత పాఠశాలకు వచ్చెను.

**వర్తమానకాలము :** జరుగుచున్న విషయములను తెలియజేయునది.

**ఉదా:** జమున పాఠము చదువుచున్నది.

**భవిష్యత్కాలము :** జరుగబోవు విషయములను తెలియజేయునది.

**ఉదా:** కరుణ పాట పాడబోవుచున్నది.

**తద్ధర్మకాలము :** ఎప్పుడూ జరిగే పనులను గురించి తెలియజేయునది.

**ఉదా:** సూర్యుడు ఉదయించును గాలి వీచును

**వాచకము (లింగము):** వాచకములు మూడు

1. మహద్వాచకము, 2. మహతీవాచకము, 3. అమహద్వాచము

**మహద్వాచకము :** పురుషులను తెలియజేయు పదాలు

**ఉదా :** వాడు, అతడు, రాముడు

**మహతీవాచకము :** స్త్రీలను తెలియజేయు పదాలు

**ఉదా.:** ఆమె, రాధ, పాప

**అమహద్వాచకము:** జడ వాచకములను తెలియజేయు పదాలు

**ఉదా.:** పుస్తకము, నల్లబల్ల

# లేఖన కౌశల్యాలు

## 1. లేఖా రచన

లేఖారచన ఒక కళ. మన మనస్సులోని భావాలు ఆలోచనలు ఇతరులకు తెలుపడానికి లేఖ ఒక ఉత్తమ సాధనం. లేఖారచనకు సాంకేతిక పద్ధతినుపయోగించడం కాలానుగుణ అవసరం. రాబోవు తరగతులో మీరు 'ఈ-మెయిల్' (ఎలక్ట్రానిక్ మెయిల్) పంపేవిధానం అవగతం చేసుకోవలసి ఉంటుంది. అందువలన ఈ సంవత్సరం మనం 'లేఖ'ల నమూనాలు నూతన సాంకేతికతానుసారం మెయిల్ పంపే పద్ధతిననుసరించి తెలుసుకోబోతున్నాం.

**లేఖ**

| అనధికార లేఖ | అధికార లేఖ |
|---|---|
| ● కుటుంబంలోని వ్యక్తులు, అత్యంత సన్నిహితులైన వ్యక్తులకు రాయు లేఖలు. | ● మనవి, విన్నపం మొదలగు కార్యాలయ/వృత్తి సంబంధ లేఖలు. |
| ● బంధుత్వాన్ని బట్టి/సగౌరవంగా వ్యక్తులను సంబోధించాలి. | ● గౌరవసంబోధన తర్వాత వ్యక్తి యొక్క హోదాను పేర్కొనవలెను. |
| ● వ్యక్తుల క్షేమ సమాచారాలు అడగాలి. | ● లేఖలోని ముఖ్య విషయాన్ని 'విషయం' (Subject) అను ప్రత్యేక శీర్షికలో రాయాలి. |
| ● ఆలోచనలు ప్రభావవంతమైన పదాలతో వ్యక్తపరచాలి. | ● ప్రామాణికమైన భాషలో ముఖ్య ఉద్దేశ్యమును సూటిగా సంక్షిప్తంగా వ్యక్తపరచాలి. |
| ● అనధికార లేఖలో **'విషయం'** రాయవలసిన అవసరం లేదు. | ● లేఖలో చివరన లేఖను రాసేవారి చిరునామా తప్పక రాయాలి. |
| ● లేఖలో చివరన లేఖను రాసేవారి చిరునామా రాయడం తప్పనిసరి. | ● పై అంశాలన్నీ **'లేఖ – స్వరూపం'**లో చూపిన విధంగా ఎడమవైపు సమరేఖలో ఉంచాలి. |
| ● పై అంశాలన్నీ **'లేఖ – స్వరూపం'**లో చూపినవిధంగా ఎడమవైపు సమరేఖలో ఉంచాలి. | |

**లేఖ – స్వరూపం**

| అనధికార లేఖ | అధికార లేఖ |
|---|---|
| తేది ..................... | తేది ..................... |
| లేఖ ఎవరికి రాస్తున్నామో వారి పేరు | వ్యక్తి/సంస్థ పేరు, |
| చిరునామా .......................... | చిరునామా .......................... |
| ..................................... | ..................................... |
| | విషయం: |
| గౌరవనీయులైన/పూజ్యులైన/ప్రియమైన | గౌరవనీయులైన/శ్రీ/శ్రీమతి |
| ముఖ్య సమాచారం | ముఖ్య సమాచారం |
| ఇట్లు ........................ | ఇట్లు ........................ |
| మీ ..................... | మీ ..................... |
| చిరునామా .......................... | చిరునామా .......................... |
| ................................... | ................................... |
| (లేఖ పంపువారి చిరునామా) | (లేఖ పంపువారి చిరునామా) |

గమనిక : అనధికార లేఖలో 'విషయం' రాయవలసిన అవసరం లేదు

అభ్యాసం :

**కింది అంశాల ఆధారంగా అధికార, అనధికార లేఖలు రాయండి.**

విషయం : స్వచ్ఛ భారత్ కార్యక్రమం

మునిసిపల్ కమీషనర్, బృహన్ ముంబయి
మహానగరపాలిక ముఖ్య కార్యాలయం – ముంబయి

తేది : 02 – 10 – 2018
సమయం : ఉదయం 10 గంటలు
స్థలం : ఛత్రపతి శివాజీ పార్క్, దాదర్.

- కార్యక్రమంలో పాల్గొనుటకు విద్యార్థి నాయకునిగాఅనుమతి కోరుతూ లేఖ
- కార్యక్రమంలో పాల్గొన్న స్నేహితుని అభినందిస్తూ లేఖ

## 2. కథా రచన

కథలు వినడం, చెప్పడం ఆబాలగోపాలానికి సంతోషం కలిగించే విషయం. **'కథయతి ఇతి కథా!'** అనగా చెప్పబడునది కథ. ఊహాశక్తితో, సృజనశీలతతో కథలు సృష్టించబడుతాయి. కథలోని కథావస్తువు ఆ కథకు ప్రాణము వంటిది. కథావస్తువు యొక్క విషయాన్ని పాత్రలు, సంఘటనలు, ఆలోచనలతో విస్తరించడమే కథారచన కౌశల్యం. ఈ లేఖన కౌశల్యాన్ని అభివృద్ధి పరచడం ఈ **'కథా రచన'** అంశం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

ఉత్తమ కథాలేఖనానికై కింది అంశాలను గుర్తుంచుకోవాలి.

1) కథకు తగిన శీర్షిక పెట్టండి.
2) శీర్షికను బట్టి కథ యొక్క విషయం (కథావస్తువు) తెలియాలి.
3) కథను భూతకాలంలో రాయాలి. విద్యార్థులు తమ స్వంత కల్పనా శక్తితో రచించే స్వాతంత్ర్యం తీసుకోవచ్చు.
4) కథావస్తువు ననుసరించి పాత్రలు, వారి సంభాషణలు, పాత్రలకు తగిన భాషను ఉపయోగించాలి.
5) కథా ప్రారంభం మరియు ముగింపులకు మధ్య తగిన సంబంధం ఉండటం చాలా అవసరం.

**కథారచన మూల్యాంకనానికి నిర్ణయించిన కృత్యాలు.**

**1) కథావస్తువును బట్టి కథాలేఖనం. 2) శీర్షికను బట్టి కథాలేఖనం 3) అంశాలను బట్టి కథాలేఖనం.**

అభ్యాసం :

**కింది అంశాల ఆధారంగా కథను రాయండి**

సింహం యొక్క వేట → జంతువుల ఒప్పందం → కుందేలు వంతు → కుందేటి తెలివి → బావిలో ప్రతిబింబం → సింహం కోపంతో దూకటం → జంతువుల హర్షం.

## 3. ప్రకటన లేఖనం

నేటి పోటీ ప్రపంచంలో **'ప్రకటనలు'** అత్యంత ముఖ్యమైన అంశం. ఏదేని వస్తువు ఉత్పత్తి యొక్క ప్రకటన తయారు చేయడం అత్యంత సృజనాత్మకమైన కళ. దానిలో నైపుణ్యాన్ని సంపాదించడం ఈ వృత్తిలో విజయానికి అతి ముఖ్యమైన అంశము.

ప్రజల మనస్సులలో ఉత్పాదన వస్తువుల పట్ల ఇష్టాన్ని కలుగజేయడం, దాని వైపు ప్రజల దృష్టినాకర్షిచడం ప్రకటన యొక్క ముఖ్య ఉద్దేశం.

- **ప్రకటన తయారుచేస్తున్నపుడు కింది ముఖ్యమైన అంశాలను దృష్టియందుంచుకోవాలి.**

1) 'అతి తక్కువ పదాలతో అత్యధిక భావ వ్యక్తీకరణ' .... ఇది ఉత్తమ ప్రకటన సూత్రం.

2) ప్రకటన వైపు దృష్టినాకర్షించునట్లుగా, ఆసక్తికరమైన పదాలతో రచన ఉండాలి.

3) ప్రకటన దేనికి సంబంధించినదో దానిని స్పష్టంగా మరియు ఆకర్షణీయంగా తెలియజేయాలి.

4) సతతము మారునట్టి వినియోగదారుల ఇష్టాలు, అలవాట్లు, ఫ్యాషన్ దృష్టిలో నుంచుకోవడం అవసరం. ప్రకటనలో ఇవి ప్రతిబింబించాలి.

5) ప్రకటనలో సంప్రదించవలసిన స్థలం, చిరునామా, దూరధ్వని, మొబైల్‌నంబర్, ఈ-మెయిల్ ఐడి స్పష్టంగా పేర్కొనటం అవసరం.

**ప్రకటన లేఖన మూల్యాంకన కృత్యాలు.**

1. ఇచ్చిన పదాలను బట్టి ప్రకటన రాయడం.
2. ఇచ్చిన ప్రకటనపై కృత్యాన్ని సాధించడం.
3. ఇచ్చిన విషయంపై ప్రకటన తయారు చేయటం
4. ఇచ్చిన ప్రకటనను అధిక ఆకర్షణీయమైన పద్ధతిలో పునర్లేఖనం చేయటం.

**అభ్యాసం :**

**1. అంశాల ఆధారంగా మీ పాఠశాల 'హస్తకళా ఉత్పత్తుల' ప్రదర్శన అమ్మకాల ప్రటకనను తయారుచేయండి.**

| విద్యార్థుల హస్తకళా ఉత్పత్తులు | భవ్య ప్రదర్శన | స్థలము | తేది | సమయం | దూరధ్వని సంఖ్య | ఈ-మెయిల్ |
|---|---|---|---|---|---|---|

**2. కింది ప్రకటనను చదివి అడిగినవిధంగా కృత్యాలు చేయండి.**

మంచితరుణం - మంచినదొరకదు!!!

**డా|| ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా**




విద్యార్థులకు ఉపయుక్తమైన
కొత్త మరియు పాత పుస్తకాల

**భవ్య ప్రదర్శన**



**తేది: 15-10-2018. స్థలం: మునిసిపల్ స్కూల్ గ్రౌండ్, నాందేడ్. సమయం: ఉ|| 10.00 నుం సా|| 5.30 వరకు**

1) ఈ ప్రకటన ఏ విషయంపై తయారుచేయబడింది.

2) ప్రదర్శన ఏ సందర్భంగా ఏర్పాటు చేయబడినది.

3) ప్రదర్శన ఎప్పుడు, ఎక్కడ, ఏర్పాటు చేయబడినది.

4) ప్రదర్శన సమయం ఏమిటి?

5) ప్రదర్శనలో ఏవేవి ప్రదర్శింపబడతాయి.

# 4. గద్య అవగాహన

ప్రశ్నలు తయారు చేయగల్గడం అత్యంత ముఖ్యమైన భాషాకౌశల్యం. ఈ కౌశల్యాన్ని పొందడానికి 'గద్య అవగాహన' అనే అంశాన్ని పాఠ్యప్రణాళికలో చేర్చడం జరిగింది. ఇచ్చిన పరిచ్ఛేదాన్ని/గద్యాన్ని చదివి దాని ఆధారంగా ఐదు ప్రశ్నలను తయారు చేయాలి. ఈ అయిదు ప్రశ్నలు ఒక్కొక్క వాక్యంలో సమాధానం వచ్చునట్లుగా ఉండాలి.

**ప్రశ్నల స్వరూపం :**

1) తయారుచేసిన ప్రశ్నలు, ప్రశ్నల రూపంలో అర్థవంతంగా ఉండాలి.
2) ఎవరు? ఎక్కడ? ఎప్పుడు? ఎందుకు? ఇలాంటి రకమైన ప్రశ్నలు తయారు చేయుటను అభ్యసించాలి.
3) ఏ ప్రశ్నల సమాధానాలు పరిచ్ఛేదంలో ఉంటాయో, అలాంటి ప్రశ్నలే తయారుచేయాలి.
4) ప్రశ్నలకు సమాధానాలు రాయవద్దు.
5) ప్రశ్న చివర 'ప్రశ్న గుర్తు' ఇవ్వడం (అవసరమైన చోట్ల) చాలా అవసరం.

**కింది పరిచ్ఛేదాన్ని జాగ్రత్తగా చదివి ఐదు ప్రశ్నలు తయారు చేయండి.**

వ్యాయామం అనగానే మనకు వ్యాయామశాలలు గుర్తుకువస్తాయి. కాని వ్యాయామశాలలకు వెళ్ళకుండా కూడా మనం అనేక పద్ధతులలో వ్యాయామం చేయవచ్చు. నడవటం, జాగింగ్ చేయటం, సైకిలు త్రొక్కటం... ఇవన్నీ వ్యాయామ పద్ధతులే. నడవటం, జాగింగ్ చేయటం వలన కాలికండరాలు బలిష్ఠంగా తయారవుతాయి. రక్తప్రసరణ బాగా జరుగుతుంది. సైకిలు త్రొక్కడం వలన కాలి కండరాలు, వీపు, భుజపు కండరాలు దృఢపడతాయి. ఇవి అందరికి అందుబాటులో ఉన్న వ్యాయా పద్ధతులు.

ఇవి కాకుండా బాల బాలికలు వ్యాయామశాలలకు కూడా వెళ్ళినచో మరికొన్ని వ్యాయామ పద్ధతులను నేర్చుకొనవచ్చును. వ్యాయామ పద్ధతులను నేర్పు స్థలములను 'వ్యాయామశాలలు' అంటారు. వీటినే 'తాలింఖానాలు' అని కూడా అంటారు. చిన్నపిల్లలు మొదలుకొని పెద్దలవరకూ అందరూ అక్కడకు వెళ్ళి వ్యాయామ పద్ధతులను నేర్చుకోవచ్చును. ప్రతిరోజు వ్యాయామముచేసిన కండరాలు బాగా దృఢపడతాయి. నరములలో పటుత్వము ఏర్పడుతుంది. వ్యాయామము చేయునపుడు వేళప్రకారం తప్పనిసరిగా బలాన్ని ఇచ్చే ఆహారాన్ని పాలు, పండ్లు, ఆకుకూరలు మొదలైన వాటిని తప్పనిసరిగా తీసుకోవలెను.



**ప్రశ్నలు :**

1) ____________________

2) ____________________

3) ____________________

4) ____________________

5) ____________________

# 5. వ్యాసరచన

వ్యాసం అనగా ఏదేని విషయానికి అనుగుణంగా మన ఆలోచనలను అంశాల వారిగా కూర్చడం. సూక్ష్మంగా ఆలోచించుట, పరిశీలనానశక్తి, సృజనశీలతలాంటి సామర్థ్యాల అభివృద్ధియే ఈ వ్యాసరచన అంశం వెనుక గల ఉద్దేశం. ఈ సంవత్సరం మీరు కృత్యపత్రికకై 1. వర్ణనాత్మకం 2. ఆత్మకథ – వ్యాసరచన రకాలను అభ్యసించబోతున్నారు.

**వ్యాసరచన నియమాలు :**

1) వ్యాసరచనను విషయానికి తగినట్లు, సందర్భోచితంగా ప్రారంభించాలి.
2) తగిన సామెతలు, లోకోక్తులతో, ఆకర్షణీయంగా, ఆసక్తికరంగా రాయాలి.
3) వ్యాసం యొక్క రెండవ పరిచ్ఛేదంలో భాషాకౌశల్యాన్ని ఉపయోగించి ప్రభావవంతంగా విషయాన్ని విస్తరించి రాయాలి.
4) వ్యాసం యొక్క ముగింపు పాఠకుని (చదువువారిని) విషయానికి అనుగుణమైన ఆలోచనలవైపు తీసుకెళ్ళునట్లుగా ఉండాలి.

**1. వర్ణనాత్మక వ్యాసం:**

మనం ఏదైనా కార్యక్రమంలో, సంఘటనలో పాల్గొన్నట్లుగా ఊహించి, ఆకార్యక్రమం/సంఘటన యొక్క అనుభవాలను మనోరంజకముగా, వర్ణనాత్మకంగా, ప్రభావవంతంగా రాయడం ముఖ్యం.

**అభ్యాసం :**

కింది అంశాల ఆధారంగా **'సింహగడ్'** కోట విశేషాలను వర్ణిస్తూ వ్యాసం రాయండి.

| | | |
|---|---|---|
| స్థలం | కోట వర్ణన | చరిత్ర |
| ప్రస్తుత పరిస్థితి – నిర్వహణ | నీకు కలిగిన అనుభూతి | ముగింపు |



**2. ఆత్మకథ వ్యాసం :**

1) ఆత్మకథ వ్రాయటం అనునది ఒకరకంగా పరకాయ ప్రవేశం
2) ఇతరుల సుఖ దుఃఖాలను గూర్చి ఆలోచించడం, వారిమనసును అర్థం చేసుకోవడం.
3) సజీవుల/వస్తువుల భావనలను ఊహించి వ్యక్తపరచటం.
4) ఆ ప్రాణి/వస్తువు ఉన్న స్థానంలో మనమున్నట్లుగా ఊహించుకొని పదబంధం చేయడం ఆత్మకథారచనలోని మర్మం.
5) ఆత్మకథ రచన **ఉత్తమ పురుషలో, ఏకవచనంలో** ఉండాలి.
6) విషయాన్ని అనుసరించి తగిన ప్రస్తావన ప్రారంభం చేసి వ్యాసరచన ప్రారంభించాలి.

**అభ్యాసం :**

కింది అంశాల ఆధారంగా **'భ్రమణ ధ్వని'** (మొబైల్) ఆత్మకథను రాయండి.



| | | | |
|---|---|---|---|
| మొబైల్ జననం | దశల వారిగా అభివృద్ధి | లాభాలు | నష్టాలు |
| ముగింపు | భవిష్యత్తు | తీసుకోవలసిన జాగ్రత్తలు | |



# 1. స్వాతంత్ర్య పతాక

**పాఠంలోకి ప్రవేశించేముందు:**

పతాకానికి పర్యాయ పదాలు

పతాకం – ధ్వజము, టెక్కెము, బావుటా, జండా

- జండా అనేది ఒక తెగ/జాతి/సమూహం/దేశం మొదలగు వాటికి సంకేతం. జండా సాధారణంగా ఒక వస్త్రపుముక్క. ఇది దీర్ఘచతురస్రాకారం లేదా త్రికోణాకారంగా ఉంటుంది. సంకేత ఉపకరణంగా లేదా అలంకరణగా జండాను ఉపయోగిస్తారు. జండా గురించిన అధ్యయనాన్ని వెక్సిల్లోలజీ (Vexillology) అంటారు.
- ప్రతి దేశ జాతీయ పతాకం ఆ దేశ గౌరవ ప్రతిష్టలకు ప్రతీక.
- యుద్ధాల్లో గెలిచిన, ఒలింపిక్ ఆటల్లో విజయం సాధించిన, అతి ఎత్తైన పర్వత శిఖరం అధిరోహించిన, చంద్రమండలంలో అడుగు పెట్టినా అచ్చట ఆ దేశ పతాకం రెపరెపలాడుతుంది.

ఇప్పుడు భారతజాతీయ పతాకం యొక్క గొప్పదనాన్ని శ్రీ సుంకర సత్యనారాయణ గారు ఏమని వర్ణించారో చదువుదామా!

ఎగురవే వినువీధి ఎగురవే జండా
శాంతిదూతగ నేడు – జాతీయ జండా
యుగయుగంబుల జగతి నెగురవే జండా
సౌఖ్యప్రదాతగా స్వాతంత్ర జండా ॥ఎగు॥

భారతీయుల మహాపోరాట ఫలితమా
వీరయోధుల రక్తధారలకు చిహ్నమా
శాంతిదూత అశోకధర్మ చక్రము దాల్చి
శాంతినిల స్థాపించ నరుదెంచితివి నీవు ॥ఎగు॥

పెను తుఫానులనెన్ని పెనవేసుకున్న
కడ భారతీయుండు పడిపోవు దనుక
గగనాన ధృవతార కరణి నిల్చెదవు ॥ఎగు॥



**I. వినండి-సంభాషించండి.**

1. ఒక్కొక్క దేశానికి ఒక్కొక్క పతాకం ఎందుకు?
2. మన జాతీయ పతాక నిర్మాత ఎవరు?

**II. చదవండి-ఆలోచించండి-రాయండి.**

**అ. పదజాలం పెంపొందించుకుందాం.**

యుగయుగాలు = అనేక యుగముల వరకు; జగతి = ప్రపంచం; పెను తుఫాను = పెద్ద తుఫాను; అరుదెంచితివి = వచ్చితివి; పెనవేసుకున్న = చుట్టు ముట్టిన, అల్లుకున్న; పడిపోవు దనుక = మరణించు వరకు; గగనాన = ఆకాశమున; ధృవతార = ధృవ నక్షత్రము; కరణి = విధముగా; నిల్చెదవు = ప్రకాశించెదవు.

**ఆ. భావాలు నేర్చుకుందాం.**

ఓ జాతీయ పతాకమా! నేడు శాంతిదూతవలె ఆకాశమనెడు వీధి యందు ఎగురుము. ఈ ప్రపంచమున సుఖముల నిచ్చుదానిగా యుగయుగముల వరకు ఎగురవలసినది. నీవు భారతీయుల స్వాతంత్ర్య పోరాటమునకు ఫలితము. వీర యోధుల త్యాగమునకు చిహ్నము. అశోక ధర్మచక్రమును ధరించి శాంతిని స్థాపించుటకు ఇచ్చటికి శాంతిదూతగా వచ్చితివి. ఎన్ని పెద్ద పెద్ద తుఫానులు వచ్చినను అనగా ఎన్ని యుద్ధములు వచ్చినను, చివరి భారతీయుడు పడిపోవు వరకు ఆకాశమున ధృవతార వలె చిరస్థాయిగా నిలిచి పోయెదవు.

**III. కృత్యము: కింది గేయఖండికలను చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.**



**అ. (i) కింద ఇచ్చిన పదాలలో తప్పొప్పులు గుర్తించండి.**

1. భారతీయుల స్వల్ప పోరాట ఫలితము ( )
2. అశాంతి నిలస్థాపించ నరుదెంచితివి నీవు ( )
3. వీర యోధుల శ్రమధారలకు చిహ్నమా ( )
4. గగనాన ధృవతార కరణి నిల్చెదవు ( )

**(ii) ఏ వాచకమో రాయండి.**

1. మాత
2. యోధుడు

భారతీయుల... నుండి గేయం చివరి వరకు (2, 3 గేయ ఖండికలు)

**ఆ. స్వీయ స్పందన:-**

గేయ ఖండికల్లోని సందేశాన్ని నీ సొంతమాటల్లో రాయి.

**IV. వినండి-చర్చించండి-రాయండి.**

**అ. జవాబులు రాయండి.**

1. యుగాలెన్ని? అవి ఏవి?
2. శాంతి దూత అని పేరు పొందినదెవరు?
3. జాతీయ పతాకంలోని అశోక ధర్మచక్రం విశిష్టత రాయండి.
4. 'ధృవ తార' - అని కవి ప్రయోగించడంలోని అంతరార్థం.

**ఆ. గేయపాదాలు జతపరచండి.**

| 'క' వర్గము | | 'చ' వర్గము | |
|---|---|---|---|
| 1. | యుగయుగంబుల | అ. | రక్తధారలకు చిహ్నమా |
| 2. | సౌఖ్య ప్రదాతగా | ఆ. | జగతినెగురవె జండా |
| 3. | భారతీయుల | ఇ. | స్వాతంత్ర్య జండా |
| 4. | వీర యోధుల | ఈ. | మహా పోరాట ఫలితమా |

**V. స్వీయవ్యక్తీకరణ**

1. స్వాతంత్ర్య పతాకమును ఏయే సందర్భాలలో ఎగురవేస్తారో మీ సొంత వాక్యాల్లో రాయండి.
2. నీవు నీ దేశభక్తిని ఎట్లు నిరూపించుకొనెదవో రాయుము.

## VI. భాషావగాహన.

**అ. కింది పదాలను సొంత వాక్యాల్లో ప్రయోగించండి.**

1. శాంతి దూత  2. యుగయుగాలు  3. స్థాపించు  4. అరుదెంచు

**ఆ. గీత గీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.**

1. శాంతినిల స్థాపించనరుదెంచితివి.  2. వీర యోధుల రక్తధారలకు చిహ్నమా.

**ఇ వ్యతిరేక పదాలు రాయండి.**

1. శాంతి X  2. అస్వతంత్రత X  3. ధర్మము X  4. మనుజులు X

**ఈ. నిఘంటువులో చూచి అర్థాలు రాయండి.**

1. పెనవేసికొను  2. చిహ్నము  3. తార  4. దాత
5. దూత  6. సౌఖ్యము  7. వినువీధి  8. జగతి

## VII. సృజనాత్మకత

1. వివిధ వార్తాపత్రికలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురించి వచ్చిన వార్తలను చదివి వాటి తారతమ్యతను పరిశీలించండి.
2. స్వాతంత్ర్య దినోత్సవమునాడు ప్రధానమంత్రి ఎఱ్ఱకోట నుండి ఇచ్చే ఉపన్యాసాన్ని దూరదర్శినిలో లేదా ఆకాశవాణిలో విని ముఖ్యాంశాలను నోట్‌బుక్‌లో రాయండి.

## VIII. లేఖన నైపుణ్యాలు: లేఖారచన –

విషయం : పఠన దినోత్సవ కార్యక్రమం సందర్భంగా పుస్తక ప్రదర్శన

సంచాలకులు, తెలుగు అకాడమీ,
హైదరాబాదు, తెలంగాణ.

తేది : 15.10 2018
సమయం : ఉ. 8.00 గం.. – సా. 6.00 గం..
స్థలం : మునిసిపల్ పాఠశాల మైదానం, అంబర్‌నాథ్, ఠాణే జిల్లా.

ప్రదర్శన కొరకు పుస్తకములు సమకూర్చవలసినదిగా అభ్యర్థిస్తూ లేఖ

కార్యక్రమానికి రావలసినదిగా కోరుతూ అమ్మమ్మ, తాతయ్యలకు ఆహ్వాన లేఖ



నేనివి నేర్చుకున్నా :
జాతీయ పతాకం విశిష్టత



# 2. పరివర్తన

**పాఠంలోకి ప్రవేశించే ముందు:**


- వృక్షోరక్షతి రక్షితః అనగా చెట్టును మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుంది అని అర్థం. చెట్టు విలువ తెలుసా?
- మానవాళి మనుగడకు అవసరమైన సంపదలలో వృక్షములు ముఖ్యమైనవి వృక్షరక్షణ ఆవశ్యకతను శ్రీ గండూరి లక్ష్మీనారాయణ గారు ఈ పాఠంలో ఎలా వర్ణించారో తెలుసుకుందాం.
- మానవాళి మనుగడకే తలమానికమైన ఇట్టి వృక్షం నేడు ఎలాంటి దుస్థితిలో ఉందో సానుభూతి హృదయంతో చూద్దామా!

---

ఏ నొక నాడరణ్యమున కేగితి కట్టెలు గొట్ట కూలికిన్
సానువులోన నున్న నొక సాలమునుం గని గొడ్డ లెత్తగా
హీన గళంబుచే నను మహీరుహ మడ్గగ సాగె నిట్లు, నే
నా నగ మాడు మాటలు కడబ్బుర పాటున నాలకించితిన్. 1

మలమల యెండ వేడిమికి మాడుచు నడ్చుచు పోవు వారికిన్
నిలబడి దారు లందునను నిత్యము చల్లని నీడ నిత్తుమే
విలువగు ప్రాణవాయువును పేర్మిని మీ కిడుచున్న మమ్ములన్
కలియుగ మానవా! తగదు ఖండన జేయకు కీడు నీకగున్. 2

తీయని పండ్లు కాయలతి తీయని మేలిమి తేనె తెట్టెలన్
కాయము గాయమైన వెనుకాడక నిత్తుము కోరినప్పుడున్
న్యాయము! చంప వచ్చితివి నష్టము కల్గును మీకె ధాత్రిపై
తోయము నిచ్చు మేఘములు తూలును వర్షము రాదు మానవా! 3



తరులే ప్రాణము నిల్పును
తరులే కురిపించు వాన ధారుణి పైనన్
తరులే వరమౌ నరులకు
తరియించుము మొక్కనాటి తప్పక మిత్రా! 4

హృదయ గుహాంతరాళమున వృక్షము పల్కిన సత్య వాక్కులున్
గదులుచునుండ గొడ్డలిని కంపిత హస్తమునుండి వీడి నే
సదమదమొందు చిత్తమున సాగితి నింటికి, నాటినుండియున్
గుదురుగ నాటి మొక్కలను గోముగ సాకుచు పెంచసాగితిన్. 5



## I. వినండి–సంభాషించండి.

1. మీకు తెలిసిన కొన్ని చెట్ల పేర్లు.
2. పరివర్తన అంటే ఏమిటి?
3. చెట్ల నుండి మనకు లభించే వాయువు ఏది?

## II. చదవండి–ఆలోచించండి–రాయండి.

### పదజాలం పెంపొందించుకుందాం–భావాలు నేర్చుకుందాం.

1. ఏగితి = వెళ్ళితి; సానువు = అడవి; సాలము = వృక్షము; గళము = గొంతు; మహీరుహము = చెట్టు/వృక్షము; నగము = వృక్షము; అబ్బురము = ఆశ్చర్యము

   నేను ఒకనాడు కట్టెలు కొట్టుటకై అరణ్యమునకు వెళ్ళితిని. అచ్చట ఒక వృక్షమును చూచి గొడ్డలిని ఎత్తగా అది నీరసించిన కంఠముతో నన్ను ఇట్లు అడగసాగెను. నేను ఆశ్చర్యపడుచు దాని మాటలు వినుచుంటిని.

2. పేర్మిని = ప్రేమతో; ఖండన = కొట్టి వేయుట; తగదు = మంచిదికాదు; కీడు = అపకారము/చెడు

   ఎండలకు మలమల మాడుచు దారులలో నడుచుచు పోవు వారికి మేము నిలిచి చల్లని నీడనిచ్చెదము. మీకు ప్రేమతో ప్రాణవాయువును (ఆక్సిజన్‌ను) అందించెదము. కావున మమ్ము నరుకుట తగదు. మీకు కీడు జరుగును.

3. మేలిమి = శ్రేష్ఠమైన; కాయము = శరీరము; తోయము = నీరు; ధాత్రి = భూమి.

   మా శరీరములు గాయమైనా మీరు కోరినపుడల్లా తీయని పండ్లు, కాయలు, మేలిమి తేనె తెట్టెలను వెనుకాడక ఇచ్చెదము. మమ్ములను చంపుటకై వచ్చుట న్యాయమా. మీకే నష్టము కలుగును. వర్షమునిచ్చు మేఘములు తొలగిపోవును. వర్షము కురియదు.

4. తరులు = చెట్లు, వృక్షములు; ధారుణి = భూమి; నరులు = మానవులు

   వృక్షములే ప్రాణములను నిలుపునవి. వృక్షములే భూమిపై వర్షమును కురిపించును. తరులే నరులకు వరము కావున మొక్కలను నాటుము.

5. కంపిత = వణుకుచున్న; హృదయ గుహా + అంతరాళమున = మనస్సు అనెడు గుహ మధ్య భాగములో; హస్తము = చెయ్యి; వాక్కు = మాట; గోముగ = ప్రేమతో

వృక్షము పలికిన వాక్కులు మనస్సున మెదలుచుండగా కంపించుచున్న చేతులతో గొడ్డలిని వదిలివేసితిని. నాటి నుండి కుదురుగ మొక్కలను నాటి, ప్రేమతో పెంచసాగితిని.



**III. కృత్యము: కింది పద్యాలను చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.**

**అ. (i) వరుసక్రమంలో రాయండి.**

1. తగదు ఖండన సేయకు
2. నిత్యము చల్లని నీడ నిత్తుము
3. హీనగళంబుచే నను మహీరుహ మడ్డగసాగె
4. ఏనొకనాడరణ్యమునకేగితి

**(ii) కింది పదాలను తగిన అర్థాలతో జతపరచండి.**

| 'క' వర్గము | 'చ' వర్గము |
|---|---|
| 1. పేర్మి | అ) చెట్టు |
| 2. సాలము | ఆ) శరీరము |
| | ఇ) ప్రేమ |

(1, 2 పద్యాలు)

**ఆ. స్వీయ స్పందన:-**

చెట్టు వలన ఏయే ఉపయోగాలున్నాయో మీ సొంత మాటల్లో వ్యక్తీకరించండి.

**IV. వినండి-చర్చించండి-రాయండి.**

**అ. జవాబు రాయండి.**

1. చెట్టు చల్లని నీడను ఎవరికి ఇచ్చును?
2. చెట్లకు గాయములైనా అవి మనకు ఏమి ఇస్తున్నాయి?
3. వృక్షము పలికిన మాటలు విన్న కవిలో వచ్చిన మార్పు ఏమి?

**ఆ. కింది ఖాళీలను సరియైన పదాలతో పూరించుము.**

(మేఘములు, సాలము, ప్రాణము, పేర్మిని)


1. సానువులోన నున్న నొక ______________ నుం గని
2. ప్రాణవాయువును ______________ మీ కిడుచున్న మమ్ములన్
3. తోయము నిచ్చు ______________ తూలును వర్షము రాదు
4. తరులే ______________ నిల్పును.

**ఇ. తప్పొప్పులను రాయండి.**

1. తగదు దండన జేయకు కీడు మీకగున్. ( )
2. విరులే కురిపించు వాన ధారుణి పైనన్. ( )
3. చంప వచ్చితివి నష్టము కల్గును మీకె. ( )

ఈ. కింది చిత్రం ఆధారంగా చెట్టు భాగాలు ఉపయోగాలు రాయండి.

చెట్టు | భాగాలు | ఉపయోగాలు



V. స్వీయ వ్యక్తీకరణ

1. కవి మరియు చెట్టు మధ్య జరిగిన సంభాషణను మీ సొంత మాటల్లో రాయండి.
2. 'తరులే నరులకు వరము' అని ఎలా చెప్పగలవో నీ సొంత వాక్యాల్లో రాయుము.

VI. భాషావగాహన.

అ. వచనము మార్చి రాయండి.

1. చెట్టు =
2. అరణ్యములు =
3. పండు =
4. గొడ్డలి =

ఆ. గీతగీసిన ప్రత్యయాలు ఏ విభక్తులో రాయండి.

1. అనగ మూడు మాటలు –
2. ప్రాణవాయువును పేర్మిని మీ కిడుచున్న –

ఇ. గీత గీసిన పదాలు ఏ భాషాభాగానికి చెందినవో రాయండి.

1. కట్టెలు గొట్ట కూలికిన్
2. నిత్యము చల్లని నీడ నిత్తుమే

ఈ. కింది పదాలకు పాఠ్యభాగంలోని సరియగు వ్యతిరేక పదాలను వెదికి రాయండి.


1. అన్యాయము x
2. లాభము x
3. శాపము x
4. అసత్యము x
5. మేలు x
6. చల్లని x

ఉ. కలిపి రాయండి.

1. మీకు + ఇడుచున్న =
2. గాయము + ఐన =
3. గుహా + అంతరాళము =
4. ముదము + ఒందు =

## VII. సృజనాత్మకత

1. వివిధ రకాల చెట్ల పేర్లను రాయండి.




2. "చెట్లు నిస్వార్థ జీవులు" వివరించండి.
3. వివిధ ఔషధ మొక్కల పేర్లను సేకరించి పట్టికను తయారుచేయండి.
4. మొక్క యొక్క విత్తనం నుండి వృక్షం యొక్క పెరుగుదల క్రమంను సూచించే చిత్రాలను గీయండి.

## VIII. లేఖన నైపుణ్యాలు: వ్యాస రచన (ఆత్మకథ)

కింది అంశాల ఆధారంగా **"వృక్షో రక్షతి రక్షితః"** అను విషయం మీద మీ పాఠశాలలో జరుగు వ్యాసరచన పోటీల్లో పాల్గొనుటకు చెట్టు ఆత్మకథ రాయండి. వ్యాసం తయారుచేయుము.

**అంశాలు:**

చెట్లు
↓
ఉపయోగాలు
↓
మనల్ని ఏ విధంగా రక్షిస్తాయి
↓
మనం వాటిని ఏ విధంగా కాపాడాలి

చెట్లు ప్రగతికి మెట్లు

**జట్టుపని:**

**సమాచార ప్రసార సాంకేతిక పరిజ్ఞానము (ICT):-**



- కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ల సహాయంతో సులభంగా స్లైడ్‌షో తయారు చేయవచ్చు.
- ఈ స్లైడ్ షోతో వీక్షకులను ఆకట్టుకొనే విధంగా ప్రజంటేషన్ చేయవచ్చు.
- శృతం కన్నా దృశ్యం మనస్సున బాగా నిలుస్తుంది. అందుకే పిక్చర్ 'స్పీక్స్ వాల్యూమ్స్' అంటారు. ఒక దాని తరువాత ఒకటిగా ఆకర్షణీయము, విషయానుగుణము అయిన స్లైడ్స్‌ను ప్రదర్శిస్తూ తగిన విధంగా వివరించడాన్ని విజువల్ ప్రజంటేషన్ అంటారు.


ఇప్పుడు మీరు మీ ఉపాధ్యాయులు మరియు పెద్దల సహాయంతో **"వృక్షాల ఆవశ్యకత"** గురించి చిత్రాలు, వీడియోలతో కూడిన ఒక చక్కని స్లైడ్‌షో ప్రజంటేషన్ తయారుచేయండి. దానిని మీ పాఠశాలలో మరియు పరిసరాలలో ప్రదర్శించండి. జనజాగృతిని కల్గించండి.



**నేనివి నేర్చుకున్నా:**

**వి.సూ:** వివిధ రకాల ఆకులను సేకరించి మీ నోటు పుస్తకాలలో అంటించండి.


95M2SH



# 3. విదుర నీతి

**నేపథ్యం:**

- కింది ఆకృతిని పూరించండి.




- నీతి – నీతి కథ అనగానేమి?

ఇప్పుడు ఈ పాఠంలో ఎవరు, ఎవరికి, ఎందుకు, ఏమని నీతిని బోధించారు. చదివి తెలుసుకుందామా!

క. ధనమును, విద్యయు, వంశం
బును దుర్మతులకు మదం బొనరించును; స
జ్జనులైన వారికడకువ
యును, వినయము నివియ తెచ్చునుర్వీనాథా! 1

క. కోపము, నుబ్బును, గర్వము
నాపోవక యునికి యును, దురభిమానము, ని
ర్వ్యాపారత్వము నను నివి
కాపురుష గుణంబులండ్రు కౌరవనాథా! 2


క. తను లోకము గొని యాడగ
విని యుబ్బడు సజ్జనుండు; వెండియు గడుమే
లొనరించు; గీడొకించుక
యును దనదెస దోప నీక యుడుపుచువచ్చున్ 3





క. తనువున విఱిగిన యలుగుల
ననువున బుచ్చంగ వచ్చు; నతినిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
వినుమెన్ని యుపాయములను వెడలునె? యధిపా! 4

క. పురుషుండు రెండు దెఱగుల
ధరనుత్తముడనగ బరుగు దానెయ్యెడలం
బరుషములు పలుక కునికిన్
దురితంబులు వొరయు పనులు దొఱగుట కతనన్ 5



## I. వినండి-సంభాషించండి.

1. సుభాషితములు అని వేనిని అంటారు?
2. విద్య వలన ఉపయోగాలేంటి?
3. విదురనీతి- దీనిని ఎవరు ఎవరికి చెప్పారు?

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### పదజాలాన్ని పెంపొందించుకుందాం-భావాలు నేర్చుకుందాం.

**1.** దుర్మతులు = చెడు బుద్ధి కలిగినవారు; మదము = గర్వము; అణకువ = వినయము
ఓ ధృతరాష్ట్రా! ధనము, విద్య, ఉత్తమ వంశమున జన్మించుట అన్నవి దుష్ట బుద్ధికలవారికి గర్వాన్ని కలిగిస్తాయి. అవే సజ్జనులకు వినయాన్ని, గౌరవాన్ని తెచ్చిపెడతాయి.

**2.** ఉబ్బు = పొంగిపోవు; ఆపోనక = అసంతృప్తి; నిర్వ్యాపారత్వము = ఏ పని చేయకపోవడం; కాపురుషులు = దుర్జనులు.
ఓ ధృతరాష్ట్రా! కోపము, పొగడ్తలకు పొంగిపోవటము, గర్వము, అసంతృప్తి, దురభిమానం, ఏ పని చేయకపోవడం అను ఆరు దుర్జనుని లక్షణాలు.

**3.** కొనియాడుట = పొగడుట; ఉబ్బుట = సంతోషించుట; వెండియు = అంతేకాక; ఒనరించు = చేయు; ఒకించుక = కొంచెము కూడా
సజ్జనుడు తనను ఇతరులు పొగిడినట్లైన విని పొంగిపోడు, ఇంకా ఎంతో మేలు చేస్తాడు. తన వైపు నుండి ఇతరులకు, ఎటువంటి కీడు కలుగకుండా ప్రవర్తిస్తాడు.

**4.** తనువు = శరీరము; అలుగు = బాణము; అనువున = ఉపాయంతో; నిష్ఠురతన్ = కఠినమైన; మనమున = మనస్సున
ధృతరాష్ట్ర మహారాజా ! శరీరంలో గుచ్చుకున్న బాణాలను ఉపాయంతో తీసివేయవచ్చు. కాని మనస్సులో గట్టిగా నాటుకున్న నిష్ఠురమైన మాటలను ఎన్ని ఉపాయాలచేతనైనా తొలగింపజాలము.

**5.** పరుషము = కఠినము; దురితంబులు = చెడు కార్యములు
ఎక్కడా కఠినముగా మాట్లాడకుండా వుండటం, చెడు కార్యములు చేయకపోవడం, ఈ రెండింటి వల్ల లోకంలో మానవుడు ఉత్తముడనిపించుకొనును.

**III. కృత్యం:**

**కింది పద్యాలను చదివి సూచనానుసారం కృత్యాలను చేయండి:**



అ. **(i) కింది వాక్యాలను ఎవరు ఎవరితో అనిరి.**

1. తనువున విఱిగిన యలుగుల ననువున బుచ్చంగవచ్చు.
2. దురితంబులు వొరయు పనులు దొఱఁగుట కతనన్.

**(ii). వ్యతిరేక పదాలు రాయండి.**

1. ఉపాయము x ______ 2. ఉత్తముడు x ______

పాఠ్యభాగంలోని 4, 5 పద్యాలు

ఆ. స్వీయ స్పందన

ఈ పద్యాల కావ్య సౌందర్యాన్ని మీ సొంత మాటల్లో రాయండి.

**IV. వినండి-చర్చించండి-రాయండి.**

అ.
1. దుష్టులకు గర్వాన్ని కలిగించేవి ఏవి? 2. దుర్జనుని లక్షణాలేవి?
3. సజ్జనుడు ఎలా ప్రవర్తిస్తాడు? 4. మాటలకున్న శక్తి ఎట్టిది?

ఆ. **తగిన పదాలతో ఖాళీలను పూరించుము.**

1. సజ్జనులైన వారికడకువయును ______________ ఇవియు తెచ్చు.
2. లోకము కొనియాడగ విని ______________ సజ్జనుండు.
3. మనమున నాటిన మాటలు వినుమెన్ని ______________ వెడలునె.

ఇ. **తప్పొప్పులను గుర్తించి రాయండి.**

1. దుర్జనులైన వారి కడకువయును, వినయమునివియు తెచ్చు. ( )
2. మేలొకించుకయును దన దెన దోపనీక యుడువుచువచ్చున్. ( )
3. మనమున నాటిన మాటలు వినుమెన్ని యుపాయములను వెడలునే. ( )

**V. స్వీయ వ్యక్తీకరణ**

1. 'సత్పురుషుల' లక్షణాలను సొంత వాక్యాల్లో రాయండి.
2. మానవుడెట్లు ఉత్తముడనిపించుకొనునో నీ సొంత మాటల్లో రాయుము.

**VI. భాషావగాహన**

అ. **పదాలను కలిపి రాయండి.**

1. సజ్జనులు + ఐన 2. ఒక + ఇంచుక 3. వినుము + ఎన్ని 4. మేలు + ఒనరించు

ఆ. **ప్రకృతి-వికృతులు రాయండి.**

1. విద్య ______ 2. దెస ______ 3. గుణము ______

**VII. సృజనాత్మకత**

దినపత్రిక/ వార్తాపత్రికలలో వచ్చే నీతి పద్యాలను సేకరించి మీ మిత్రులతో చర్చించండి. వాటి భావము రాయండి.



**నేనివి నేర్చుకున్నా/తెలుసుకున్నా**

1. సజ్జనుల లక్షణాలు 2. మాటలకున్న శక్తి

95VXUA

**ఉ.నూ:** 1. మీకు తెలిసిన నీతి కథలను, నీతిపద్యాలను విద్యార్థులకు బోధించవలెను.
2. మరికొన్ని నీతి కథలను, నీతి పద్యాలను అంతర్జాలంలో చూడమని విద్యార్థులకు చెప్పవలెను.



# 4. సంతృప్తి

**నేపథ్యం:**

- నీవద్ద ఉన్న వాటికి తక్కువగాను
  నీవద్ద లేని వాటికి ఎక్కువ గాను
  విలువ కట్టడమే 'సంతోషానికి' అడ్డుగోడ

- నీకు ఏయే విషయాలు సంతోషాన్నిస్తాయి?
  ఇప్పుడు ఉడుత - తోడేళ్ళు ఏమని సంభాషించుకున్నాయో చూద్దామా!

కుచ్చుతోక నాడిస్తూ
కొమ్మ లెక్కిదూకేస్తూ
ఉడత ఒకటి సరదాగా
అడవిలోన తిరుగసాగె 1



అంతలోన పట్టు తప్పి
ఆకతాయి ఉడత తూలి
నేలపై పరుండినతో
డేలు మీద జారి పడియె 2




హుమ్మని తోడేలు ఉడత
నొడిసి పట్టి చంపబోవ
విడువు మంచు దీనంగా
ఉడుత వేడుకోసాగెను. 3



విడిచి పెట్ట మంటావా?
ఉడతమ్మా సరేగాని
సందేహం నాకొక్కటి
ఉంది నీవు తీర్చాలది. 4



ఏ వేళను నిను జూచిన
ఎంతో సంతోషంతో
అరచుచుందు వెగురుచుందు
వది యెట్లా సాధ్యమయ్యె 5






గుప్పెడైన లేని నీకు
కో కొల్లగ తృప్తి యేమి
నేనింతటి వాణ్ణి కదా!
ఏలనాకు సుఖం లేదు? 6

అప్పుడిట్లు పలికె నుడుత
'అయ్యో తోడేలు గారు
వదిలేస్తే కొమ్మ ఎక్కి
పదిలంగా పలుకగలను' 7

తోడేలుకు జాలిపుట్టె
ఉడతమ్మను విడిచిపెట్టె
మెరపులాగ కొమ్మమీది
కురికి ఉడత చెప్పెనిట్లు 8





పరులకెపుడు కీడు చేసి
ఎరుగని మా ఉడుత జాతి
కానందం కాకేమిటి
సంతృప్తికి లోటేమిటి? 9

**I. వినండి-సంభాషించండి.**

1. దేనిని తృప్తి అంటారు?
2. మీకు తృప్తిని కలిగించిన ఏదైనా ఒక సంఘటన గురించి చెప్పండి.
3. యూ ట్యూబ్‌లో చూసి, చదివి, మీకు నచ్చిన కథలను గూర్చి సంభాషించండి.

**II. చదవండి-ఆలోచించండి-రాయండి.**

**పదజాలం పెంపొందించుకుందాం-భావాలు నేర్చుకుందాం.**

పట్టు తప్పి = పట్టుకున్నది జారి; ఆకతాయి = అల్లరి; ఒడిసిపట్టి = గట్టిగా పట్టుకొని; సందేహము = అనుమానము; కోకొల్లగ = అధికముగా; మిక్కుటముగా = ఎక్కువగా; పదిలంగా = చక్కగా, జాగ్రత్తగా.

1. ఒక ఉడత ఒక కొమ్మనుంచి మరొక కొమ్మ మీదకి దూకుతూ తన తోకను ఆడిస్తూ అడవిలో తిరుగసాగింది.
2. అంతలోనే పట్టుతప్పి ఆ అల్లరి ఉడుత నేలమీద పడుకొని ఉన్న తోడేలు మీద పడింది.
3. తోడేలు దానిని గట్టిగా పట్టుకొని చంపుటకు ప్రయత్నించబోగా తనను విడిచిపెట్టమని ఆ ఉడుత దీనంగా వేడుకోసాగింది.
4. ఓ ఉడతమ్మా! నిన్ను విడిచిపెట్టమంటావా? అది సరేగాని నాకు ఒక అనుమానం ఉన్నది. నువ్వు దానిని తీర్చాలి.
5. నువ్వు ఎప్పుడు చూచినా ఎంతో సంతోషంతో అరుస్తుంటావు ఎగురుతుంటావు. అది ఎలా సాధ్యమైంది?
6. ఇంత చిన్నదానివైన నీకు అంత సంతోషము ఎట్లు కలిగినది. నేను ఇంత గొప్పవాణ్ణి కదా! నా కెందుకు సుఖము లేదు.
7. అప్పుడా ఉడుత తోడేలుతో "నన్ను వదిలి పెట్టినచో కొమ్మ ఎక్కి జాగ్రత్తగా అంతయు చెప్పెదను" అనెను.
8. తోడేలుకు జాలి కలిగి, దానిని విడిచిపెట్టెను. అప్పుడు ఆ ఉడత కొమ్మ ఎక్కి ఇట్లు చెప్పసాగెను.
9. ఎప్పుడూ మా ఉడతజాతి ఇతరులకు కీడు చేయుట అనునది ఎరుగదు. అటువంటి మాకు ఆనందానికి, సంతృప్తికి కొదువ ఉండదు.



**III. కృత్యము**

**పాఠ్య భాగంలోని కింది పద్యాలను చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.**

**అ. (i) జతపరచండి.**

| | |
|---|---|
| 1. ఉడత సరదాగా | నొడిసిపట్టి చంపబోవ |
| 2. ఆకతాయి ఉడత | అడవిలోన తిరుగసాగె |
| 3. (ఉడత) దీనంగా | తోడేలుపై జారిపడియె |
| 4. తోడేలు ఉడత | వేడుకోసాగెను. |

**(ii) పాఠ్యభాగంలోని 1, 2, 3 గేయఖండిల్లో గల ప్రాసపదాలను ఏరి రాయండి.**

(1, 2, 3 గేయఖండికలు)

**ఆ. స్వీయస్పందన**

"ఉడత తోడేలును వేడుకోవలసి వచ్చింది" ఎందుకు? మీ సొంత వాక్యాల్లో రాయండి.

**IV. వినండి-చర్చించండి-రాయండి.**

**అ. జవాబులు రాయండి.**

1. తోడేలు ఉడతను ఒడిసి పట్టుకొనుటకు కారణము.
2. "ఉడత-తోడేలు" సంభాషణ.
3. ఉడత ఆనందంగా ఉండటానికి కారణం.

ఆ. సరైన పదాన్ని ఎన్నుకొని ఖాళీలను పూరించండి.

1. సరదాగా ________________ లోన తిరుగసాగె.

 1. తోట  2. అడవి  3. ఉద్యానవనం

2. విడిచిపెట్టమంటావా ________________

 1. ఉడతమ్మా  2. కోకిలమ్మా  3. కాకమ్మా

3. ఎంతో ________________ అరచుచుందువు.

 1. దుఃఖంతో  2. సంతోషంతో  3. విచారంతో

4. కొమ్మ ఎక్కి ________________ పలుకగలను.

 1. జాగ్రత్తగా  2. పదిలంగా  3. మెల్లగా

ఇ. ఎవరు ఎవరితో పలికిరి.

1. విడిచి పెట్టమంటావా.
2. కొమ్మ ఎక్కి పదిలంగా పలుకగలను.

ఈ. కింది గేయపాదాలను సరైన క్రమంలో అమర్చి రాయండి.

**సంతృప్తికి లోటేమిటి**

**ఉడత ఒకటి సరదాగా**

**ఏల నాకు సుఖంలేదు**

**అరచుచుందు వెగురుచుందు.**

## V. స్వీయస్పందన:

1. నీకు నచ్చిన ఏదైనా కథను నీ సొంత మాటల్లో రాయి.
2. ఉడత, తోడేలు మధ్య జరిగిన సంభాషణను నీ సొంత మాటల్లో రాయి.

## VI. భాషావగాహన :

అ. ఏ వచనమో రాయండి.

| | | |
|---|---|---|
| 1. | కొమ్మలు | |
| 2. | సందేహము | |
| 3. | జాతులు | |
| 4. | తోడేలు | |

ఆ. గీతగీసిన పదాలను ఆయా భాషాభాగాలతో జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. | తోడేలుకు <u>జాలిపుట్టె</u> | అ. | నామవాచకము |
| 2. | <u>ఉడతమ్మను</u> విడిచిపెట్టి | ఆ. | క్రియ |
| 3. | <u>సంతోషంతో</u> అరచుచుండ | ఇ. | సర్వనామం |
| 4. | <u>నేను</u> ఇంతటివాణ్ణి | ఈ. | విశేషణము |

ఇ. కలిపి రాయండి.

1. కొమ్మలు + ఎక్కి
2. ఉడత + అమ్మ
3. అది + ఎట్లా
4. తీర్చాలి + అది

**VII. సృజనాత్మకత**

**1. గడినుడిలోని అక్షరాలతో పదాలు రాయండి.**

| | | | |
|---|---|---|---|
| జా | తో | ప | నం |
| డే | లి | సు | ద |
| లు | ఆ | పు | ము |
| అ | గ్గి | పె | ట్టె |

1. ____________ 2. ____________

3. ____________ 4. ____________

5. ____________ 6. ____________

**2. 'మేక-తోడేలు కథ' అంతర్జాలంలో చదివి మీ సొంత వాక్యాల్లో రాయండి.**

**VIII. లేఖననైపుణ్యాలు:**

**1. వ్యాసరచన:**

**వర్ణనాత్మకం**

కింది పదాల ఆధారంగా సముద్ర తీరాన్ని గురించి 8-10 వాక్యాల్లో వర్ణనాత్మక లేఖనం చేయండి.

సముద్రతీరం → అలలు → సుందర ప్రదేశం → ప్రకృతి సౌందర్యం → నా అనుభూతి

**2. కింది అంశాల ఆధారంగా కథ రాయండి. తగిన శీర్షిక పెట్టండి.**

**కథాలేఖనం:**

రంగడు ఎండిన కొమ్మలు కొట్టుటకు అడవికి వెళ్ళుట – గొడ్డలి నదిలో పడుట – రంగడు దుఃఖించుట –

వనదేవత ప్రత్యక్షమగుట – బంగారు గొడ్డలి చూపుట రంగడు తనది కాదనుట – వెండి గొడ్డలి చూపుట –

రంగడు నిరాకరించుట – దేవత రంగడి గొడ్డలి చూపుట – రంగడి సంతోషం –

దేవత రంగడి నిజాతీకి మెచ్చి మూడింటిని రంగడికి ఇచ్చుట



**నేనివి నేర్చుకున్నా.**

1. ఇతరులకు కీడు చేయకూడదు.
2. ఉన్నదానితో తృప్తినొందవలెను.
3. అల్పులు, గొప్పవారు అను బేధ భావాన్ని చూపరాదు.

9HA7AU

**వి.సూ:** కొన్ని గేయ కథలను సేకరించండి.



# 5. ఉగాది పండుగ

**నేపథ్యం:**

- పండుగలు ప్రజల ఆశలకు, ఆశయాలకు దర్పణాలు, ఐక్యతకు, ప్రగతికి ప్రతిరూపాలు. ఆనందానికి, మనోరంజనమునకు నిలయాలు.
- జతపరచండి.

| | | |
|---|---|---|
| శ్రీ కృష్ణజయంతి | – | గుడిపాడ్వా |
| ఉట్లపండుగ | – | జన్మాష్టమి |
| ఉగాది | – | దహిహాండి |


సాధారణంగా నూతన సంవత్సర ప్రారంభంలో కొన్ని మంచి నిర్ణయాలు తీసికొని వాటిని కొనసాగించాలని ప్రతిజ్ఞ చేసుకోవడం పరిపాటి.
ఇప్పుడు ఉగాది పండుగ సందర్భంగా శ్రీ గుండాల వెంకట కృష్ణారావు గారు ఏవిధంగా మెలగడం అలవర్చుకోవాలని చెప్పారో కింది గేయం చదివి తెలుసుకుందాం.

వచ్చిందండీ! వచ్చింది!
'ఉగాది' పండుగ వచ్చింది!
తెచ్చిందండీ! తెచ్చింది!
'ఉగాది' పచ్చడి – తెచ్చింది! 1.

తీపీ–చేదూ–వగరూ–పులుపుల
నోరూరించే పచ్చడిదండి!
కష్ట–సుఖమ్ముల సమ్మేళనమే
జీవితమంచును చెప్పను లెండి! 2.

మంచిని పట్టుకు మెలగాలోయ్!
కొంచెము సాయము చేయాలోయ్!
ధన ధాన్యాదులు నిండాలోయ్!
ధర్మం – న్యాయం – ఉండాలోయ్! 3.

లోకం పోకడ తెలియాలోయ్!
దౌర్జన్యము నెదిరించాలోయ్!
'సత్యం–ధర్మం' – పండాలోయ్!
సాధుత్వంతో మెలగాలోయ్! 4.



పిన్నలు – పెద్దలు పెరగాలోయ్!
మంచి మనసుతో ఉండాలోయ్!
ఈర్ష్యా–ద్వేషము మానాలోయ్!
ఎల్లరు ఒకటై ఉండాలోయ్! 5.

మాతృదేశమే గొప్పదిరా!
స్వర్గ సీమనే మించునురా!
తల్లిని మించిన దైవం లేదని
చాటి చెప్పుచూ బ్రతకాలోయ్! 6.





తెలుగు జిలుగులే వెలగాలోయ్!
అంతా ఒకటై నిలవాలోయ్!
'నా–నీ' భేదం పోవాలోయ్!
ఐక్యతతో మనముండాలోయ్! 7.

వచ్చిందండీ! వచ్చింది!
'ఉగాది' పండుగ వచ్చింది!
తెచ్చిందండీ! తెచ్చింది!
'శుభాకాంక్షలే తెచ్చింది!! 8.



**I. వినండి-సంభాషించండి.**

1. ఉగాది పండుగ ఎప్పుడు వస్తుంది?
2. మహారాష్ట్రలో ఉగాది పండుగను ఏ విధంగా జరుపుకొంటారు?

**II. చదవండి-ఆలోచించండి-రాయండి.**

**పదజాలాన్ని పెంపొందించుకుందాం-భావాన్ని నేర్చుకుందాం.**

దౌర్జన్యము = చెడ్డతనము; సమ్మేళనము = కూడిక, సమావేశము; ద్వేషం = పగ, శత్రుత్వం;
ఈర్ష్య = ఓర్వలేకపోవడం (ఓర్వలేనితనం)

1. ఉగాది పండుగ వచ్చింది.
2. ఆ రోజు మనం తినే పచ్చడి తియ్యగా, చేదుగా, వగరుగా, పుల్లగా ఉంటుంది. (అంతేకాదు ఇది ఉప్పగా, కారంగా కూడా ఉంటుంది) మనకి నోరు ఊరిస్తుంది. జీవితమంటే కష్టం, సుఖం కలిసి ఉంటాయని మనకి తెలియజేస్తుంది.
3. ప్రజలందరూ మంచితనంతో కలిసిమెలిసి ఉండాలి. అందరికీ సహాయం చేయాలి. ధర్మాన్ని, న్యాయాన్ని కలిగి ఉండాలి. అందరి ఇళ్ళు ధన, ధాన్యాలతో కళకళలాడుతుండాలి.
4. లోకం యొక్క ధోరణి తెలుసుకోవాలి. దౌర్జన్యాన్ని ఎదిరించాలి. సత్యాన్ని ధర్మాన్ని పాటిస్తూ ఉండాలి. అందరితో అణకువగా నడుచుకోవాలి.
5. పిల్లలు, పెద్దలు మంచి మనసుతో ఉండాలి. ఈర్ష్యా, ద్వేషాలు మాని అందరు ఒకటిగా ఉండాలి.
6. మాతృదేశం స్వర్గం కంటె గొప్పది. తల్లిని మించిన దైవం లేదని ఎలుగెత్తి చాటుతూ బ్రతకాలి.
7. తెలుగువారి గొప్పదనం వెలగాలి. అందరూ ఒకటిగా ఉండాలి. నువ్వు-నేను అన్న తేడా ఉండకూడదు. కలిసి మెలసి ముందుకు సాగాలి.
8. ఈ విధంగా మనమంత ఐక్యంగా ఉండాలని మనందర్ని ఒకటిగా చేయడానికి ఉగాది పండుగ వచ్చింది. మనందరికి మంచి జరగాలని శుభాకాంక్షలు తెలుపుచున్నది.

**III. కృత్యము**

**కింది గేయచరణాలను చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.**

**అ. (i) జవాబులు రాయండి.**

1. కవి పండాలన్నవి
2. కవి ఉండాలన్నవి



**(ii) గేయంలోని ఏవేని రెండు ప్రాస పదాలను ఏరి రాయండి.**

పాఠ్యభాగములోని క్రింది 3, 4 గేయ చరణాలను చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

**ఆ. దేశంలోని ప్రజలు ఏ విధంగా ఉండాలని కవి తెలుపుచున్నాడో మీ సొంతమాటల్లో రాయండి.**

**IV. చదవండి-చర్చించండి-రాయండి.**

**అ. జవాబులు రాయండి.**

1. ఉగాది పండుగను ఎందుకు జరుపుకుంటారో చర్చించండి.
2. ఉగాది పచ్చడి ఏమని ప్రబోధిస్తుంది?
3. జనులు ఏ విధంగా ఉండాలని 'ఉగాది' గేయంలో కవి తెల్పారు.

ఆ. కుండలీకరణములో ఇచ్చిన పదాలను ఉపయోగించి ఖాళీలను పూరించండి.

(ద్వేషం, జిలుగు, దౌర్జన్యము, తల్లిని, న్యాయం)

1. ధర్మం ________________ ఉండాలోయ్
2. ________________ నెదిరించాలోయ్
3. ఈర్ష్య ________________ మానాలోయ్
4. ________________ మించిన దైవములేదు.
5. తెలుగు ________________లే వెలగాలోయ్

ఇ. క్రింది వాటిని జతపరచుము.

| 'క' వర్గము | 'చ' వర్గము |
|---|---|
| 1. ధన | అ) పోకడ |
| 2. పిన్నలు | ఆ) ధాన్యాదులు |
| 3. లోకం | ఇ) మనసు |
| 4. కష్ట | ఈ) పెద్దలు |
| 5. మంచి | ఉ) సుఖమ్ముల |
| | ఊ) ధైర్యము |

**చదువుకుందాం – చకితులమౌదాం**

1. మీకు తెలుసా! తెలుగు భాషకు దాదాపు ముప్పయి మాండలికాలు వాడుకలో ఉన్నాయి.
2. మారిషస్‌లో రేడియో, టీవీలలో తెలుగు కార్యక్రమాలు ప్రసారమవు తుంటాయి.
3. మయన్మార్ రాజధాని యాంగన్‌లో ఒక తెలుగు గ్రంథాలయం ఉంది. దాని పేరు **'శ్రీయోగి వేమన గ్రంథాలయం'**
4. మయన్మార్ ఒక వీధికి అతిపెద్ద నగరాలలో ఒకటైన మూలమ్యీన్‌లో **'మల్లెపూల దిబ్బ'** అనే అచ్చ తెలుగు పేరు ఉన్నది.

V. స్వీయస్పందన

1. ఉగాది పండుగను మీరు ఎలా జరుపుకొందురో మీ సొంత మాటల్లో రాయండి.
2. ఉగాది పచ్చడిని ఎలా తయారు చేస్తారో మీ సొంత మాటల్లో రాయండి.

VI. భాషావగాహన

అ. గీతగీసిన ప్రత్యయాలు, ఏ విభక్తులో గుర్తించి పట్టికలో రాయండి.

| ప్రత్యయాలు | విభక్తులు |
|---|---|
| 1. ధన ధాన్యాదులు నిండాలోయ్. | ________________ |
| 2. మంచిని పట్టుకు మెలగాలోయ్. | ________________ |
| 3. సాధుత్వంతో మెలగాలోయ్. | ________________ |

ఆ. కింది వాటికి వ్యతిరేక పదాలు రాయండి.

1. సత్యము x ______
2. ధర్మము x ______
3. న్యాయము x ______
4. ______ x అనురాగము

ఇ. సంధి విడదీసి రాయండి.

1. జీవితమంచు : ........................................ + ........................................
2. ధాన్యాదులు : ........................................ + ........................................
3. శుభాకాంక్షలు : ........................................ + ........................................

**VII. సృజనాత్మకత**

అ.
1. వివిధ రాష్ట్రాల్లో ఉగాది ఎలా జరుపుకుంటారో అంతర్జాలము ద్వారా తెలుసుకొని రాయండి.
2. తెలుగు దేశపు అభివృద్ధికి పాటుపడిన వ్యక్తుల గురించి అంతర్జాలము ద్వారా తెలుసుకొని రాయండి.
3. చిత్రాన్ని చూచి ఈ పండుగను మహారాష్ట్రలో ఏ విధంగా జరుపుకుంటారో రాయండి.
4. ఉగాది సందర్భంగా సొంతంగా రాసిన శుభాకాంక్షలను వాట్సప్ ద్వారా మీ స్నేహితులకు, బంధువులకు పంపించండి.



ఆ. **అనువాదం: తెలుగులోకి అనువదించండి.**

1. Unity is strength ____________________________
2. I love my Motherland _________________________
3. Help others __________________________________
4. Respect your Parents. _________________________

**VIII. జట్టుపని :** ఉగాది పచ్చడిని ఏవిధంగా తయారు చేస్తారో అంతర్జాలం ద్వారా సేకరించండి. విద్యార్థులు రెండు జట్లుగా ఏర్పడి పచ్చడిని తయారు చేసి చక్కగా తినండి/త్రాగండి.

### సమాచార ప్రసార సాంకేతిక పరిజ్ఞానము (ICT)

యూనికోడ్ ఫాంట్ల వల్ల సునాయాసంగా కంప్యూటర్‌లో తెలుగు టైప్ చేయవచ్చు. ఫాంట్ అనగా ఒకే శైలిలోని అచ్చు అక్షరాల మొత్తం అనవచ్చు. యూనికోడ్ ఫాంట్ (Unicode font) అనునది పెక్కు అక్షరాలు, చిహ్నాలు, అంకెలు మొదలగు వాటితో కూడిన కంప్యూటర్ ఫాంట్

ప్రాంతీయ భాషలలో కంప్యూటర్ పై పని చేయుటకు మొదటి ప్రాంతీయ భాషను, మనకు కావలసిన కీబోర్డ్ లే అవుట్‌ను ఎన్నుకోవాలి. తరచుగా వాడే కీబోర్డ్‌లు రెండు రకాలు.

ఫొనెటిక్ కీబోర్డ్ (Phonetic Keyboard) అక్షరాలు, పదాలు ఉచ్చారణ అనుసారం ఇంగ్లీషులో టైప్ చెయ్యడం.

| | | |
|---|---|---|
| Namaste – నమస్తే | Shubham– శుభం | Patnam – పట్నం |
| Kartavyam – కర్తవ్యం | Patrika – పత్రిక | Dabbu – డబ్బు |
| Pakshi – పక్షి | Rushi – ఋషి | Baanamu – బాణము |



ఇన్‌స్క్రిప్ట్ కీబోర్డ్ (Inscript Keyboard) దీనిని ఉపయోగించుటకు వర్ణమాల, గుణింతాలు ఎలాటైప్ చెయ్యాలో తెలిసి ఉండాలి.

కీబోర్డ్ లేఅవుట్‌ను స్క్రీన్‌పై పెట్టుకొని దాని సహాయంతో టైప్ చేసుకోవచ్చు. అవసరమైతే ఆన్‌లైన్ నిఘంటువులను సంప్రదించవచ్చును. ఈ విధంగా 'ఈమెయిల్'లో కూడా తెలుగులో టైప్ చెయ్యవచ్చును. ఇప్పుడు మీరు తెలుగులో మంచి చక్కని ఆకర్షణీయమైన శుభాకాంక్షల కార్డులు తయారు చేసి స్నేహితులకు, బంధువులకు ఈమెయిల్ ద్వారా పంపండి.



**నేనివి నేర్చుకున్నా/తెలుసుకున్నా.**

పండుగలు జరుపుకోవడం వలన వాటి వెనుక ఉన్న చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలు

9HJ3CH

**ఉ.సూ:** విద్యార్థులకు దసరా, దీపావళి మొదలైన పండుగల గురించి వివరించి, వాటిని జరుపుకొనుటలో వాటి వెనుక ఉన్న ఆంతర్యాన్ని వివరించండి.



# 6. వాషింగ్టన్

**పాఠంలోకి ప్రవేశించే ముందు.**

- మనిషి జీవితంలో అతి ముఖ్యమైనది – ప్రతి మనిషి తన పనిని నిజాయితీగా చేయడం – షేక్స్పియర్.
- తన కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తించే వ్యక్తి మిగతా అందరికన్నా మిన్నగా ప్రజాసేవ చేయగలుగుతాడు – జవహర్‌లాల్ నెహ్రూ..
- అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో వాషింగ్టన్ యొక్క నాయకత్వం గురించి ఉపాధ్యాయునితో చర్చించండి.

శ్రీ నాళం కృష్ణారావుగారు ఈ పాఠంలో వాషింగ్టన్ యొక్క సహానుభూతి, నిరాడంబరత, కర్తవ్యనిష్ఠలను వివరించిన తీరును చూద్దాం.


---

పాంథుడొక్కడు పట్టణ పరిసరమున
హయముపై నెక్కి యెచటకో అరుగు చుండె,
ఊరి వెలుపల కొందరు యుద్ధభటులు
త్రోయుచుండిరి బరువైన దూలమొకటి (1)

బలిమియై వారలందఱు పట్టిపెనగి
అదిమి లాగిన దూలంబు కదలదయ్యె
పట్టు, డెత్తుడు, నెట్టుడు, కట్టిలాగు
డంచు నొక్కడు వారి గద్దించుచుండె (2)

పథికుడది చూచి వానితో బలికెనిట్లు
అయ్యా ఇటు చేయుడటు సేయు డంచు నిల్చి
నుడువు కంటెను నీవును నడుము కట్టి
సాయమొనరించి కార్యంబు చేయరాదె? (3)

చుఱుకు చుఱుకున నాతండు చూచి అనియె
''నన్నుకేవల సామాన్య నరుని రీతి
మాటలాడెదు తారతమ్యంబు లేక
ఎవ్వరనుకొంటి? సేనాని జువ్వె యేను'' (4)




''అహహ! మీరలంతటి మహామహులటంచు
ఎఱుగ కాడితి నన్ను క్షమింపుడయ్య''
అనుచు తెరువరి మెల్లన హయము డిగ్గి
శక్తి కొలదిని భటులకు సాయపడియె (5)

తోడనే వారు పథికుండు తోడుపడగ
ఎత్తిరవలీల దూల మువ్వెత్తు గాగ
చెంత నిలుచుండె నడుమున జేయివైచి
భూవరుండన దళవాయి ఠీవి మెఱయ (6)

అంత తెరువరి నవ్వుచు నతని కనియె
''అన్న! ఎపుడైన పనియున్న నన్ను పిలువు,
డన్యుడనుగాను, సర్వసైన్యాధిపతిని,
నన్ను పిలుతురు, 'వాషింగుటన్నటంచు.'' (7)

అంత పడవాలు గ్రక్కు మిక్కనగ లేక
చిత్తరువు రీతి నిలబడి చేష్టలుడిగి
సెల వొసంగుడు పోయివచ్చెద నటంచు
చనియె తెరువరి వేగ నశ్వంబు నెక్కి (8)





**ఉ.సూ:** అహంకారముతో రాజ్యాలను పోగొట్టుకున్న రాజుల గురించి విద్యార్థులకు తెలియజేయండి.
ఉదా. రావణాసురుడు, ఇంద్రుడు మొదలగువారు.

**I.** **వినండి-సంభాషించండి.**

1. రక్షక భటులు దేశాన్ని రక్షించే విధము.
2. "కొండ యద్దమందు కొంచెమైయుండదా" చర్చించండి

**II.** **చదవండి-ఆలోచించండి-రాయండి.**

**పదజాలాన్ని పెంపొందించుకుందాం-భావాలను నేర్చుకుందాం.**

పాంథుడు = బాటసారి; ఉన్నేత్తు = మిక్కిలిఎత్తు; హయము - గుఱ్ఱము; భూవరుండు = ప్రభువు; అరుగుచుండె = వెళ్ళుచుండెను; దళవాయి = సేనాని; పెనగి = ప్రయత్నించి; ఠీవి = గాంభీర్యము; గద్దించు = అదలించు; అన్యుడనుగాను = పరాయివాడనుగాను; పథికుడు = బాటసారి; పడవాలు = సేనాని; నుడువుట = చెప్పుట; గ్రక్కుమిక్కనగలేక = మారు మాట్లాడలేక; కార్యంబు = పని; తారతమ్యము = వ్యత్యాసము; చిత్తరువు = బొమ్మ, చిత్రము; చుమ్మె = సుమా; ఏను = నేను; చేష్టలుడిగి = కదలిక కోల్పోయి; ఆడితి = పలికితిని; అశ్వంబు = గుఱ్ఱము; తెరువరి = బాటసారి; డిగ్గి = దిగి; అవలీలగా = సులభముగా

1. బాటసారి ఒకడు గుఱ్ఱము పైనెక్కి పట్టణపరిసరము మీదుగా ఎక్కడికో వెళ్ళుచుండెను. పట్టణము బయట కొందరు యుద్ధ భటులు ఒక బరువైన దూలమును త్రోయుటకు యత్నించుచుండిరి.
2. యుద్ధభటులు తమ బలమంతయు ఉపయోగించి ఎంతగా ప్రయత్నించినను ఆ దూలము కదల కుండెను. ఒక వ్యక్తి అచట నిలబడి "పట్టండి, ఎత్తండి, నెట్టండి, కట్టిలాగండి" అని వారిని గద్దించుచుండెను.
3. అది గమనించిన బాటసారి ఆ వ్యక్తితో "అయ్యా! నీవు నిలబడి ఇలా చేయండి, అలా చేయండి అని వారితో చెప్పుటకంటే నీవును పూనుకొని వారికి సహాయపడి ఆ పనిని చేయరాదా!" అని అనెను.
4. ఆ వ్యక్తి బాటసారిని కొఱకొఱ చూచుచు "నన్ను కేవలము సామాన్య మానవునిగా తలచి, వ్యత్యాసమును ఎంచక మాట్లాడు చున్నావు. నన్ను ఎవరనుకున్నావు? నేను సేనానిని సుమా!" అనెను.
5. "ఓహో! మీరు అంతటి మహానుభావులని తెలియక మాటలాడితిని. అయ్యా! నన్ను క్షమించుడు" అని బాటసారి గుఱ్ఱము పైనుండి దిగి తన శక్తికొలది ఆ యుద్ధభటులకు సహాయపడెను.
6. బాటసారి సహాయపడినంతనే భటులు దూలమును సులభముగ పైకెత్తగలిగిరి. సేనాని నడుముపై చేతులుంచుకొని గాంభీర్యము ప్రకాశింప రాజువలె సమీపమున నిలబడియుండెను.
7. ఆ తరువాత బాటసారి చిఱునవ్వుతో సేనానిని చూచి ఎప్పుడైనా పని ఉన్నచో నన్ను పిలవండి. నేను పరాయివాడనుకాను, సర్వసైన్యాధిపతిని. నన్ను 'వాషింగ్‌టన్' అని పిలుస్తారు" అనెను.
8. ఆ మాటలు విన్న సేనాని మారు మాట్లాడలేక కదలికను కోల్పోయి బొమ్మవలె నిలుచుండి పోయెను. "నాకిక సెలవు ఇవ్వండి, వెళ్ళివచ్చెదనని పలుకుచు" ఆ బాటసారి గుఱ్ఱము నెక్కి వేగముగా వెళ్ళిపోయెను.



**III. కృత్యము: కింది పద్యాలను చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.**

**(i) అల్లిక పూరించండి.**

కదలని దూలాన్ని ఇలా చేయమని సేనాని చెప్పాడు

**(ii) కింది పదములకు వచనములు మార్చి రాయండి.**

1. భటుడు ______________  2. వారు ______________

(ఒకటి నుండి నాలుగు పద్యాలు)

**ఆ. స్వీయస్పందన**

నీవు ఇతరులకు చేసిన సహాయాన్ని నీ సొంతమాటల్లో రాయుము.

**IV. వినండి-చర్చించండి-రాయండి.**

**అ. జవాబులు రాయండి.**

1. బాటసారికి – సేనానికి మధ్య జరిగిన సంభాషణ
2. యుద్ధభటులకు బాటసారి సహాయపడిన విధము
3. సేనాని బొమ్మలా నిలబడడానికి కారణము.
4. దూలాన్ని ఎత్తడానికి యుద్ధ భటులు చేసిన ప్రయత్నాలు.

**ఆ. సరియైన సమాధానాన్ని గుర్తించండి.**

1. దీనిని అవలీలగా ఎత్తారు.

   అ. కర్రను  ఆ. దూలమును  ఇ. స్తంభమును

2. పాంథుడు ఎక్కినది

   అ. హయము  ఆ. రథము  ఇ. గజము

**ఇ. కింది వాక్యాలను ఎవరు ఎవరితో పలికిరి.**

1. "ఎవ్వరను కొంటి? సేనాని జువ్వెయేను"
2. "ఎపుడైన పనియున్న నన్ను పిలువు".

**V. స్వీయవ్యక్తీకరణ**

1. బాటసారికి సేనానికి మధ్య జరిగిన సంభాషణను మీ సొంత మాటల్లో రాయండి.
2. వాషింగ్‌టన్ గూర్చి సొంతమాటల్లో రాయండి.

**VI. భాషావగాహన**

**అ. వ్యతిరేక పదాలు రాయండి.**

1. అకార్యము x ______  2. లోపల x ______  3. తేలికైన x ______  4. మెల్లగా x ______

**ఆ. పదాలను కలిపి రాయండి.**

1. బరువు + ఐన  2. వారలు + అందఱు  3. దూలము + ఒకటి  4. పలికెను + ఇట్లు

**VII. సృజనాత్మకత**

గర్వము వల్ల సామ్రాజ్యాన్ని కోల్పోయిన దుర్యోధనుని కథను అంతర్జాలంలో నుండి గ్రహించి రాయండి. (సంక్షిప్తంగా)

**VIII. లేఖన నైపుణ్యాలు: ప్రకటన**

ప్రియదర్శిని పాఠశాల విద్యార్థుల విహారయాత్ర

కింది సమాచారాన్ని చదివి ప్రకటన తయారు చేయండి.

తేది : 08.12 2018
చిరునామా : కేశవ సృష్టి, భయందర్
విషయం : విహార యాత్ర
రుసుం : 200 రూ..లు
సమయం : ఉదయం 7.00 నుండి సాయంత్రం 6.00 గం..లు



**నేనివి నేర్చుకున్నా:**

ఎంతగొప్ప పదవికి వెళ్ళినా వినయ విధేయతలను కలిగి ఉండాలి.

9HSYE5



# పుస్తక ప్రియుల స్వర్గం

పుస్తక పఠనం చాలా మహత్తరమైనది. దీనిని అలవరచుకోవడం ఎంతేని అవసరం. అందుకే అంటారు 'ఒక చినిగిన చొక్కా అయినా తొడుక్కో. కాని ఒక మంచి పుస్తకాన్ని కొనుక్కో' అని. ఈ ప్రాముఖ్యతను గుర్తించి 2017వ సంవత్సరం, మే 4వ తేదిన, మహారాష్ట్రలోని, సతారా జిల్లా, భిలార్ (మహాబలేశ్వర్, పంచ్‌గని హిల్ స్టేషన్ కు 8 కి.మీ దూరంలోని) గ్రామం "పుస్తకాల గ్రామంగా" ఏర్పరచబడింది. దీనిని భారతదేశంలోని మొదట్టమొదటి 'పుస్తకాల గ్రామం'– 'Village of Book' 'पुस्तकांच गाव' గా పేర్కొనవచ్చు. దీనికి బ్రిటన్ లోని హే – ఆన్ – వేయ్ ఊరు స్ఫూర్తినిచ్చిందట.

ఇప్పుడు ఈ ఊరుని గురించి శ్రీ పుట్టగంట సురేష్ గారు వ్రాసిన పదాల గారిడి (తారుమారైనపదాలను సరియగు స్థానంలో ఉంచి) కథను చదవండి. స్ఫూర్తిని పొందండి.

చదువంటే మక్కువ చూపే రిచర్డ్ బూత్ **కూరగాయల** యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశాడు. అతని తండ్రికి లండన్ నుండి 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేల్స్‌లోని హే–ఆన్–వేయ్ అనే ఊర్లో ఓ చిన్న పుస్తకాల దుకాణం ఉంది. గలగలా పారే వేయ్ నది గట్టున ఉన్నందున ఆ ఊరికి హే–ఆన్–వేయ్ అని పేరు వచ్చింది. ఈ ఊరు సెకండ్ హ్యాండ్ పుస్తకాల అంతర్జాతీయ కేంద్రంగా మారి అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించడానికి కారణం ఈ కథలోని మన హీరో రిచర్డ్ బూత్. "ఈ పెద్ద వ్యాపారుల పోటీ తట్టుకోవడం నాలాంటి చిన్న వ్యాపారుల తరం కాదు. ఏదైనా ప్రయోగం చేయాలి" అన్న తపనతో రిచర్డ్ రగిలిపోయాడు. లండన్‌కి చాలా దూరం లో ప్రశాంతమైన **విప్లవం** కలిగి ఉన్న హే–ఆన్–వేయ్‌లో పుస్తక నగరం ప్రారంభించాలన్న ఆలోచన అతనికి వచ్చి 1977 ఏప్రిల్ ఒకటో తేదీన హే–ఆన్–వేయ్‌ని ప్రత్యేక స్వతంత్ర ప్రాంతంగా ప్రకటించాడు. దాంతో అందరూ అతడికి 'పిచ్చివాడు' అనే బిరుదునిచ్చారు. అందుకు రిచర్డ్ గుండెలో **స్క్రూళ్ళు** బద్దలవలేదు. అతడు పట్టు విడని విక్రమార్కునిలా వేల్స్, ఇంగ్లండ్, స్కాట్లాండ్, ఇతర యూరప్ రాష్ట్రాల యూనివర్సిటీలలో **జనాభా** అరిగేలా తిరుగుతూ పుస్తకాల అన్వేషణలో పడ్డాడు. అతడు తన ప్రయోగం గురించి అక్కడి పెద్దలకు చెబితే అతడికి ప్రశంసలు, విమర్శలు సమానంగా లభించాయి. అయితే అతడి ఊరి **ఆక్స్‌ఫర్డ్** అతడిని మెచ్చుకున్నారు. రిచర్డ్‌కు అతడి భార్య అండగా నిలిచి పోటోగ్రఫీ, **చెప్పులు**, పుస్తకాల దుకాణాన్ని ప్రారంభించింది. మొత్తానికి రిచర్డ్ ఇరవై ఐదు దేశాల నుంచి దాదాపు లక్ష పుస్తకాలను సేకరించి వ్యాపారాన్ని అభివృద్ధి చేశాడు. అతడి కృషి ఫలితంగా నేడు హే–ఆన్ వేయ్ పుస్తకాల రాజధానిగా మారిపోయింది. అక్కడి ఇళ్ళు, వాతావరణం, చర్చి అన్నీ పుస్తక దుకాణాలుగా మారిపోయి ఊరంతా పుస్తకమయం అయిపోయింది. ఆ ఊళ్ళోని వీధుల్లో, రహదారుల్లో **అగ్నిపర్వతాలు** వలె బుట్టల్లో పుస్తకాలను విక్రయిస్తారు. అక్కడ అగ్గిపెట్టెల్లో దాచిన చిన్న పుస్తకం నుంచి తలపై పెట్టుకు వెళ్ళే పెద్ద పుస్తకాల వరకు లభిస్తాయి. పుస్తక ప్రియుల కోరికలను తీర్చే ఈ ఊరికి దేశ విదేశాల నుంచి ప్రతి సంవత్సరం పదిహేను లక్షలమంది సందర్శకులు విచ్చేస్తుంటారు. రెండువేల **ప్రముఖులు** కలిగిన ఈ చిన్న ఊరిలో తలెత్తిన పుస్తక **ఎంబ్రాయిడరి** యూరప్, అమెరికా మొదలైన దేశాలకు కూడా వ్యాపించింది అమెరికాలో హే–ఆన్–వేయ్ తరహాలో రెండు పుస్తక నగరాలు అవతరించాయి. ప్రపంచంలో ఎక్కడ ఏ కొత్త పుస్తకం వచ్చినా అది ఈ ఊర్లో దొరుకుతుంది. అంతే కాక ఎక్కడా దొరకని పుస్తకం ఇక్కడ లభిస్తుంది. 'హే–ఆన్–వేయ్'ని ప్రపంచ పుస్తక రాజధానిగా రూపొందించిన కారణ పురుషుడైన రిచర్డ్ బూత్‌ని అభినందించి తీరాలి.

మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411 004.

तेलुगु सरलभारती ( तेलुगु माध्यम) इयत्ता दहावी

₹ 42.00



